epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

7-7-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 156 పేజీలు: 8+16 వెల: 6.50

కరీంనగర్

: fb.com/vaartha Digital

Published from Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

మండే గెలాక్సీ సాహిత్య

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



ఇంగ్లండ్ 271 ఆలౌట్

## రెండో టెస్టులో భారత్

# ఘన విజయం

### 336 పరుగుల తేడాతో ఇంగ్లండ్ జట్టు ఓటమి

### ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా శుభ్‌మన్‌గిల్

**బర్మింగ్‌హామ్, జూలై 6:** బర్మింగ్‌హమ్‌లో భారత జట్టు రికార్డు సృష్టించింది. బజ్ బాల్ ఆటతో ప్రత్యర్థుల భరతం పట్టే ఇంగ్లండ్‌ను చిత్తుగా ఓడించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(269, 161) విధ్వంసక బ్యాటింగ్‌కు.. ఆకాశ్ దీప్(6/99) అద్భుత బౌలింగ్ తోడవ్వగా చరిత్రలో నిలిపోయే విక్టరీ సాధించింది. ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టును వణికించిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో స్టోక్స్ బృందంపై 336 పరుగులతో చిరస్మరణీయ విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా శుభ్‌మన్‌గిల్ నిలిచాడు. ఐదు టెస్టుల అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భారత్ బోణీ కొట్టింది. లీడ్స్‌లో అనూహ్య ఓటమి నుంచి తేరుకున్న భారత జట్టు ఎడ్జ్‌బాస్టన్‌లో దెబ్బతిన్న సింహంలా గర్జించింది. తొలి రెండు రోజులు నాలుగో రోజు ఆధిపత్యం చెలాయించిన భారత్ ఆఖరి రోజు ఇంగ్లండ్‌ను ఓటమి రుచి చూపించింది. తొలి ఇన్నింగ్స్‌లో >>2



17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వాతో ప్రధాని మోదీ

### 'బ్రిక్స్' సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

### అంతర్జాతీయ సంస్థల్లో సుపరిపాలన సంస్కరణలు అవశ్యం

### ప్రపంచ వేదికల్లో గ్లోబల్ సౌత్‌కు తగ్గుతున్న ప్రాధాన్యం

## సరిహద్దు ఉగ్రవాదంపై

# ఉమ్మడిపోరు



ఆదివారం రియోడి జనీరోలో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న వివిధ దేశాధినేతలు

**రియోడిజెనీరో, జూలై 6:** ప్రపంచ ఆర్థికవ్యవస్థకు అత్యధిక వాటాను అందిస్తున్న దేశాలను నిర్ణయాత్మక వేదికల్లోప్రాధ్యాత కనిపించడం లేదని, గ్లోబల్ సౌత్ అనేది ఇపుడు ద్వంద్వప్రమాణాలతో సతమతం అయిపోతున్నదని ప్రధానిమోడీ అన్నారు. ఆదివారం బ్రిక్స్ సమావేశాల ప్రారంభ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇలాంటి అంతర్జాతీయ సంస్థలు, వేదికలకు అత్యవసరంగా సంస్కరణలు రావాలని, వాటిలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికూడా ఉన్నదని ప్రధాని పేర్కొన్నారు. మానవాళిలోని మూడింట రెండొంతుల దేశాలకు అంతర్జాతీయ సంస్థల్లో సరైన భాగస్వామ్యంలేదని, 20వ శతాబ్దంలో స్థాపించిన సంస్థల్లోకూడా ప్రాతినిధ్యం లేదన్నారు. ఈసంస్థల్లో గ్లోబల్‌సౌత్‌కు ప్రాధాన్యం లేదని అన్నారు. ఈ సంస్థలు ఇపుడు సిమ్‌కార్డుతోమొబైల్‌ఫోన్ ఉన్నప్పటికీ నెట్‌వర్క్ లేని వ్యవస్థగా తయారయ్యాయని చమత్కరించారు. బ్రెజిల్‌లోని రియోడీజెనీరోలో ప్రారంభం అయిన 17వ >>2



సోమవారం హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్‌తో భేటీ అయిన సిఎం రేవంత్ -2లో

# నేడు మళ్లీ ఢిల్లీకి సిఎం

### పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై6:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఢిల్లీలోనే ఆయన ఉండనున్నారు. ఈ పర్యటనలో ఆయన కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయి రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల కోటా విడుదల కోసం విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిసింది. అలాగే, మెట్రో రెండో దశ విస్తరణ డీపీఆర్, ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగం అంశాలపై కేంద్ర మంత్రులను కలిసి చర్చించనున్నట్లు సమాచారం. ఇక రాష్ట్రంలో రేషన్ కార్డుల సమస్యకు >>2

## రైతులతో వెళ్లి

# మోటార్లు ఆన్ చేస్తాం



తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియాతో హరీష్‌రావు

### నీళ్ల విలువ తెలియని వారు రాష్ట్రాన్ని పాలిస్తున్నారు

### కెసిఆర్ నాయకత్వంలో కదులుతాం: హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై6:** కన్నెపల్లి,కల్వకుర్తి వద్ద మోటార్లను ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని మాజీ మంత్రి,బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి విలువ తెలియని వాళ్లు పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ బిఆర్ఎస్ పార్టీ నేతలపై కోపంతో రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ దగ్గర నిమిషానికి 73,600 క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయి. కన్నెపల్లి పంప్ హౌస్ మినిమం డ్రా డౌన్ లెవెల్ 93.5 మీటర్లు, ఎండీడీఎల్ కంటే రెండున్నర మీటర్లు ఎత్తులో నీళ్లు పోతున్నా ఎందుకు మోటర్ ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు రోజుకి రెండు టీఎంసీల నీళ్లు తీసుకునే అవకాశం ఉందని, నీటిని ఎత్తిపోసేందుకు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు అని ప్రశ్నించారు. మోటార్లు ఆన్ చేస్తే 15 జిల్లాలకు సాగునీరు అందుతుందని, ఎస్సారెస్పీ కింద పంటు వేయాలా?వద్దా? అని రైతులు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. గోదావరి నదిలో ఐదు వేల క్యూసెక్కుల నీళ్లు ఉన్నా ఒక్క మోటార్ ఆన్ చేసి నీళ్లు తరలించుకునే అవకాశం ఉందని, యావరేజ్‌గా ఒక్కొక్క మోటారు 2100 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుందన్నారు. అన్నారం, సుందిళ్ల కన్నెపల్లి పంప్ హౌస్ లక్షణంగా పనిచేస్తున్నది. బటన్ నొక్కితే నీళ్ళు వచ్చే అవకాశం ఉండంగా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మాపైన కక్షతో కేసులు పెట్టుకోండి కానీ రైతుల కడుపు కొట్టకండి. రైతులు పంప్ హౌస్‌లు ప్రారంభించాలని ఫోన్లు చేస్తున్నారు. ఎస్సారెస్పీ కింద 14లక్షలు, మిడ్ మానేరు కింద లక్ష ఎకరాలు, కాళేశ్వరం కింద >>2

## తెలంగాణకు మరో ఎనర్జీ స్టోరేజి ప్లాంట్ 2

### 1500 మె.వా సామర్థ్యంతో మంజూరు

# 'లిఫ్ట్'ల ఆన్ మాకే తెలుసు



### కన్నెపల్లి, కల్వకుర్తిపై హరీష్ మాటలు రైతులపై కుట్ర


### తప్పుడు డిజైన్లతో ప్రాజెక్టులు నిర్మించిన ఘనత బిఆర్ఎస్‌దే

### కుంగే బ్యారేజ్‌లకు నీళ్లు ఎత్తిపోయాలా?.. హరీష్‌పై మండిపడిన మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై6:** నిరంతరం రాష్ట్రంలో రైతులను మోసం చేయాలని, రైతులను ఆందోళనకు గురి చేయాలని బీఆర్ఎస్ కుట్రలకు పాల్పడుతోందని,. కుట్రపూరితమైన అబద్ధాలు ప్రచారాలు చేస్తోందని,. అబద్ధాలను గోబెల్స్‌కు మించి ప్రచారం చేయటం మాజీ మంత్రి హరీష్ రావుకు అలవాటైపోయిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట వేసేటప్పుడు రైతులను ఆదుకునే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ప్రతి పంట సీజన్‌లో రైతులను ఆందోళనకు గురి చేసి, గందరగోళ పరచాలనే దుర్బుద్ధి బీఆర్ఎస్ నేతలదన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిరుడు వానాకాలంతో పాటు ఇటీవలి యాసంగిలో భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో వరి పంట సాగు చేశారు. ఆ విషయాన్ని మరిచిపోయి హరీష్‌రావు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. యాసంగి సీజన్ కు ముందు కూడా బీఆర్ఎస్ ఇలాంటి అబద్ధాలు మాట్లాడింది. రైతులోకాన్ని ఆందోళనకు గురి చేయాలని అప్పుడు కూడా కుటిల ప్రయత్నాలు చేశారన్నారు.గత వానాకాలంలో రాష్ట్రంలోని రైతులు 66.7 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసి 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారు.యాసంగిలో 60లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే.. 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించిన ఘనత తెలంగాణ రైతులదన్నారు. దేశ చరిత్రలోనే ఒకే ఏడాదిలో 283 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సాధించిన రికార్డు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందన్నారు. తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా నిలిస్తే ఓర్వలేని గుణం బీఆర్ఎస్ లీడర్లది. పదేండ్లలో తాము చేసిన తప్పులు, దుర్మార్గాలకు ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి,మేడిగడ్డ, కల్వకుర్తి అంటూ ఇప్పటికీ రైతులను మోసం చేయాలని >>2

## చెంచులకు 13 వేల

# ఇందిరమ్మ ఇళ్లు



### గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 9 వేల ఇళ్లు

### నేడు మున్ననూర్‌లో మంజూరు పత్రాలు అందజేయనున్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జులై 6, ప్రభాతవార్త:** సమాజంలో అత్యంత వెనుకబడిన చెంచులు దశాబ్దాల పాటు సొంత ఇండ్లకు నోచుకోలేదని వారిసొంతింటి కలను సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మప్రభుత్వం సాకారం చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.రాష్ట్రంలోని ఉట్నూరు,భద్రాచలం,మున్ననూర్,ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ)ల పరిధిలోని 21 నియోజకవర్గాలలో సచ్యురేషన్ పద్ధతిలో 13,266 చెంచు కుటుంబాలను ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.గిరిజన ప్రాంతాల్లో శాశ్వతగృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పలు సందర్భాలలో సూచించారని,అదే విధంగా సిఎం రేవంత్ రెడ్డిగారు కూడా అనేక సందర్భాలలో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి,ముఖ్యంగా వారి నివాస గృహాల నిర్మాణంపై అనేక సూచనలు చేశారని గవర్నర్ గారు,సిఎం సూచనలు సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామన్నారు.మొదటి విడతలో భాగంగా సోమవారం అచ్చంపేట నియోజకవర్గం మున్ననూర్‌లో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణతో కలిసి చెంచులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను స్వయంగా తానే అందజేస్తున్నట్లు తెలిపారు. అడవులను >>2

## రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్లు

# లక్షపైనే..


### కన్వీనర్ కోటాలో 76,795 సీట్లు

### 148 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు గుర్తింపు




**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో 1,07,218 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం అనుమతించిన కాలేజీల్లోని ఇంజనీరింగ్ సీట్లు ఇవి. గత ఏడాది కొన్ని కాలేజీలు అదనపు సీట్ల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా వాటికి అనుమతి లభించలేదు. మొదటి విడత ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్ నాటికి రాష్ట్రంలో 1,07,218 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 76,795 సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 4 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు తగ్గాయి. గత ఏడాది 152 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా..ఈ ఏడాది 148 కాలేజీలకు గుర్తింపును ఇచ్చింది. ఈ ఏడాది కొత్తగా రెండు యూనివర్సిటీ కాలేజీలు ఒక ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ అందుబాటులోకి వచ్చాయి. వాటిలో పాలమూరు యూనివర్సిటీలో 180 సీట్లు, శాతవాహన యూనివర్సిటీలో 240 సీట్లు, ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీలో 300 సీట్లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది ఇంజనీరింగ్‌లో మొదటి విడత కౌన్సెలింగ్ నాటికి 70,307 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా.. అదికాస్త ఈ ఏడాది 76,795 సీట్లు అందుబాటులో ఉండనున్నట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 148 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపు ఇచ్చారు. వాటిలో 99,610 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవికాకుండా ప్రభుత్వ, యూనివర్సిటీ, యూనివర్సిటీ కాన్‌స్టిట్యూయంట్ కాలేజీలు 23 ఉండగా..వాటిలో 7068 సీట్లు అందుబాటులో >>2





## కృష్ణా ప్రాజెక్టులకు

# జలకళ

### శ్రీశైలం, జూరాలకు రికార్డు స్థాయి వరద

### గణనీయంగా పెరిగిన జల విద్యుదుత్పత్తి

### జూన్‌లో తక్కువ వర్షపాతంతో మందకొడిగా పంటలసాగు

### గత యేడాదికంటే తగ్గిన పంట విస్తీర్ణం

**హైదరాబాద్,జూలై 6,ప్రభాతవార్త:** తెలంగాణలో జూన్ నెలలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా ఉభయ తెలుగు రాష్ట్రాలకు కృష్ణబేసిన్‌లో గేట్‌వేగా నిలిచిన జూరాల, శ్రీశైలం ప్రాజెక్టుల్లో మే,జూన్ నెలలో గత దశాబ్ద కాలంగా కనివని ఎరుగని రీతిలో ఎగువ రాష్ట్రాల నుంచి వరద వచ్చిచేరుకొంది. ఆప్రాజెక్టులోని జలవిద్యుత్ కేంద్రాలు మే,జూన్ నెలలలో 231 మిలియన్ యూనిట్ల కరెంటును ఉత్పతి చేశాయి.నీటి సంవత్సరం జూన్‌తో మొదలై మే నెలలో ముగుస్తుంది. కృష్ణానదిలో నీటి సంవత్సరం మొదలైన మాసంలో,నీటిసంవత్సం ముగిసే మాసంలో >>2

### శ్రీశైలం క్రస్ట్ గేట్లు మార్చడం అవసరం 2

గేట్ల నిపుణుడు కృష్ణయ్యనాయుడు వెల్లడి



భోపాల్ నుండి గంజ్‌బసోడాకు ఆదివారం రైలులో ప్రయాణిస్తున్నప్పుడు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సెల్ఫీ దిగుతున్న ఓ మహిళా ప్రయాణికురాలు

# చెంచులకు 13 వేల ఇందిరమ్మ ఇళ్లు

>> నమ్ముకొని జీవించే గిరిజనులలో చెంచులు ఒక జాతని వీరు అడవుల్లో వేటాడటం, అటవీఫలసాయం సేకరించి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, చిన్నచిన్న గుడిసెలు తప్ప వీరికి పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకు అందని విషయమని, అలా అని ఆ అడవి ప్రాంతాల్ని వదలి వారు బతక లేరు.అందుకే వీరు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన కూడా చేయలేదన్నారు. ఉట్నూరు ఐటిడిఎ పరిధిలో( 10, 836ఇండ్లు) మంచిర్యాల 157, నిర్మల్ 153, ఆసిఫాబాద్ 3371, బోధ్163, ఖానాపూర్ 2257, సిర్పూర్ 227, అదిలాబాద్ 2848, బెల్లంపల్లి 223, భద్రాచలం ఐటిడిఎ పరిధిలో అశ్వరావుపేట 274, మున్ననూర్ చెంచుస్పెషల్ ప్రాజెక్ట్‌లో (2156) అచ్చంపేట్ 785, మహబూబ్‌నగర్ 245, పరిగి 63, తాండూర్ 174,కొల్లాపూర్ 105,కల్వకుర్తి 120,వికారాబాద్ 63, దేవరకద్ర 64,నాగార్జున సాగర్17, మొత్తం 13,266 ఇండ్లను చెంచులకు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేస్తున్నామని, అయితే ఐటిడిఎ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్ల చొప్పున 8750 ఇండ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఐటిడిఏ ప్రాజక్టు ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

# నేడు మళ్లీ ఢిల్లీకి సిఎం

>> పరిష్కారం చూపేలా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త కార్డులు మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 14న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ సభకు రావాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను ఆహ్వానించనున్నట్లు తెలిసింది. అలాగే, మరోదఫా మంత్రివర్గ విస్తరణతోపాటు నామినేటెడ్ పోస్టులు, పార్టీ, ప్రభుత్వంలో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలపై కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించే అవకాశం ఉంది. కాగా, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఢిల్లీ వెళ్లడం ఇది 47వ సారి. రెండు రోజుల క్రితం వరకు ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే,ఎఐసిసి జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ హైదరాబాద్‌లో ఉండి పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ, కార్యవర్గ సమావేశాల్లో పాల్గొని దిశానిర్దేశం చేశారు. తర్వాత ఎల్‌బి స్టేడియంలో కాంగ్రెస్ బహిరంగ సభలో పాల్గొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి వారితో విడివిడిగా సమావేశమై రాష్ట్ర పరిస్థితులను వివరించారు. అయినప్పటికీ సిఎం మరోసారి ఢిల్లీ వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. రాష్ట్ర అంశాలపై కేంద్ర మంత్రులను కలువనున్నారు.

# భారత్ ఘన విజయం

>> శుభ్‌మన్ గిల్ (269) ద్విశతకంతో చెలరేగి భారీ స్కోర్ అందిస్తే సిరాజ్ ఆరు వికెట్లతో బెన్ స్టోక్స్ సేనను దెబ్బకొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ సారథి గిల్ సెంచరీతో విజృంభించగా 161), రవీంద్ర జడేజా(69), రిషభ్ పంత్ (65) బ్యాటింగ్ మెరుపులతో ఆతిథ్య జట్టుకు 608 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిడియా. భారత్ నిర్దేశించిన కష్టసాధ్యమైన ఛేదనలో ఆకాశ్ దీప్, సిరాజ్ ధాటికి నాలుగో రోజు ఆఖరి సెషన్‌లో ఇంగ్లండ్ 72కే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. వాన కారణంగా ఐదో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైనా ఇంగ్లండ్‌కు ఓటమి తప్పలేదు. ఓలీ పోప్(24)ను క్లీన్‌బౌల్డ్ చేసిన ఆకాశ్ దీప్ (458) వికెట్ల వేటకు తెరతీశాడు. ఆ తర్వాతి ఓవర్లోనే ఊహకందని బంతితో హ్యారీ బ్రూక్(23)ను ఎల్బీగా వెనక్కి పంపి టీమిండియాను గెలుపు వాకిట నిలిపాడు. అయితే కెప్టెన్ బెన్ స్టోక్స్(35), జేమీ స్మిత్ (88)లు డిఫెన్స్ ఆడుతూ విసిగించారు. ఈ జోడీని విడదీసేందుకు గిల్ ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరకు వాషింగ్టన్ సుందర్ బ్రేకిచ్చాడు. లంచ్‌కు ముందు ఓవర్లో స్టోక్స్ ఎల్బీగా ఔటయ్యాడు. అంతే భారత శిబిరంలో సంబురాలు మిన్నంటాయి. భోజన విరామం తర్వాత కూడా స్మిత్ పట్టుదలగా ఆడాడు. క్రిస్ ఒక్స్(7)ను ప్రసిధ్ ఔట్ చేసి ఏడో వికెట్ అందించాడు. ఆకాశ్ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు బాదిన స్మిత్.. హ్యాట్రిక్ సిక్సర్ కొట్టే క్రమంలో డీప్ స్క్వేర్ లెగ్‌లో సుందర్ చేతికి చిక్కాడు. అయితే.. బ్రాండన్ కార్సే(38), షోయబ్ బషీర్(12)లు పెద్ద షాట్లు ఆడడంతో చివరి రెండు వికెట్లు తీసేందుకు శ్రమపడాల్సి వచ్చింది. చివరి వికెట్ కూడా ఆకాశ్‌కే దక్కడంతో భారత్ 336 పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయం సాధించింది.

# నేడు వనమహోత్సవం ప్రారంభం

**హైదరాబాద్,జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం సిఎం రేవంత్ రెడ్డి మొక్కలు నాటి ప్రారంభించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతిజానయ్య ఒక ప్రకటనలో తెలిపారు.యూనివర్సిటీ క్యాంపస్ ప్రస్తుతం లంటానా,పార్థీనియం, ప్రోసోఫిస్ జూలిఫ్లోరా వంటి కలుపు మొక్కలతో నిండిపోయి,పర్యావరణానికి తీవ్ర నష్టంకలిగిస్తోందని,యూకలిప్టస్,సుబాబుల్‌వంటి విదేశీజాతుల మొక్కలు పెరిగి పోయి విలువైనస్థానిక తెలంగాణ వృక్షజాతులకు చోటు లేకుండా చేసినట్లు తెలిపారు.ఈకలుపు మొక్కలు,విదేశీ జాతులను తొలగించి,కొత్త,విలువైన మొక్కలను నాటడానికి స్థలం కేటాయిస్తున్నారు.తెలంగాణలోని సాంప్రదాయ స్థానిక మొక్కలను పునరుద్ధరించడానికి,గత పదిహేను సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేయబడిన క్యాంపస్‌లోని బొటానికల్ గార్డెన్‌లో భారీ మొక్కలపెంపకం కార్యక్రమం జరుగు తోందని, బొటానికల్ గార్డెన్‌ను పునరుద్ధరించడానికి,పునరుజ్జీవింపజేయడానికి దాదాపు 30స్థానిక కలప,అటవీపండ్లు,అటవీపూల జాతులు, వివిధ రకాల వెదురు జాతులను నాటాలని ప్రణాళిక చేన్నట్లు చెప్పారు.భవిష్యత్తులో, ప్రస్తుతం యూకలిప్టస్,సుబాబుల్‌తో నిండిఉన్న సుమారు150 ఎకరాలను వన మహోత్సవంలో భాగంగా విలువైన కలపను ఇచ్చే రకాలను నాటేందుకు ఖాళీ చేయనున్నామన్నారు. ముఖ్యంగా,గత నెలలో, 150 ఎకరాల పాత స్థలాల నుండి యూకలిప్టస్,సుబాబుల్‌ను తొలగిం చేందుకుపీజేటీఏయూ ఐటిసి కంపెనీకి టెండర్లు మంజూరు చేసింది.

## ఆది పండుగ ఏకాదశిని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 6:** ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా తెలంగాణలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ పవిత్ర దినాన విష్ణువును ఆరాధించి, ఉపవాసం ఉండటం వల్ల భక్తులు ఆశీర్వాదాలను పొందుతారని, ఆధ్యాత్మిక పురోగతి సాధిస్తారని నమ్మకం. ఏకాదశి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆది పండుగ ఏకాదశిని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు.

## సీట్లు లక్షపైనే..

>> ఉంటాయి. రాష్ట్రంలో 2 ప్రైవేటు వర్సిటీల్లో 1260 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా రాష్ట్రంలో 171 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కలిపి 1,07,218 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 76,795 సీట్లు కన్వీనర్ కోటాలో సీట్లు అందుబాటులో ఉన్నాయి.

**బ్రాంచ్‌ల వారీగా సీట్లను పరిశీలిస్తే..**

రాష్ట్రంలో ఈ ఏడాది ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో అన్ని బ్రాంచ్‌ల్లో కలిపి కన్వీనర్ కోటాలో 76,795సీట్లు అందుబాటులో ఉన్నట్టు ఈఏపీ సెట్-2025కౌన్సెలింగ్ అధికారులు ప్రకటించారు. అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో 26,150 సీట్లు అందుబాటులో ఉన్నాయి.ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ డాటాసైన్స్‌లో 1235 సీట్లు, సివిల్ ఇంజనీరింగ్‌లో 3129 సీట్లు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(డాటాసైన్స్)లో 6996 సీట్లు, సీఎస్‌ఈ(సైబర్ సెక్యూరిటీ)లో 1439 సీట్లు, సీఎస్‌ఎం(ఏఐఎంఎల్)లో 12,495 సీట్లు, ఈసీఈలో 10,125 సీట్లు, ఈఈఈలో 4301 సీట్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)లో 3681 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 2994 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

## 'సుప్రీం' జడ్జి జస్టిస్ విక్రమ్ నాథ్‌తో భేటీ అయిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై6:** సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించినట్లు తెలుస్తోంది.

## వారం - వర్జ్యం

తేది : 07-07-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ద్వాదశి రా.11.08
అనూరాధ రా.1.10
వర్జ్యం ఉ.7.15-ఉ.8.59
దు.మ.12.39-1.31, మ.3.06-4.08
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** భూవివాదాలు తీరి లబ్ది పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**వృషభం :** నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ఎవరినైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుంటారు.

**మిథునం:** ఆర్థికపరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం :** బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. షేర్ల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**సింహం:** సంతానం అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఆరోగ్యంపట్ల మెలకువ చాలా అవరం. నూతనవస్తు, వస్త్రాలు కొనుగోలు.

**తుల :** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. నూతన ఒప్పందాల విషయాలలో తొందరపాటు వద్దు.

**ధనుస్సు:** ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకు పరుస్తాయి. మిత్రుల సాయంతో పనులు చక్కదిద్దుతారు.

**మకరం:** జీవిత భాగస్వాం నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు.సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**కుంభం:** పారిశ్రామిక, రాజకీయ రంగాల వారికి యోగదాయకంగా వుండును. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**మీనం :** పాత బాకీలు వసూలవుతాయి. ఉద్యోగులు ఉన్నతహోదాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కృష్ణా ప్రాజెక్టులకు జలకళ

| నీటి సంవత్సరం | శ్రీశైలం ఇన్‌ఫ్లో | జలవిద్యుత్ | జూరాల ఇన్‌ఫ్లో | జలవిద్యుత్ |
|---|---|---|---|---|
| 2024-25 మే | 15.92 | 23.95 | 15.17 | 19.33 |
| 2025-26 జూన్ | 127.40 | 40.15 | 118.69 | 156.79 |
| 2023-24 మే | 0.41 | 0.00 | 1.33 | 0,00 |
| 2024-25 జూన్ | 6.36 | 0.00 | 7.26 | 0.04 |
| 2022-23 మే | 3.58 | 0.00 | 4.96 | 0.40 |
| 2023-24జూన్ | 0.82 | 0.00 | 0.39 | 0.20 |
| 2021-22 మే | 1.50 | 0.00 | 4.00 | 0.00 |
| 2022-23 జూన్ | 5.71 | 0.00 | 2.60 | 5.90 |
| 2020-21 మే | 1.00 | 0.06 | 1.50 | 0.00 |
| 2021-22 జూన్ | 22.00 | 55.30 | 28.00 | 53.8 |

నోట్ : ఇన్‌ఫ్లో టిఎంసిలు, జలవిద్యుత్ మిలియన్ యూనిట్లుగా భావించాలి. నీటి సంవత్సరం జూన్‌తో మొదలు, మే నెలతోముగుస్తుంది.

>> సాధారణంగా అత్యంత తక్కువ వరద నమోదవుతుంది. 2024జూన్-25 మే నెలతో ముగిసే నీటి సంవత్సరంలో చివరి నెల మేనెలలో శ్రీ శైలం జలాశయంలోకి 15.92టిఎంసిల వరదనీరు వచ్చి చేరింది. 23.95 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను శ్రీశైలంలో ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించారు. జూరాల జలాశయంలో కూడా 15.17 టిఎంసిల నీరు వచ్చిచేరింది. అక్కడ కూడా ఈ వేసవిలో 10.33మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి అసాధారణమైన ఒక సంవత్సరంగా చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. మే నెలలో సుమారు పదిరోజులు జూరాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ శ్రీశైలం రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. నైరుతి రుతుపవనం తొందరగానే పలకరించినా వానలు ముఖం చాటేయడంతో తెలంగాణలో సగానికిపైగా 347 మండలాలలో జూన్ మాసాంతంకు అతి తక్కువ వర్షాపాతం నమోదై దుర్భిక్షం నెలకొన్నా, జూన్ నెలతో ఆరంభమైన 2025-26 నీటి సంవత్సరంలో జూరాల,శ్రీశైలంలోకి వరద మొదలైంది. జూన్‌లో శ్రీశైలం రిజర్వాయర్‌లోకి ఎగువనించి 127.40టిఎంసిలు నీటి ప్రవాహంరాగా 40.15 మిలియన్ యూనిట్లు జలవిద్యుత్ ఉత్పత్తి చేయడం జరిగింది. జూరాలకు జూన్‌నెలలో 118.69 టిఎంసి నీరు వరదగా ఎగువనుంచి రాగా 156.79మిలియన్ యూనిట్లు జలవిద్యుత్‌ను ఇక్కడ ఉత్పత్తిచేశారు. శ్రీశైలం,జూరాలు మే,జూన్ నెలలో విద్యుత్ ఉత్పత్తి చేయడం ఒక అరుదైన సంఘటనగా నీటిపారుదలరంగం నిపుణులు భావిస్తున్నారు. గత ఐదేళ్ళలో నీటి సంవత్సరం ముగింపు మాసంలో కేవలం ఎన్నడూ కూడా శ్రీశైలంకు 1.5టిఎంసిలకు మించి వరద రాలేదు. 2021-22మేలో శ్రీశైలంకు అత్యధికంగా వరద 1.5టిఎంసిలు రాగా అదే సంత్సరం జూరాలకు 0.40టిఎంసిలు మాత్రమే వరద వచ్చింది. అదే సంవత్సరం 2021-22 నీటి సంవత్సరం ఆరంభ మాసం జూన్ నెలలో శ్రీశైలంకు 22టిఎంసి,జూరాలకు 28టిఎంసిలు నీరు వరదగా వచ్చింది. ఆ సంవత్సరం 55.30 మిలియన్ యూనిట్లు శ్రీశైలంలో, 53.8మిలియన్ యూనిట్లు జూరాలలో జలవిద్యుత్ ఉత్పత్తి చేశారు. తెలంగాణలో జూన్ నెలలో వర్షాలు ఆశించినంత పడకపోవడంతో పంటల సాగు గత సంత్సరం తో పోల్చితే మందకోడిగా సాగుతోంది. తెలంగాణలో మొత్తం 621మండలాలలో జూన్ మాసాంతం వరకు 347 మండలాలలో అతి తక్కువ వర్షం కురిసి దుర్భిక్షవాతావర్ణం నెలకొంది. 247 మండలాలలో సాధారణ వర్షాపాతం నమోదైనా వర్షపు రోజులు తక్కువగానే ఉన్నాయి. దీనితో గత యేడాది జూలై మొదటి వారంలో 46.95లక్షల ఎకరాలలో పంటలు సాగుచేస్తే ఈ యేడాది 43.48 ఎకరాలలో మాత్రమే పంటలు సాగుచేశారు. అవి కూడా నీరు లేక ఎండిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఖరీఫ్‌లో జూలై మొదటి వారం వరకు వరి 21.14లక్షల ఎకరాలలో నాట్లు వేయడానికి నారు పోశారు. పత్తి 30.69 లక్షల ఎకరాలలో పత్తి విత్తనాలు వేశారు. కందులు 2.7లక్షల ఎకరాలు,సోయాబిన్ 2.64లక్షల ఎకరాలు,మొక్కజొన్న 2.48లక్షల ఎకరాలు,పెసర్లు, సజ్జలు,0.49లక్షల ఎకరాలు విత్తినారు.

# తెలంగాణకు మరో ఎనర్జీ స్టోరేజీ ప్లాంట్

## 1500 మె.వా సామర్థ్యంతో మంజూరు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్లాంట్‌ను మంజూరు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ ప్లాంట్ సామర్థ్యం 1500 మోగావాట్లుగా ఉందని అధికవర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే రాష్ట్రానికి 500 మోగావాట్ల ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసింది. తాజాగా మరో 1500 మోగావాట్ల ప్లాంట్‌ను కేటాయించడంతో రాష్ట్రానికి విద్యుత్ సమస్యను అధిగమించేందుకు అవకాశం కలుగుతుంది. కాగా ఈ పాంట్ల ఏర్పాటుకు జనగాం సహా, మరో రెండు ప్రాంతాల్లో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి అధికారులు స్థలాలను పరిశీలించారు. అయితే ఇవి సబ్‌స్టేషన్లకు సంబంధించిన స్థలాలు కావడంతో త్వరిత గతిన ప్లాంట్ ఏర్పాకు అవకశం కలుగుతుంది. ఇక ఈ ప్లాంట్ల ఏర్పాటుకయ్యే వ్యయంలో 30 శాతం మేర వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద కేంద్రప్రభుత్వం కేటాయిస్తుంది. 70 శాతం ప్లాంట్ ఏర్పాటు ేసుకునే వారు భరించాల్సి ఉంటుంది. ఈ ప్లాంట్లల్లో విద్యుత్తును బ్యాటరీల్లో నిల్వచేస్తారు. మార్కెట్లో విద్యుత్తు ధర తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్తును స్టోరేజ్ చేయడం.. డిమాండ్ అధికమయ్యినప్పుడు.. ఎక్కువ ధర ఉన్నప్పుడు వినియోగించుకోవడం ఈ ప్లాంట్ల ప్రత్యేకత. ఇందులో భాగంగా రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో 500 మెగావాట్ల బ్యాటరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి ఈ స్థలం జెన్‌కోదే కానీ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు టెండర్లు కూడా పూర్తయినట్లు సమాచారం.

# సరిహద్దు ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు

>> బ్రిక్స్ సమావేశాల్లో ప్రధాని లాంఛనంగా ఇతర దేశాల నేతలతో గ్రూప్‌ఫోటో దిగారు. నగరంలోని మ్యూజియం ఆఫ్ మోడర్న్ ఆర్ట్ ఆడిటోరియంలో ఈసదస్సును ప్రారంభించారు. తొలిరోజు సమావేశంలో బ్రిక్స్ దేశాల నాయకులు పరస్పరం సహకరించుకుంటూ వృద్ధికి బాసటగా నిలవాలన్న భావన వ్యక్తంచేసారు. బ్రిక్స్‌వేదికగా మోడీ మాట్లాడుతూ భారత్ శాంతి, సోదరసమానత్వానికి కట్టుబడి ఉందని అన్నారు. శాంతి, భద్రత, ప్రపంచ సుపరిపాలన, సంస్కరణలు ప్రధానాంశాలుగా బ్రిక్స్ సదస్సును ఈ సారి నిర్వహిస్తున్నారు. అద్భుత భవిష్యత్తుకు కీలక పునాదులు , భద్రత, సుపరిపాలన, సుస్థిర శాంతిసౌభ్రాతృత్వమేనని మోడీ పునరుద్ఘాటించారు. ప్రపంచాన్ని ఇపుడు ఉగ్రవాదం సవాల్‌చేస్తోందని, మానవాళికి పెనుముప్పుగా మారిందన్నారు. భారత్‌లోఇటీవల జరిగిన పహల్గాంవ్ ఉగ్రదాడే ఇందుకు నిదర్శనమని అన్నారు. పహల్గాంవ్ ఉగ్రదాడి యావత్తు మానవాళిని కలవరపరిచిందన్నారు. ఉగ్రవాదులపై ఆంక్షలు ప్రకటించడానికి వెనుకాడకూడదని, ఉగ్రసాయం అందిస్తున్న దేశాలనుసైతం ఆంక్షల చట్రంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బాధితులు, ఉగ్రవాదమద్దతుదారులను ఒకే త్రాసులో చూడకూడదని అన్నారు. తమ వ్యక్తిగత, రాజకీయ లబ్దికోసం మౌనంగా అభిప్రాయం చెప్పి ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతివ్వడం ఎంతమాత్రం ఉపేక్షించే అంశం కాదన్నారు. అంతర్జాతీయ సుపరిపాలన సంస్కరణలు, సరిహద్దు ఉగ్రవాదం నిర్మూలన వంటి కీలక అంశాలతో నడిచింది. ప్రత్యేకించి ప్రపంచస్థాయి సంస్థల్లో గ్లోబల్‌సౌత్‌కు ప్రాతినిధ్యం పెరగాల్సిందేనని అభిప్రాయపడ్డారు.



ఆదివారం పాతబస్తీలో మొహరం వేడుకల్లో మాతం నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

# 'లిఫ్ట్'ల ఆన్ మాకే తెలుసు

>> చూస్తున్నానన్నారు. బీఆర్ఎస్ అసమర్థత, నిర్లక్ష్యం, నిర్వాకం కారణంగానే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా ఇప్పటికీ ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయన్నారు.. మేడిగడ్డ మాదిరిగానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను అదే సీకెంట్ ఫైల్స్ ఫౌండేషన్ టెక్నాలజీతో నిర్మించటంతో ప్రమాదకరంగా మారాయని, అవి అక్కరకు రాని పరిస్థితిలోనే ఉన్నాయన్నారు. గతంలో మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, అక్కణ్నుంచి ఎల్లంపల్లికి లిఫ్ట్ చేసిన 160 టీఎంసీలలో దాదాపు 57 టీఎంసీల నీళ్లు మళ్లీ గేట్లు ఎత్తి సముద్రానికి పంపించి ప్రజాధనాన్ని గోదాట్లో పోసిన విషయం మరిచిపోయారా..? అని ప్రశ్నించారు. ఎన్డీఎస్ఏ సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులపై తగిన నిర్ణయం తీసుకుంటుంది. హరీష్‌రావు కల్లబొల్లి మాటలు నమ్మాల్సిన అవసరం మాకు లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేసిన ప్రకారం మేడిగడ్డ దగ్గరి కన్నెపల్లి పంప్ హౌజ్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి అన్నారం, అక్కడి నుంచి సుందిళ్లకు నీటిని లిఫ్ట్ చేయాలి. ఆ మూడు బ్యారేజీలు తప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో, తప్పుడు డిజైన్లతో నిర్మించిన దుర్మార్గం గత ప్రభుత్వానిది. ఆ మూడు బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని ఎన్డీఎస్ఏ హెచ్చరించిందన్నారు.. అయినా సరే, కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయాలని హరీష్‌రావు పదే పదే మాట్లాడటం వెనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర తప్ప రైతులకు మేలు చేసే మంచితనం లేదన్నారు.. కాళేశ్వరం ప్రాజెక్టు అక్కరకు రాకుండా నిర్మించిన తమ అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు అబద్ధాలు వల్లించటం తప్ప, ప్రజల ప్రయోజనాలను బీఆర్ఎస్ లీడర్లు మరిచిపోయారని పేర్కొన్నారు.. కల్వకుర్తి పంపులు ప్రతి ఏడాది జులై చివరిలో లేదా ఆగస్ట్ ఒకటో తేదీన స్విచాన్ చేసి వానాకాలం పంటలకు నీళ్లు అందిస్తారు. ఈసారి కూడా అదే విధానం అమలవుతుంది. అందులో రైతులు సందేహించాల్సిన అవసరం లేదు. 2019లో ఆగస్ట్ 1, 2020లో ఆగస్ట్ 31, 2021లో ఆగస్ట్ 15న, 2022లో జులై 13న, 2023లో ఆగస్ట్ 6న కల్వకుర్తి లిఫ్ట్ లు ఆన్ చేశారు. గత ఏడాది జులై 27న స్విచాన్ చేశాం. రైతుల అవసరాలు, నీటి నిల్వల ఆధారంగా సాగునీటి ప్రాజెక్టుల నీటిని ఎప్పుడు విడుదల చేయాలి. ఎంత ఆయకట్టుకు ఇవ్వాలి.. ఈసారి ఎంత సమర్థంగా వాడుకోవాలనేది ప్రభుత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈనెల 11న జరిగే స్టేట్ లెవల్ కమిటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్ మీటింగ్‌లో తీసుకునే నిర్ణయాల ఆధారంగా అన్ని సాగునీటి ప్రాజెక్టులు, ఆయకట్టు ప్రణాళిక సిద్ధమవుతుందన్నారు.కృష్ణా జలాలను ఏపీ అక్రమంగా తరలించటం వెనుక అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కుట్రలన్నీ ఇప్పటికే బయటపడ్డాయి. వాళ్ల హయంలోనే పోతిరెడ్డిపాడు కెపాసిటీ రెండింతలకు మించి 88వేల క్యూసెక్కులకు పెంచుకున్నారు. రాయలసీమ లిఫ్ట్ స్కీమ్, ముచ్చుమర్రి నుంచి రోజుకు దాదాపు ఎనిమిది నుంచి పది టీఎంసీల నీటిని ఏపీ మళ్లించుకునే కుట్రలకు బీఆర్ఎస్ దొంగచాటుగా సహకరించిందన్నారు. 2004 నుంచి 2014 వరకు ఏపీ అక్రమంగా 770 టీఎంసీలు కృష్ణా జలాలు తీసుకపోతే,2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో ఏపీ ప్రభుత్వం ఏకంగా 1225 టీఎంసీల నీళ్లు అక్రమంగా తీసుకుపోయినట్లు రికార్డులున్నాయన్నారు.బీఆర్ఎస్ పాలకులు తెలంగాణ ప్రయోజనాలను ఎలా తాకట్టుపెట్టారో తెలియజేసేందుకు ఇంతకు మించిన సాక్ష్యమేముంటుంది... ? ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గోదావరి బేసిన్ లో, కృష్ణా బేసిన్ లో ఎక్కువ విస్తీర్ణంలో పంట లు సాగు చేసింది, ఎక్కువ సాగునీటిని వినియోగించింది, ఎక్కువ పంట పండించింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే సాధ్యమైందన్నారు.

# శ్రీశైలం క్రస్ట్ గేట్లు మార్చడం అవసరం

## గేట్ల నిపుణుడు కృష్ణయ్యనాయుడు వెల్లడి

**హైదరాబాద్,జూలై 6,ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయం పదో నంబర్ గేట్ వద్ద భారీగా వాటర్ లీకేజీ అవుతోంది. గత నెలలో ఈ గేటు వద్ద మరమ్మతులు నిర్వహించినప్పటికీ భారీగా నీరు లీకేజీ కావడం ఉభయ తెలుగురాష్ట్రాల ప్రజలు అనిశ్చితికి గురవుతున్నారు. శ్రీశైలంకు కొత్తగేట్లు ఏర్పాటు చేయకపోతే తుంగభద్ర తరహా ప్రమాదం పొంచి ఉంది.శ్రీశైలం జలాశయం పదో నంబర్ గేట్ వద్ద గత నెలలో అధికారులు రబ్బర్ సీల్స్ మార్చారు. వాటర్ లీకేజీ కారణంగా మరమ్మతులు నిర్వహించారు. దీని కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుమారు కోటి ముప్పై లక్షలు నిధులను కేటాయించింది. కానీ, తాజాగా మరోసారి అక్కడే వాటర్ లీకేజీ అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో, నాసిరకంగా పనులు చేసినట్టు తెలుస్తోంది. లీకేజీ కావడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇక, జలాశయం అధికారుల నిరక్ష ్యంతో ఇలా జరిగిందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. కొత్త గేట్లు ఏర్పాటు చేయకపోతే తుంగభద్ర పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉందని గేట్ల నిపుణులు కృష్ణయ్య నాయుడు అభిప్రాయపడుతున్నారు. ఆదివారం గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు శ్రీశైలం ఆనకట్ట రేడియల్ క్రస్ట్‌గేట్ల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. పదో నంబర్ గేట్ ద్వారా వచ్చే లీకేజీ వల్ల ఇబ్బందేమీ లేదన్నారు. గేటు నుంచీనీటి లీకేజీ 10శాతం కంటే తక్కువగా ఉందని తెలిపారు. రేడియల్ క్రస్ట్ గేట్లకు క్రమం తప్పకుండా పెయింటింగ్ వేయాలని సూచించారు. మరో ఐదేళ్లకైనా రేడియల్ క్రస్ట్ గేట్లు కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరముం దన్నారు. కొత్త గేట్లు ఏర్పాటుచేయకపోతే తుంగభద్ర పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉందనిహెచ్చరించారు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్ల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఆనకట్ట నుంచి 60 మీటర్ల దూరంలో ప్లంజ్పూల్ ఉందని, దాని వల్ల శ్రీశైలం ఆనకట్ట పునాదులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు.

# మోటార్లు ఆన్ చేస్తాం

>> రెండు లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈరోజు కాళేశ్వరం మోటర్లు ప్రారంభిస్తే 15 జిల్లాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉంది. ఉత్తంకుమార్ రెడ్డి నియోజకవర్గం కోదాడ వరకు ఎస్సారెస్పీ స్టేజి 2 కింద నీళ్లు తీసుకొని పోవచ్చు. కాళేశ్వరం కింద రైతులు నారుమళ్ళు పోయాలా వద్దా అనే అయోమయంలో ఉన్నారు. వెంటనే కాళేశ్వరం మోటర్లు ప్రారంభించి రిజర్వాయర్లు నింపి రైతులకు మొదటి పంటకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే కేసీఆర్ నాయకత్వంలో లక్షలాది మంది రైతులందరం కలిసి కన్నెపల్లికి కదులుతం. మోటర్లు ఆన్ చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని విడిచిపెట్టం. ప్రజాశక్తిలో ఉన్న బలం ఏంటో చూపిస్తాం. లక్షలాది రైతాంగంతో కదిలి మోటర్లు ప్రారంభించి నీళ్లిచ్చి చూపిస్తాం. లక్షల ఎకరాల్లో మొలకెత్తిన విత్తనాలు ఎండిపోతున్నాయి. రైతులు ఆందోళనలో ఉన్నారు. మీరు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. కాళేశ్వరం అంటే 100 భాగాలు. 100 భాగాల్లో మేడిగడ్డ ఒక భాగం. 80 పిల్లర్లలో రెండు పిల్లర్లు మాత్రమే కుంగాయి. 19 రిజర్వాయర్లు, 21 పంపు హౌస్ లు, 16 సబ్ స్టేషన్లు, 203 కిలోమీటర్ల టన్నెలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్మెంట్స్ ఇవన్నీ కాళేశ్వరంలో భాగం. కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మత్తులు చేయమంటే 19 నెలల నుంచి కాలయాపన చేస్తుంది ప్రభుత్వమని ఆరోపించారు. మేడిగడ్డకి మరమ్మత్తులు చేయాలి. మరోవైపు కన్నెపల్లి పంప్ హౌస్ ప్రారంభించి నీళ్ల ఎత్తిపోసి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడండి అని చెప్పారు. ఎన్డీఎస్ఏ దేశం మొత్తం పనిచేస్తుందా ఒక కాళేశ్వరం పైనే పనిచేస్తుందా.పోలవరం దయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. గేట్ వాల్ కొట్టుకుపోయింది.

రూ.2000 కోట్ల నష్టం జరిగింది. ఎందుకు ఎన్డీఎస్ఏ స్పందించలేదన్నారు. ఐదు రోజుల్లో తెలంగాణకు వచ్చి నివేదికలు ఇస్తారు కానీ ఐదు సంవత్సరాలైనా పోలవరం విషయంలో స్పందించరన్నారు.. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి బంధానికి ఇది నిదర్శనం, బిజెపి, కాంగ్రెస్ కలవకపోతే ఎస్ఎల్బీసీ కుప్పకూలి దాని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారితే ఎందుకు ఎన్డీఎస్ఏ రాదు.

కాంగ్రెస్ ప్రభుత్వం సగటు రైతుగా ఆలోచించి మేడిగడ్డతో సంబంధం లేకుండా మోటార్లు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలని కోరుతున్నాం. 36 రోజుల కిందనే శ్రీశైలంలో వరద వచ్చింది. 36 రోజులైనా ఇప్పటివరకు కల్వకుర్తి మోటర్లు ఆన్ చేయలేదు. నాటి తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు కల్వకుర్తి ప్రాజెక్టును పట్టించుకోకపోతే కేసీఆర్ వచ్చిన వెంటనే కల్వకుర్తి ప్రాజెక్టును పూర్తి చేసి మూడు లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చారని చెప్పారు. నీళ్ల తీసుకునే తెలివి ఈ ప్రభుత్వానికి లేదా? ఎందుకు మహబూబ్నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారు? మహబూబ్‌నగర్ బిడ్డ అని కోతలు కోయడం కాదు చేతల్లో చేసి చూపించాలని సిఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు.



## దలైలామాకు ప్రధాని మోడీ జన్మదిన శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, జూలై 6:** టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా శాంతికి ప్రతి రూపమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. బౌద్ధ మతగురువు జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని ఎక్స్‌లో పోస్టుపెట్టారు. పవిత్ర ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ జన్మదినం సందర్భంగా 140 కోట్లమందితో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. ప్రేమ, కరుణ, ఓర్పు, నైతిక క్రమశిక్షణకు ఆయన బలమైన చిహ్నామని మతాలకు అతీతంగా ఆయన ఇచ్చే సందేశాలుప్రజలను ప్రభావితం చేస్తాయని అన్నారు. ఆయన దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నామని అన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబడియోకూడా దలైలామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆధ్యాత్మిక గురువు దలైలామాకు 90వ జన్మదిన శుభాకాంక్షలు, సమైక్యత, శాంతి, కరుణ సందేశాలతో ప్రపంచంలో ఆయన స్ఫూర్తిని నింపుతూనే ఉండాలని తన సందేశంలో ఆకాంక్షించారు.

## కారు అదుపుతప్పి ఘాట్‌లో పల్టీలు

### నలుగురు మృతి

**సిమ్లా, జూలై 6:** కారు అదుపుతప్పి కొండ పైనుంచి పల్టీలు కొట్టిన ఘటనలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కులూ జిల్లాలోని రోహ్‌తాంగ్ పాస్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రహ్నిలా సమీపంలోని పర్వతంపైనుంచి కారు పల్టీలు కొడుతూ కిందకు పడి పోయింది. కారులో మొత్తం ఐదుగురు ఉండగా ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందిన వెంటనే మనాలీ పోలీసులు, రెస్క్యూ టీమ్స్ హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మృతులు, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

## ఢిల్లీ పోలీసులకు చిక్కిన సీరియల్ కిల్లర్

### పాతికేళ్ల నేరచరిత్ర.. ట్యాక్సీ డ్రైవర్ల హత్యతోపాటు ఆయుధాలు, డ్రగ్స్ స్మగ్లింగ్

**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** దేశ రాజధానిలో ఓ కరుడుగట్టిన నేరగాడు పట్టు బడ్డాడు. ఓవైపు ట్యాక్సీ డ్రైవర్లను హత్య చేసి వారి శవాలను అడవుల్లో ప డవేసి. వాహనాలను నేపాల్‌లో అమ్మడం, మరోవైపు డ్రగ్స్ స్మగ్లింగ్, దారి దోపిడీలు చేయడం ఇతని ప్రత్యేకత. 25 ఏళ్ల నేరచరిత్ర కలిగిన ఈ నేరగాడి పేరు అజయ్ లాంబ (49). ఆదివారం నాడు ఈ నేరగాడి అరెస్టు వివరాలను ఢిల్లీ పోలీసులు మీడియాకు వెల్లడించారు. ఢిల్లీలోని కృష్ణా నగర్‌కు చెందిన అజయ్ లాంబ 1999 నుంచి నేరకలాపాల్లో వుంటున్నాడు. ఢిల్లీతో పాటు ఉత్తర్‌ఖండ్ ప్రాంతాల్లో ట్యాక్సీ డ్రైవర్లను ఒక పథకం ప్రకారం తన వెంట కిరాయి కోసం తీసు కువెళ్లి అడవుల్లో హత్య చేస్తాడు. అనంతరం వారి శవాలను అక్కడే పడవేసి వాహనాలను నేపాల్‌కు తీసుకువెళ్లి అక్కడ అమ్మేస్తుంటాడు. ఇదే సమయంలో దారి దోపిడీలు, డ్రగ్స్ స్మగ్లింగ్, ఆయుధాల విక్రయాలు కూడా చేస్తుంటాడు. నేరాలు చేసిన తరువాత ఇళ్లను మార్చడం ఇతని ప్రత్యేకత. ఈ క్రమంలో ఇతను ఉత్తర్ ఖండ్‌తో పాటు నేపాల్‌లో చాలా యేళ్లు వున్నాడు. ఇతని ముఠాలో ధీరేంద్ర, దిలీప్ నేగి అనే నేరగాళ్లు కూడా వున్నారు. 2008 నుంచి 2018 వరకు ఇతను త న కుటుంబంతో నేపాల్‌లో తలదాచుకున్నాడు. ఆ తరువాత డెహ్రాడూన్‌కు మకాం మార్చి గంజాయి స్మగ్లర్‌గా మారాడు. ఒడిషా నుంచి గంజాయిని సేకరించి ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో అమ్ముతున్నాడు. ఇతనిపై పదికిపైగా వారంట్లు వున్నాయి. చివరగా ఇతను 2021లో డ్రగ్స్ కేసులో అరెస్టయ్యాడు. ఈ కేసులో బెయిల్‌పై విడుదలై మళ్లీ నేరాలకు వ్యూహాలు సిద్ధం చేస్తూ ఢిల్లీ పోలీసులకు దొరికిపోయాడు. లాంబ అరెస్టుతో ఢిల్లీ సహా పలుచోట్ల జరిగిన హత్యలతోపాటు పలు కేసుల విచారణ ముందుకు సాగే వీలుందని డిసిపి క్రైం ఆదిత్యగౌతం తెలిపారు.

## రాష్ట్రాల ఆర్థిక సాయంలో నిబంధనలు

### వ్యవసాయ మౌలిక సదుపాయ నిధిలో మార్పులు

### బలహీన వర్గాల రైతాంగానికి మేలు

### కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతిపాదన

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** రైతులకు ప్రయోజనాన్ని కలిగించే మౌలిక సదుపాయాల నిధి పథకంలో కేంద్రం మార్పులు తీసుకువస్తోంది. ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ప్రయోజనాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపట్టింది. వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి కింద రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయం విషయంలో మార్పులు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి పథకం కింద గల అర్హతను రాష్ట్ర ఏజెన్సీలు, ఏపీఎంసీలకు, జాతీయ, రాష్ట్ర సహకార సమాఖ్యలు, రైతు ఉత్పత్తి సంస్థల సమాఖ్యలు, స్వయం సహాయక బృందాల సమాఖ్యలకు విస్తరించడం జరిగింది. ఇప్పటి వరకూ 2 కోట్ల రూపాయల మేర రుణానికి సంబంధించిన నిబంధనల ప్రకారం ఈ పథకం కింద ఇచ్చే వడ్డీ సహాయాన్ని ఒక ప్రాంతంలో పని చేసే సంస్థకే ఇవ్వడం జరుగుతోంది.

ప్రస్తుతం తీసుకురాబోతున్న మార్పుల ప్రకారం ఈ వడ్డీ సహాయాన్ని వివిధ ప్రాంతాల్లో పని చేసే అటువంటి అన్నిప్రాజెక్టులకు కూడా ఇవ్వడం జరుగుతుంది. అయితే ప్రైవేటు రంగ సంస్థ విషయంలో మాత్రం ఇటువంటి ప్రాజెక్టులు 25కు మించి ఉండకూడదు. కానీ 25 ప్రాజెక్టు నిబంధన అనేది రాష్ట్ర సంస్థలు, జాతీయ సంస్థలు, రాష్ట్ర సహకార సమాఖ్యలు, ఎఫ్‌పివో సమాఖ్యలకు ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు వర్తించదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకానికి సంబంధించి ఏపీఎంసీల విషయంలో 2 కోట్ల రూపాయల వరకూ ఉండే రుణాలకు సంబంధించిన వడ్డీ సహాయాన్ని వివిధ మౌలిక సదుపాయల ప్రాజెక్టులకు ఇవ్వడం జరుగుతుంది. ఒకటే మార్కెట్ యార్డులోని కోల్డ్ స్టోరేజ్, సార్టింగ్, గ్రేడింగ్, అస్సేయింగ్ యూనిట్లు, సిలోస్ తదితర మౌలిక సదుపాయల ప్రాజెక్టుల కిందకు వస్తాయని తెలిపారు.

కాగా లబ్దిదారులను తొలగించడం, చేర్చడానికి సంబంధించి స్ఫూర్తికి దెబ్బ తగలకుండా ఆయా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తగిన మార్పులు చేసే వీలును కల్పిస్తోంది. అదే విధంగా ఆర్థిక సదుపాయం అందించే సమయాన్ని 4 నుండి 6 సంవత్సరాలకు అంటే 2025-26 వరకూ పెంచడం జరిగింది. మొత్తం మీద చూసినప్పుడు పథకానికి సంబంధించిన సమయాన్ని 10 నుండి 13 సంవత్సరాలకు అంటే 2032-33 వరకూ పెంచడం జరిగింది. ముఖ్యంగా పథకానికి సంబంధించిన ప్రయోజనాలు సన్న, చిన్నకారు రైతులకు చేరడానికి దోహదం చేస్తాయి. మార్కెట్ లింకేజీలను అందించడానికి, కోతల అనంతరం అవసరమయ్యే ప్రజా మౌలిక సదుపాయల వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవడానికిగాను ఎంపిఎంసీ మార్కెట్లను స్థాపించడం జరిగిందని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.

## పాతబస్తీలో ఖమేని, హామాస్ నేత నస్రల్లా ప్లెక్సీలు

### మొహర్రం ఊరేగింపులో కలకలం

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** పాతబస్తీలో ఇరాన్ సుప్రీం నాయకుడు ఖమేని సహా ఇజ్రాయిల్‌పై పోరాడుతున్న హామాస్‌కు చెందిన మరో నాయకుడి ఫో టోలతో కూడిన ప్లెక్సీలు పలుచోట్ల వుండడం కలకలం రేపాయి. ఓవైపు మొహర్రం ఊరేగింపు జరుగుతున్న వేళ, భారీగా పోలీసు బందోబస్తు వున్న సమయం లో ఖమేనితో పాటు హామాస్ ముఖ్య నాయకుడు హసన్ నస్రల్లా ఫోటోలతో కూడిన ప్లెక్సీలు పలు ప్రాంతాలలో దర్శనమిచ్చాయి. గల్ఫ్ దేశాలలో షియాలు అధికంగా వున్నది ఇరాన్‌లోనే కావడం గమనార్హం. ఇరాన్‌కు అమెరికాతో చాలా కాలంగా వైరం వుంది. ఇదే సమయంలో ఇజ్రాయిల్‌పై పోరాడుతున్న హామాస్, హౌతి, హెజ్‌బుల్లా ఉగ్రవాద సంస్థలకు ఇరాన్ సహాయ సహకారాలు అందజేస్తోంది.

ఎలాంటి సరిహద్దు లేకున్నా ఇరాన్‌పై ఇజ్రాయిల్ ఇటీవల వరుసగా బాంబు దాడులతో విరుచుకుపడి పదుల సంఖ్యలో అణు శాస్త్రవేత్తలను చంపేసింది. ఇరాన్ అణ్వాస్త్రా ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేసింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు చేయడాన్ని అమెరికా స మ ర్థించగా పాక్, సౌదీ అరేబియా సహా అనేక దేశాలు ఖండించాయి. ఇక తాజా విషయానికి వస్తే పాతబస్తీలోని మొగల్ పురా, దారుల్ షిఫా, డబీర్‌పురా తదితర ప్రాంతాలలో షియాలు ఎక్కువగా వుంటారు. ఈ ప్రాంతంలోనే మొహర్రం ఊరేగింపు జరుగుతుంటుంది.

ఈ సందర్భం గా షియా వర్గానికి చెందిన ముస్లింలు రక్తాన్ని చిందిస్తుంటారు. ఈ సందర్భం గా ఎలాంటి అవాం ఛనీయ ఘటనలు జరగ కుండా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేస్తుం టారు. ఈసారి కూడా భారీగా బందోబస్తు ఏర్పాటు చేసినా అంజు మన్ ఎ మాసూమీన్ అనే సంస్థ ఇరాన్ సుప్రీం నాయకుడు, మత పెద్ద ఖమేనితో పాటు హ మాస్ ముఖ్య నాయకుడు హసన్ నస్రల్లా ఫోటోలతో కూడిన ప్లెక్సీలను అనేకచోట్ల ఏర్పాటు చేసింది.. కాగా గతంలో అఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబి యాలపై అమెరికా దాడులు చేసిన సమయం లోనూ పాతబస్తీలోని పలుచోట్ల అమెరికాకు వ్యతిరేకంగా నిరసనలు జరిగాయి.




పాతబస్తీలోని డబీర్‌పురాలో ఏర్పాటు చేసిన ఇరాన్ సుప్రీం నాయకుడు ఖమేని ప్లెక్సీ

## వంద కొడతాం.. బిఆర్ఎస్‌ను బొంద పెడతాం

### కెటిఆర్.. వక్రబుద్ధి మార్చుకో:

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** మా ముఖ్య మంత్రి చెప్పినట్లు వచ్చే ఎన్నికల్లో వంద కొడతాం బిఆర్ఎస్ ను బొందపెడతామనీ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి మా నినాదం 'వంద కొడదాం, బిఆర్ఎస్ ను బొందపెడదాం' అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రజలు మీ మోహం మీద ఉమ్మేసినా అహం కారం, బలుపు ఏ మాత్రం తగ్గలేదనీ విమర్శించారు. నీకు ఇప్పటికే చాలా సార్లు చెప్పాం కెటిఆర్ అయినా బలుపు తగ్గించుకోవడం లేదని హెచ్చరించారు. కెటిఆర్ నువ్వో బచ్చా, నీతో మా సీఎం చర్చకు రావాలా..? అని నిలదీశారు. అసెంబ్లీలో చర్చకు రమ్మంటే నువ్వు, నీ అయ్య ముందుకు రావడం లేదని అన్నారు. ప్రజలు ఛీ కొడితే ఫామ్ హౌస్ , గెస్ట్ హౌస్ లకు పరిమితమైన మీకు, మా రేవంత్‌రెడ్డితో పోటీ నా అని ఎద్దేవా చేశారు.'మా రేవంత్‌రెడ్డి మిమ్మల్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో జీరో చేశారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీకు అభ్యర్థులు లేకుండా చూశాడు.మా రేవంత్ రెడ్డి తొడగొట్టి మిమ్మల్ని పడగొట్టారు.' అని బీర్ల అన్నారు. కెటీఆర్ వక్రబుద్ధి మార్చుకో, నీకంటే ఎక్కువ భాష మాట్లాడటం మాకూ వచ్చు, కాని సంస్కారం ఉందని చెప్పారు. దోచుకున్న డబ్బులతో పింక్ మీడియాతో ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని ఆవేదన చెందారు.

## పిల్లల రక్షణలో పోక్సో చట్టం మైలురాయి

### సుప్రీం కోర్టు న్యాయమూర్తి విక్రమ్‌నాథ్

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** పిల్లల రక్షణకు సంబంధించి ఫోక్సో చట్టం ఒక మైలు రాయని, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ,యునిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన వాయిస్ ఫర్ వాయిస్ లెస్ పిల్లల హక్కులు అనే అంశంపై జరిగిన రెండు రోజో ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లల పునరావా సాన్ని ఆర్థిక లావాదేవీలకే తగ్గించకూ డదని, పిల్లల రక్షణలో పునరావాసం ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథార్టీ అసోసియేషన్ అధ్యక్షుడు జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ పాఠశాల పిల్లలు ఉపాధ్యాయులతో ఎదుర్కొంటున్న సమస్యలను ఉదాహరణలతో వివరించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల పిల్లలకు నాటకాలు, స్కిట్లు, వీడియోలు, షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా బాలల హక్కుల గురించి అవగాహన కల్పించాలన్నారు.బాలల హక్కులను పరిరక్షించడంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కార్యకలాపాలను వివరించారు. హైకోర్టు న్యాయమూర్తి జె. శ్రీనివాసరావు మాట్లాడుతూ. లైంగిక వేధింపులకు గురైన బాలల హక్కులు, రక్షణలు, పోక్సో చట్టం కింద పిల్లలను రక్షించ డంలో పోలీసుల పాత్ర, ప్రత్యేక కోర్టుల పాత్ర, పిల్లలను రక్షించడంలో, పోక్సో చట్టం కింద, బాలల లైంగిక వేధింపుల నివారణ తదితర అం శాలను ఈ సమావేశంలో చర్చించారు. ఈ ముగింపు సదస్సులో యునిసెఫ్ ఇండియాలోని చైల్డ్ ప్రొటెక్షన్ స్పెషలిస్ట్ సోనీకుట్టి జార్జ్, హైకోర్టు న్యాయమూర్తి తిరుమల దేవి తదితరులు పాల్గొన్నారు.




## అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త వంటకం

### కర్ణాటక విధానంపై అధికారుల అధ్యయనం

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త :** తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో జొన్నతో చేసిన రొట్టెలు, ఇతర పోషకాహారం అందించనున్నారు. కర్ణాటకలోని విజయవంతమైన మోడల్‌ను అనుసరించి తెలంగాణలోనూ ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకం జొన్న సాగును ప్రోత్సహించి, రైతులకూ లబ్ధి చేకూర్చనుంది. ప్రస్తుతం ఇస్తున్న పోషకాహారంతో పాటు, కర్ణాటక తరహాలో జొన్నతో తయారు చేసిన రొట్టెలు, ఇతర ఆహార పదార్థాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం కర్ణాటకలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుబంధ పోషకాహార కార్యక్రమం కింద ఏడాదిలో 300 రోజులపాటు జొన్నతో తయారు చేసిన ఉప్మా, రొట్టె, లడ్డూలు, చిక్కీలు, కిచిడీ వంటివి అందిస్తున్నారు. ఈ విధానం అక్కడి పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడంలో విజయవంతమైంది. కర్ణాటకలోని ఈ మోడల్‌పై అధ్యయనం చేసేందుకు త్వరలో తెలంగాణ స్త్రీ శిశు సంక్షేమ అధికారుల బృందాన్ని పంపనున్నారు. వారి తుది నివేదిక ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

## కామారెడ్డిలో పేలుడు పదార్థాల కలకలం.. నిందితుల అరెస్టు

### భారీగా జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్లు జప్తు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** కామారెడ్డిలో పేలుడు పదార్థాలు భారీగా పట్టుబడడం కలకలం రేపాయి. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని పిఎంహెచ్ కాలనికి చెందిన చింతల శ్రీధర్ సమీపంలో గల కెపిఆర్ కాలనిలో ఒక ప్లాట్లు వుంది. ఈ ఇంటి నిర్మాణం కోసం పునాదులు తీయగా బండరాళ్లు రావడంతో వీటిని పేల్చేందుకు కాంట్రాక్టర్‌తో మాట్లాడాడు. ఇందుకుగానూ బొంత సంపత్, లక్ష్మీ నారాయణ, రాజు అనే వ్యక్తులకు 50 వేల రూపాయలు ఇచ్చాడు. అయితే జనావాసాల మధ్యలో గల ఇంటి పునాదుల్లో వచ్చిన బండరాళ్లను తొలగించేందుకు పేలుడు పదార్థాలు వా డడం నిబంధనలకు విరుద్ధం. అయితే బొంత సంపత్, లక్ష్మీనారాయణ, రాజు అక్రమంగా వీటిని సేకరించి శ్రీధర్ ఇంటి నిర్మాణంలో వున్న బండల వద్ద వుం చారు. అయితే దీనిపై సమాచారం అందుకున్న స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బండారం రట్టయ్యింది. దీంతో పోలీసులు వెంటనే రంగంలో దిగి ఇంటి యజమాని శ్రీధర్‌తోపాటు పేలుడు పదార్థాలను అక్రమంగా సేకరించిన బొంత సంపత్, లక్ష్మీనారాయణ, రాజులను అరెస్టు చేశారు. వీరిని విచారించ గా మరో చోట వున్న భారీ పేలుడు సామాగ్రి కూడా పట్టుబడింది. ఈ పేలుడు సామాగ్రిని శంకర్, స్వామి, చంద్రశేఖర్ అనే వ్యక్తుల నుంచి వీరు సేకరించినట్లు తేలింది. పట్టుబడ్డ పేలుడు సామాగ్రిలో జిలిటెన్ స్టిక్స్‌తో పాటు డిటోనేటర్లు, వీటిని పేల్చేందుకు వాడే బ్యాటరీ వుంది. వీటిని గనులను నిర్వ హించే కాంట్రాక్టర్ల నుంచి కొని వుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో మొదటగా పట్టుబడిన నలుగురిని రిమాండుకు తరలించగా చంద్రశేఖర్ అనే వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఇతన్ని విచారిస్తున్నారు. ఇదే కేసులో శంకర్, స్వామిల కోసం గాలిస్తున్నారు.

## గ్యాంగ్ సభ్యుడి భార్యతో వివాహేతర సంబంధం

### 40 మంది ముఠాతో అతడిని అంతంచేసే ప్లాన్

### పోలీసులకు లొంగిపోయిన గ్యాంగ్ సభ్యుడు

**నాగ్‌పూర్, జూలై 6:** సొంత ముఠా సభ్యుల నుంచే ప్రాణహాని ఏర్పడటంతో ఓ గ్యాంగ్‌స్టర్ పోలీసులను ఆశ్రయించడం నాగ్‌పూర్‌లో తీవ్ర కలకలం రేపింది. నగరంలోని పేరుమోసిన ఇప్పా గ్యాంగ్‌లో ఓ సభ్యుడి భార్యతో అదే గ్యాంగ్‌కు చెందిన అర్షద్ టోపీ అనే వ్యక్తి అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో జరిగిన ఓ ప్రమాదంలో ఆమె మరణించడంతో, స్నేహితులే అతనికి శత్రువులుగా మారారు. ఇప్పా గ్యాంగ్‌కు చెందిన ఓ సభ్యుడి భార్యతో (29) అర్షద్ టోపీకి వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలిసి గ్యాంగ్ సభ్యులు అతడిని హెచ్చరించినా పట్టించుకోలేదు. అర్షద్ తన ప్రియురాలితో కలిసి ద్విచక్రవాహనంపై కొరాడి మాతా ఆలయం సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లాడు. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఓ జేసీబీ వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అర్షద్‌కు స్వల్ప గాయాలు కాగా, వెనుక కూర్చున్న మహిళ తీవ్రంగా గాయపడింది.

వెంటనే ఆమెను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వారు చేర్చుకోవ డానికి నిరాకరించారు. మరో ఆసుపత్రిలోనూ అదే పరిస్థితి ఎదురైంది. దీంతో అర్షద్ ఓ అంబులెన్స్ సహాయంతో ఆమెను ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. ఈ విషయం తెలియగానే ఇప్పా గ్యాంగ్ ఆగ్రహంతో రగిలిపోయింది. తమ నమ్మకాన్ని వమ్ము చేసిన అర్షద్‌ను చంపేస్తామని శపథం చేసింది. తన భార్య మరణం ప్రమాదం కాదని, అర్షద్ హత్య చేసి ఉంటాడని ఆమె భర్త అనుమానిస్తున్నాడు.



దీంతో సుమారు 40 మంది సాయుధ గ్యాంగ్ సభ్యులు నగరం మొత్తం అర్షద్ కోసం గాలించడం మొదలుపెట్టారు. ప్రాణభయంతో అర్షద్ నేరుగా పార్డిలోని డీసీపీ నికేతన్ కదమ్ కార్యాలయానికి వెళ్లి తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నాడు. 'అర్షద్ రక్షణ కోరాడు, కానీ అధికారికంగా కేసు పెట్టడానికి మాత్రం ఇష్టపడలేదు' అని డీసీపీ కదమ్ తెలిపారు.

ఆయన వెంటనే అర్షద్‌ను కొరాడి పోలీస్ స్టేషన్‌కు పంపి, అతని వాంగ్మూలం నమోదు చేయించారు. ఇది ప్రమాదంలానే కనిపిస్తోందని, ప్రతీకార దాడులకు పాల్పడవద్దని పోలీసులు ఇప్పా గ్యాంగ్‌ను హెచ్చరించారు. పరిస్థితి సద్దుమణిగిందని భావించిన అర్షద్ రాత్రి పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లిపోయినప్పటికీ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా క్రైమ్ బ్రాంచ్, పోలీసులు నగరంపై నిఘా ఉంచారు.

## కేంద్రం నుంచి ఏకాణా తేలేదు

### మీరు మాకు లేఖలు రాయడం విడ్డూరంగా ఉంది

### బిజెపి చీఫ్ రాంచందర్‌రావు ఉత్తరంపై మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** కేంద్రం నుంచి ఏకాణా తేలేని మీరు మాకు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని భారతీయ జనతా పార్టీ(బిజెపి) తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు రాసిన లేఖపై ఫైర్ అయ్యారు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. గత 11 ఏళ్లుగా కొనసాగనుతున్న ప్రధాని నరేంద్ర మోడి సర్కార్ మెగా ఫెయిల్యూర్స్ సంగతేందని బిజెపి చీఫ్ రామచందర్ రావుని ప్రశ్నిస్తూ పొన్నం ప్రభాకర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. 11 ఏళ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ ప్రజలను అడుగడునా వంచింది. గత మూడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలను విస్మరించి ప్రజల ఆశలపై నీల్లు చల్లారు. వాగ్దానాలతో ఊదరగొట్టడం.. విద్వేషాన్ని రెచ్చగొట్టడం.. అబద్దాలను ఆవిష్కరించడం తప్ప మీరు చేసిందేమి లేదు. రైతులు, యువకులు, మహిళలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటి..ఇలా అన్ని వర్గాలను వంచించిన చరిత్ర మీది. మీ వైఫల్యాలు రాస్తే రామయణమంత.. వింటే భారతమంత.. అలాంటి మీరు మా సీఎంకి లేఖలు రాయడం విడ్డూరంగా ఉందన్నారు. గురువింద సామేతను గుర్తు చేసే విధంగా ఉన్న మీ లేఖ నవ్వు తెప్పిస్తుంది. ఒక వేలు ఇతరుల వైపు చూపితే..నాలుగు వేళ్లు మీ పైపే చూపుతాయన్న ఇంగితాన్ని మరిచిన మీకు.. మీ హామీల ఉల్లంఘనను గుర్తు చేస్తున్నామన్నారు. 60 ఏండ్లు దాటిన సన్న చిన్నకారు రైతులకు నెలకు పింఛన్లు ఇస్తామని 2019 పార్లమెంటు ఎన్నికల ప్రణాళికలో పేజీ నెం. 13లో ప్రామిస్ చేశారు? అమలు చేశారా? తెలంగాణ కోసం వందలాది మంది విద్యార్థులు బలిదానం తీసుకుంటే తెలంగాణ ఇవ్వడాన్ని పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి మోడీ తప్పు పట్టడంపై మీ స్టాండ్ ఏంటి? దానిని తప్పు అంటారా? సమర్థిస్తారా? తెలంగాణకు 11 సంవత్సరాల్లో ఏం చేశారు? తెలంగాణకు ఒక్క రూపాయి రాకపోతే మీరు కానీ ఈ రాష్ట్రంలో ఉన్న 8 మంది మీ పార్టీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఏం చేశారని మంత్రి పొన్నం లేఖలో ప్రశ్నించారు. పదకొండేండ్లలో దేశంలో ఒక్క రేషన్ కార్డును ఇవ్వని దుస్థితి మీది కాదా? దేశంలో ఒక కోటి 31 లక్షల మందికి రేషన్ బియ్యం ఎగ్గొట్టిన పాపం మీది కాదా? లీటర్ పెట్రోల్ ధరను రూ.70 నుంచి రూ. 110 కి పెంచింది మీరు కాదా? లీటర్ డిజిల్ రూ. 50 నుంచి రూ. 100 కి పెంచిది మీరు కాదా? గ్యాస్ బండ ధరను రూ.400 నుంచి రూ.1100 చేసింది మీరు కాదా? 2014 ఎన్నికల ప్రచారంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఓట్లేయించుకుని.. ఇప్పుడు సడిసప్పుడు చేయంది మీరు కాదా? మీ తీరు వల్ల తెలంగాణ రెండు రకాలుగా నష్టపోతుంది. ఒక వైపు మీ విధానాల వల్ల తెలంగాణ ప్రజలు నష్టపోతుంటే.. విభజన హామీలను నెరవేర్చకుండా తెలంగాణ ప్రజలను దగా చేస్తున్నది మీరు కాదా? అన్నారు. చేతనైతే మోడికి లేఖ రాసి.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చండి. అంతేగాని ఏడాదిన్నర క్రితం ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం అప్పుడే అన్ని చేసేయాలని మీరు లేఖలు రాయడం మీ గుడ్డి ద్వేషానికి అద్దం పడుతోందంటూ మంత్రి పొన్నం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావుకి ఘాటుగా లేఖ రాశారు.

## ఫాల్కన్ ఇన్వాయిస్ గోల్‌మాల్ కేసులో కీలక నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ గోల్‌మాల్ కేసులో కీలక నిందితుడు ఆర్యన్ సింగ్ అలియాస్ ఆర్యన్ చబ్ర (39)ను సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి చీఫ్ చారు సిన్హా ఆదివారం మీడియాకు వెల్లడించారు. హై టెక్ సిటీ కేంద్రంగా ఏర్పాటైన క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనంతరం ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్‌గా పేరు మార్చుకుని వేల సంఖ్యలో అ మాయకులను వందల కోట్ల రూపాయలను ముంచడం తెలిసిందే. గత ఫిబ్రవరి నెలలో ఈ కంపెనీ బిచాణా ఎత్తేయడం విదితమే. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌం ట్ పేరుతో జరిగిన భారీ గోల్‌మాల్ పథకం ద్వారా 4065 మంది బాధితులు 792 కోట్ల రూపాయలను పోగొట్టుకున్నారు. వాస్తవానికి ఈ కంపెనీ 7056 మ ంది బాధితుల నుంచి 4215 కోట్ల రూపాయలను వసూలు చేసి ఇందులో కొందరికి డబ్బులు ఇవ్వగా 4065 మంది బాధితులకు 792 కోట్ల రూపాయలు చెల్లి ంచలేదు. దీనిపై మొదట సైబరాబాద్ పోలీసులు విచారించగా ఆ తరువాత ఈ కేసును సిఐడికి బదలాయించారు. దీనిపై విచారణ చేబట్టిన సిఐడి పోలీసులు ఇప్పటి వరకు ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేయగా తాజాగా పంజాబ్‌లోని బటిండాలో రహస్యంగా వున్న ఆర్యన్ సింగ్ (39)ను ఈ నెల నాలుగవ తేదీన అరెస్టు చేసి ఆదివానం నాడు హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరుపరిచి చంచల్‌గూడ జైలుకు రిమాండుకు పంపారు. కాగా అరెస్టయిన అర్యన్ సింగ్ ఈ కంపెనిలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా వుండడంతో పాటు నిధుల బదలాయింపులో కీలకంగా వ్యవహరించాడు. కోటి 62 లక్షల రూపాయలకు పైగా బాధితుల సొమ్మును ఈ నేరగాడు ఇతరులకు బదలాయించి విదేశాలకు ఉడాయించి అనంతరం పంజాబ్‌లో రహస్యంగా వుండగా పక్కా సమాచారం మేరకు సి ఐడి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో పరారీలో వున్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు.

## నకిలీ డ్రగ్స్ లెవిపిల్-500 స్వాధీనం చేసుకున్న డిసిఎ అధికారులు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త :** నకిలీ మందులపై డిసిఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.ఇందులో భాగంగా డిసిఏ (ఔషధ నియంత్రణ యంత్రాంగం)పలు మెడికల్ షాపులపై దాడులు నిర్వహించారు. సన్ ఫార్మా లాబొరేటరీస్ లిమిటెడ్ తయారు చేసినట్లు తప్పుగా చెప్పుకుంటున్న నకిలీ ఔషధం (నకిలీ వెర్షన్) లెవిపిల్ 500 మాత్రలు (లెవెటిరాసెటమ్ మాత్రలు 500) స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచార సమాచారం ఆధారంగా దాడులు నిర్వహించిన అధికారులు హైదరాబాద్‌లోని కవాడిగూడ ,కరీంనగర్‌లో మార్కెట్‌లో లెవిపిల్500ఎంజి మాత్రల నకిలీ వెర్షన్ చలామణిలో ఉన్నట్లు గుర్తించారు.హైదరాబాద్‌లోని కవాడిగూడలోని ఎస్‌బిఐ కాలనీలోని అరవింద్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, కరీంనగర్‌లోని సాయినగర్, డాక్టర్స్ స్ట్రీట్‌లో ఉన్న వేణు మెడికల్ ఏజెన్సీస్‌పై జరిగిన దాడులలో నకిలీ మందులు స్వాధీనం చేసుకున్నారు.లెవిపిల్ 500 టాబ్లెట్ ఫిట్స్(మూర్ఛ వ్యాధిలో ఫిట్స్) చికిత్సకు ఉపయోగించే యాంటీఎపిలెప్టిక్ ఔషధమని అధికారులు చెబుతున్నారు.

## ఇద్దరు రైతులు ఆత్మహత్య

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వ్యవసాయం దెబ్బతిని అప్పులు తీర్చే మార్గం లేక వేర్వేరు జిల్లాలకు చెందిన ఇరువురు రైతులు బలన్మరణానికి పాల్పడ్డారు. రాష్ట్రంలోన నాగర్‌కర్నూల్, భూపాలపల్లి జిల్లాల్లో ఈ సంఘటనలు చోటు చేసుకున్నాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం బుద్ధసముద్రం గ్రామానికి చెందిన కావలి రామాంజనేయులు (40) అనే రైతు తనకు ఉన్న రెండెకరాల పొలంలో నిరుడు వరి సాగు చేయగా, మరో మూడున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశారు. అయితే తెగులు సోకి దిగుబడి అంతంత మాత్రమే రావడంతో దాదాపు రూ.3.50 లక్షల అప్పు మిగిలింది. దీనికితోడు ఓ బ్యాంకులో రూ.లక్షకు పైగా క్రాప్ లోన్ తీసుకున్నారు. మరోవైపు దాదాపు రూ.5 లక్షల వరకు అప్పులు ఉండటంతో వాటి వసూళ్లకు వత్తిళ్లు పెరిగి వీటిని తీర్చే మార్గం లేక పోయింది. ఈ కమంలో తన పొలం వద్ద కలుపు మందు తాగి అత్మహత్యకు పాల్పడ్డారు. వెంటనే సమాచారం తెలిపిన కుటుంబ సభ్యులు జడ్చర్ల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మరుసటి రోజు మహబూబ్‌నగర్‌కు.. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. అలాగే భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం నాచారం గ్రామానికి చెందిన బండారి దేవేందర్ (30) గత కొన్నేండ్లుగా మూడున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. కౌలుకు తీసుకున్న భూమిలో రెండేండ్లుగా మిర్చి సాగు చేస్తున్నారు. పంట చీడపీడల బారిన పడి దిగుబడి రాక, ధర లేక వరుసగా నష్టాలు వచ్చాయి. ఈ క్రమంలో పంట సాగు కోసం చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. అప్పులు తీర్చేమార్గం కానరాక జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నారు.

వార్త

మనస్సును ఆరోగ్యకరమైన ఆలోచనలతో నింపండి, అవే జీవితాన్ని సుఖమయం చేస్తాయి.

న-విల్‌కిన్స్

# పెరుగుతున్న పేదరికం!

ధనిక, పేదల మధ్య వ్యత్యాసం తగ్గించి సమ సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని, అందుకోసమే పేదల అభ్యున్నతికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్లు వెచ్చిస్తున్నామని పాలకులు పదేపదే చెప్తుంటారు. కానీ ధనికులు మరింత లక్ష్మీపుత్రులుగా ఎదిగిపోతుంటే పేదలు మరింత పేదలుగా దిగజారిపోతున్నారు. భారత దేశానికి సంబంధించి కూడా మొత్తం సంపద యాభై, అరవై మంది గుప్పెట్లో చిక్కుకుపోయిందని ఎంతోకాలంగా అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా ఈ అంతరాయం అంతకంతకు పెరుగుతున్నది. దేశ జనాభాలో డెబ్బైశాతం మంది వద్ద ఎంత సంపద ఉందో కేవలం ఆ గుప్పెడు మంది చేతుల్లో అంతకుమించి సంపద చిక్కుకుపోయిందని గతంలో కూడా ఎన్నో నివేదికలు వెల్లడించాయి. యేడాది యేడాదికి లక్ష్మీపుత్రుల ఆదాయం పెరుగుతుంటే నిరుపేదల ఆదాయం తగ్గిపోతున్నది. చివరకు కరోనా సమయంలో కూడా కొందరు లక్ష్మీపుత్రుల సంపదఊహించని రీతిలో పెరిగితే నిరుపేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మూడు పూటల తిండి సంగతి దేవుడెరుగు ఒక్క పూటకు కూడా నోచుకోని నిర్భాగ్యులెందరో ఉన్నారు. ఇండోనేషియా, చైనా, లావోస్, తదితర దేశాలు పది శాతం ధనికుల సంపద ఇరవైయేళ్లలో పదిహేనుశాతం పెరిగితే అదే సమయంలో దేశంలో ఆర్థికంగా అట్టడుగున్న పదిశాతం ప్రజల సంపాదన పదిహేను శాతం మించి పడిపోయింది. కూలీల చెల్లింపుల విషయంలోనే ఆసియా దేశాల్లో మహిళలపై వివక్ష నేటికీ కొనసాగుతూనే ఉన్నది. ఒకే పనిచేస్తున్నా పురుషులకు ఇచ్చే కూలి మహిళలకు ఇవ్వడం లేదు. వేతనాల చెల్లింపుల్లో వివక్ష భారత్‌లోనే ఎక్కువగా ఉన్నట్లు ఎన్నో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. భారత్‌లోనే కాటన్, స్పిన్నింగ్ మిల్లులకు వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. కానీ ఈ మిల్లుల్లో బాలికలతో తక్కువ వేతనంతో పనిచేయిస్తున్నారు. ఏదిఏమైనా భారత దేశంలో సంపద అసమానత పెచ్చుమీరుతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతున్నది. మరొకపక్క మనిషి ఆకలితో అలమటించే పరిస్థితులను రూపుమాపే లక్ష్యాన్ని 2030 నాటికి చేరుకోవాలనే ఐక్యరాజ్యసమితి లక్ష్యం నెరవేరే పరిస్థితులు కనుచూపు మేరలో కన్పించడం లేదు. మరొక పక్క యేటా ఆకలితో అలమటించేవారి సంఖ్య పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. 2021లో ప్రపంచ వ్యాప్తంగా ఎనభైరెండు కోట్ల మందికిపైగా ఆకలి సమస్య ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యను ప్రపంచం నుంచి తరిమివేయాలని 2015లోనే ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. కానీ అప్పటి నుంచి ఆకలితో అలమటించే వారిసంఖ్య పెరుగుతూ కరోనా తర్వాత ఏకంగా ఒకేసారి పదిహేను కోట్ల మంది అదనంగా వచ్చిచేరారు. దీంతోపాటు ప్రపంచంలోదాదాపు రెండువందల ముప్పైకోట్ల మంది ఏదో రకమైన ఆహార భద్రత సమస్యను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని భరించే స్థితిలో లేనివారి సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఇటీవల ప్రపంచంలో ఫుడ్ సెక్యూరిటీ న్యూట్రిషన్-2022 నివేదిక స్పష్టం చేసింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2030 నాటికి ప్రపంచ జనాభాలో ఎనిమిది శాతం మంది పోషకాహార లోపానికి గురవుతారని 2015లో ఉన్న స్థాయికి మళ్లీ చేరుకుంటారని ఆ నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోనే కాదు భారత్‌లోనూ ఈ సమస్య తీవ్రంగానే ఉన్నట్లు ఆ నివేదిక వెల్లడించింది. ఇక దక్షిణాసియా కొన్ని ఆఫ్రికా దేశాల్లో పేదరికం ఛాయలు అధికంగానే ఉన్నాయి. పేదలు అధికంగా ప్రస్తుతం దక్షిణాసియా, సబ్‌సహారాఆఫ్రికా దేశాల్లోనే ఉన్నారు. 1990తో పోలిస్తే ఆ దేశాల్లోజనాభా ఎంత పెరిగిందో పేదల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నది. భారతదేశానికి సంబంధించి పేదరికంపై ఏనాటి నుంచో పోరాటం చేస్తున్నారు. లక్షలాదికోట్లరూపాయలు పెద్దఎత్తున వివిధ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారు. కానీ వాటి ఫలితాలు ఆశించిన మేరకు కన్పించడం లేదు. స్వల్ప వృత్తి సాధించడం తప్పిస్తే పేదరికాన్ని ఆశించిన స్థాయిలో నిర్మూలించలేకపోతున్నారు. పేద కుటుంబాలకు ఆకలి బాధలేకుండా చేయాలనేలక్ష్యంతో ఎన్నో సబ్సిడీ పథకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కొనసాగిస్తూనే ఉన్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ అందులో అతిపెద్దది. దేశంలో దాదాపు డెబ్బై, ఎనభై కోట్ల మందికిపైగా ఈ పథకం కింద లబ్ధిపొందుతున్నారు. కానీ లబ్ధిపొందేవారి సంఖ్య యేడాది యేడాదికి పెరుగుతుండడం పేదల సంఖ్య పెరుగుతుందనే సంకేతాలు వెలువడుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి సంస్థ చేస్తున్న లెక్కలకు, ప్రజాపంపిణీ వ్యవస్థ లెక్కలకు పొంతన ఉండడం లేదు. ఆ లెక్కల ప్రకారం పేదల సంఖ్య తగ్గిపోతుంటే ప్రజాపంపిణీ సంస్థ లెక్కల్లో ఊహించని రీతిలో నిరుపేద కుటుంబాలు పెరిగిపోతున్నాయి. దేశంలో ఎన్ని పథకాలు రూపొందించినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలువెచ్చించినా పేదరికంపై పోరాటం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. పేదరికం దానంతట అదే తగ్గిపోతుందనుకుంటే అదే భ్రమే అవుతుంది. ఆఫ్రికా దేశాల్లోనూ ప్రభుత్వాలు కీలకమైన పాత్ర పోషిస్తేనే పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యపడుతుందనే విషయాన్ని టాంజేనియా అనుభవం చెబుతున్నది. ప్రభుత్వ విధానాలు అందుకు అనుగుణంగా ఉండాలి. ఆర్థికాభివృద్ధితోపాటు సంపద పంపిణీ, వ్యవసాయరంగంలో సంస్కరణలు, వైద్యసేవల విస్తరణ, విద్య తదితర అంశాలపై కేంద్రీకరించాలి.

అలవాట్లు అబ్బడం మన చేతిలోనే ఉంది. ఎలాంటి అలవాట్లు ఏర్పర్చుకొంటే అలా తయారవుతాము.



నెహ్రూ

ఉపన్యాసకుడైనా, రచయిత అయినా తన భావాల్ని సంక్షిప్తీకరించడం నేర్చుకోగలిగేంత వరకూ విజయం సాధించలేడు.



ఎమర్సన్

## ప్రజావాక్కు



### గ్రామీణ రహదారులకి మోక్షం ఎప్పుడో?

గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాహదారులను పట్టించుకోకపోవడంతో పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండల పరిధిలోనిఊరదాళ్ళపాలెం గ్రామ ప్రధానరహదారి మీదుగా డి.కుమదవల్లి, కోమర్రు, వరిఘేడు, దువ్వ రహదారులు అధ్వాన్నంగా మారడంతోఏళ్ల తరబడి గుంతలు, తేలాడిన కంకరపై వాహనదారులు ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట ఈ రహదారిపై ప్రయాణం అంటే ఒక సాహసమే. అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కనీసం మరమ్మతులు చేపట్టడం లేదని గ్రామ ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. అటు రైతులు తమ ఎరువులను, పంట ఉత్పత్తులను తరలించడానికి ఈ రహదారే ప్రధాన మార్గం. మరో పక్క ప్రభుత్వాలు గ్రామీణ రహదారుల మరమ్మతులు చేపట్టేందుకు గ్రాంటులు రిలీజ్ అయ్యాయి అని చెబుతున్నా ఆచరణకు నోచు కోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం, ప.గో జిల్లా

### ఆప్షనల్ హాలిడేస్ మీద ఆంక్షలు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాఠశాలల్లో ఆప్షనల్ హాలిడేస్ 5 రోజులు అనేవి పాఠశాల మొత్తానికి ఇచ్చుకొనేవిధంగా గతంలోఉండేది. ప్రస్తుత ప్రభుత్వం ఈసంవత్సరం నుండి ఆప్షనల్ హాలిడేస్‌ని వ్యక్తిగతంగా యాభై శాతం ఉపాధ్యాయ సిబ్బందిమాత్రమే వాడుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆప్షనల్ హాలిడేస్ వినియోగించుకోవడం వీలుకావడం లేదు. కావున ఆప్షనల్ హాలిడేను ఎక్కవ మంది ఉపాధ్యాయులు వినియోగించుకోలేకపోతున్నారు.కాబట్టిప్రభుత్వం పునరాలోచనచేసి గతంలోలాగా పాఠశాలమొత్తం వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

స్కూళ్లు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ప్రతి ఒక్కవిద్యార్థి కూడా కొత్త విద్యాసంవత్సరంలో వేళుతున్నారు.కనుకఒక మొక్కనాటినట్లయితే వాళ్ల విద్యా సంస్థలతో పాటు ఆ మొక్క కూడా పెరుగుతుంది. విద్యార్థి కూడా తాపత్రయపడి ఆ మొక్కను పెంచుతాడు.

- కె.రాఘువేంద్ర బాబు, ఆంధ్రప్రదేశ్

### కార్పొరేట్ వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షే

రాష్ట్రాలలో పరిశ్రమలు ఎన్ని ఉన్నాయో అంతకంటే ఎక్కువ చిన్న పెద్దా ఆసుపత్రుల సంఖ్య ఉంది. కార్పొరేట్ హాస్పటల్స్ అన్నీ ప్రతీరోజు రోగులతో కిటకిటలాడిపోతున్నాయి. ప్రతీ చిన్న నలతకు సవాలక్ష పరీక్షలు చేయించకు రమ్మని డాక్టర్లు రాస్తున్నారు. ఈపరీక్షలు, డాక్టర్ల, ఫీజులు అన్నీకలపి వేలు లక్షల్లో బిల్లులు చెల్లించవలసి వస్తోంది. డాక్టర్లు ఎంత బిజీగా ఉన్నారంటే పేషెంట్లతో ఓపిగ్గా మాట్లాడరు. రోగుల బాధలు పూర్తిగావినరు.ఈమధ్య హైద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో కేవలం అర నిముషం లోపలే మందుల చీటీ రాసిచ్చి పంపేసారు.అందరూ అలా ఉంటారనికాదు. ఏమయినా కార్పొరెట్ వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షే.ప్రభుత్వ ఆసుపత్రులలో అయితేఅక్కడక్కడా చేయి తడిపితేకాని పనులు జరుగవు. వృద్ధులకు కేంద్రం ఆయుష్మాన్ భారత్ ఏడాది క్రితం ప్రవేశపెట్టినా ఇంతవరకు తెలంగాణా లో జారీ కావట్లేదు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### యువతను ఆకర్షిస్తున్న డిజిటల్

ఆధునిక డిజిటల్ విప్లవంతో ప్రపంచం మన చేతిలోకి వచ్చింది. సమాచార మార్పిడిలో వేగం పెరిగింది. కానీ ఇదే డిజిటల్ ప్రపంచం నేటియువతను,చిన్నారులను ప్రమాదకరమైన మార్గాలవైపు నడిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా, ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లలోఅశ్లీలకంటెంట్ విపరీతంగా పెరిగిపోతుండటం ఆందోళనకరం. పబ్లిక్ డొమైన్‌లో సులభంగా లభించే పోర్న్ వీడియోలు,అసభ్య షార్ట్ క్లిప్స్, ఛాట్ గ్రూపులు యువత మన స్తత్వాన్ని వికృతంగా మార్చుతున్నాయి. టీనేజర్ వయసులోనే లైంగిక ఆలోచనలు పెరగడం,అమ్మాయిలను వస్తువుల్లా చూడడం వంటిపరిణామాలు ఆవిష్కృతమవుతున్నాయి. చిన్నారులు కూడా మొబైల్ ద్వారా ఈ విషపూరిత కంటెంట్‌కు చేరువ అవుతుండటం మరింత భయంకరం. ఇది దేశ భవిష్యత్తుకు ముప్పుగా మారుతుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### గెజిటెడ్ హోదా కల్పించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో గురుకులాలలో జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీ చేసింది. వీరికి గెజిటెడ్ హోదా ప్రభుత్వం కల్పించాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్‌లకు గెజిటెడ్ హోదా కల్పించారు. డాక్టరేట్ పట్టభద్రులైన గురుకుల లెక్చరర్ కు గెజిటెడ్ హోదా కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్‌జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెలుగు రాష్ట్రాల మధ్య బనకచర్ల చిచ్చు

**రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ తమ ఆవశ్యకతలు సమర్పించుకుని, కేంద్ర ప్రభుత్వం పారదర్శక విచారణతో తేల్చాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం నీటి ప్రాజెక్టు అనేగాక, నీటి రాజకీయం, న్యాయం, సహకార పద్ధతుల పరీక్షగా భావించాలి. మిగతా రాష్ట్రాలకు ఇది ఒక ఉదాహరణ కావాలి. అవసరాల నేపథ్యంలో కూడా చట్టబద్ధతకు, సమగ్ర అనుమతులకు, సమన్వయానికి విలువ ఇవ్వాల్సిన అవసరం ఎంతగానో ఉంది. బనకచర్ల లిఫ్ట్ ప్రాజెక్టు దక్షి ణ ఆంధ్రప్రదేశ్‌కు సాగునీటి శాపమా, లేక తెలంగాణకు నదీ హక్కుల అపహరణా అనే ప్రశ్న ఇప్పటికీ తేలలేదని చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు అమలు చేయకుండా రెండు రాష్ట్రాలకు మధ్య సంఘర్షణ కొనసాగే అవకాశం ఉంది. జలాలపై సమన్వయ, పారదర్శకత, న్యాయబద్ధమైన వాటా నిర్ణయాలు కేంద్రం ద్వారా తీసుకోవడం అత్యవసరం. రాష్ట్రాలు పరస్ప రం నమ్మకం కలిగి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.**

రాయలసీమ ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాస్పద అంశంగా మారింది. రాష్ట్రవిభజన తర్వాత గోదావరి- కృష్ణా జలాల వినియోగంపై తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న ఉద్వేగపూరిత పోరాటానికి బనకచర్ల ప్రాజెక్టు తాజా ఉదాహరణగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల లింక్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రస్తుతం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఒకవైపు ఇది రాయలసీమ సాగునీటి అవసరాల తీర్చడానికని ఏపీ వాదిస్తుండగా, మరోవైపు అనుమతులు లేకుండానే ప్రాజెక్టును ప్రారంభించడంపై తెలంగాణ తీవ్రఅభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తెలంగాణ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై పోలవరం, పత్యరేడు, గాలేరు నాగరి, వేలు గోడు వంటి ప్రాజెక్టుల విషయంలో అనుమతుల లేమిపై నిరసన వ్యక్తం చేస్తోంది. ఇక బనకచర్ల లిఫ్ట్ కూడా అదే కోవలోనిదే. గోదావరిలోని మించి సముద్రంలోకి పోతున్న నీటిని ఎత్తిపోసి నంద్యాల జిల్లా బనకచర్ల వరకు తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ లింక్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది పూర్తిగా ఎత్తిపోతల పథకంగా రూపొందించబడింది. గోదావరి నుంచి నీటిని తీసుకొని కృష్ణా నదీ పరివాహక ప్రాంతమైన రాయలసీమకు తరలించాలన్నదే దీని లక్ష్యం. బనకచర్ల లిఫ్ట్ ప్రాజెక్టు, కృష్ణా నదిపై ఉన్న సంజీవయ్య సాగర్ (వెలిగొండ జలాశయం) వద్ద నుండి నీటిని ఎత్తిపోసి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సాగునీటిగా వినియోగించాలనే ఉద్దేశంతో రూపొందించబడింది. ఇది ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి నీటి అవసరాలను తీర్చడానికే లక్ష్యంగా ఉంది. ప్రాజెక్టు ద్వారా నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో కొత్తగా 7.4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, ఇప్పటికే సాగులో ఉన్న 22.6 లక్షల ఎకరాలకు స్థిరీకరణ చేయనున్నారు. పథకాన్ని పురోగతిలో పెట్టేందుకు 9,600 కోట్ల రూపాయల టెండర్లు మే 2024లోనే విడుదల చేయడమే కాకుండా, పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ ప్రాజెక్టుపై నైతిక, న్యాయ, పారిశ్రామిక, పర్యావరణ పరంగా అనుమతుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ నుంచి టెక్నికల్ క్లియరెన్స్, కేంద్ర పర్యావరణ శాఖ నుంచి పర్యావరణ అనుమతులు, కేంద్ర జల కమిషన్,గోదావరి నది నిర్వహణ మండలి, రెండు రాష్ట్రాల

రామ కిష్టయ్య సంగన భట్ల

సమన్వయ సంస్థ అయిన ఏపెక్స్ కౌన్సిల్ నుండి ఎలాంటి అంగీకారం లేకుండానే ఏపీ ప్రాజెక్టును చేపట్టింది. ఇది ఏక పక్ష చర్యగా భావిస్తూ తెలంగాణ రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా నాలుగు విషయాల్లో అభ్యంతరాలు తెలియజేసింది. మొదటిది - ఇది చట్ట ఉల్లంఘన. 2014లో అమలులోకివచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంప్రకారం, రెండు రాష్ట్రాల మధ్య నీటి వినియోగానికి సంబంధించి ఏవైనా ప్రాజెక్టులు ప్రారంభించడానికి కేంద్ర అనుమతులతో పాటు ఏపెక్స్



కౌన్సిల్ అంగీకారం తప్పనిసరి. రెండవది-ఈ లింక్‌ప్రాజెక్టు వల్ల గోదావరిలోని ప్రవాహం తగ్గి తెలంగాణలోనిములుగు, భూపాలపల్లి, మానుగూరు ప్రాంతాలలో బ్యాక్వాటర్ ప్రభావంతో వరద ముప్పు పెరిగే అవకాశం ఉంది. మూడవది - కృష్ణా జలాలపై ఇప్పటికే అన్యాయం జరుగుతుంటే,మరింత నీటిని డైవర్ట్ చేయడం అన్యాయమని తెలంగాణ అభిప్రాయం. నాలుగవది - కేంద్రం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోవడం వల్లే ఏపీకి కొంత ధైర్యం వచ్చినట్టు తెలంగాణ నేతలు ఆరోపిస్తున్నారు. తెలంగాణ మంత్రులు ఈఅంశంపై స్పష్టమైన వైఖరి ప్రకటించారు. ఇది తెలంగాణ రైతుల హక్కులపై దాడిగా పేర్కొంటూ కేంద్రాన్ని పలుమార్లు అప్రమత్తం చేశారు. ఇక్కడ గణాంకాలు ఆసక్తికరంగా ఉన్నాయి. గోదావరిలో ప్రతి ఏడాది సుమారు 3,000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుంది. ఏపీ ప్రతిపాదించిన ప్రాజెక్టు ద్వారా దాదాపు 200 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోసి రాయలసీమకు తరలించాలన్నదే ప్రధాన ఉద్దేశం. దీనిని 'పొయ్యే నీటిని వినియోగించుకుంటున్నాం' అనే పేరుతో సమర్థించుకుంటున్నారు. కానీ ఇందులోను ఓ వ్యాజ్యం ఉంది. 1980లో ఏర్పడిన గోదావరి జలాల తత్వ విచారణ కమిటీ తీర్పుల ప్రకారం, ఏ ఒక్క రాష్ట్రం కూడా ఇతర రాష్ట్ర అంగీకారం లేకుండా గోదావరి నీటిని వేరే బేసిన్‌కు తరలించ లేదు. ఇది న్యాయపరంగా మాత్రమే కాదు, సాంకేతికంగా, పర్యావరణ పరంగా కూడా తీవ్ర పరిణామాలను కలిగించే అంశం. ఎత్తిపోతల ద్వారా 250 మీటర్ల ఎత్తువరకు నీటిని తరలించాలి. ఇందుకోసం విద్యుత్ వినియోగం, పారిశ్రామిక నిర్మాణం, బ్యాక్వాటర్ ప్రభావం వంటి అంశాలు వివరంగా పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు కీలక నివేదికలు అందుబాటులో లేవు. ఇక కేంద్రం పాత్ర విషయానికి వస్తే, అది ఇప్పటికీ స్పష్టత ఇవ్వకుండా రెండు రాష్ట్రాలకు మధ్య వివాదాన్ని పెంపొందించేలా వ్యవహరిస్తోంది. రెండు రాష్ట్రాలు ఒకే నదిని పంచుకుంటున్నప్పుడు కేంద్రం నిష్పక్షపాత ధోరణితో మెలగాల్సిన, వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కానీప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు రాజకీయ పక్షపాతం, ప్రాంతీయ ఒత్తిళ్లకు లోనవుతున్నట్టు అనిపిస్తోంది. సంపూర్ణంగా చూస్తే బనకచర్ల ప్రాజెక్టు అవసరం కలిగిన ప్రాంతానికి నీరు అందించాలన్న మంచి ఉద్దేశంతో ప్రారంభమైనా, పారదర్శకత, చట్టపరమైన ప్రక్రియలు, పర్యావరణ ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ఈ ప్రాజెక్టు వ్యతిరేకతకు గురవుతోంది. ఒక రాష్ట్రం నీటి ప్రాజెక్టును కొత్తగా ప్రారంభించడమంటే అది పరస్పర అపనమ్మకానికి, నదీ జలాల పంచాయితీకి, అవకాశం లేకుండా ఉండాలి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ తమ ఆవశ్యకతలు సమర్పించుకుని, కేంద్ర ప్రభుత్వం పారదర్శక విచారణతో తేల్చాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం నీటి ప్రాజెక్టు అనేగాక, నీటి రాజకీయం, న్యాయం, సహకార పద్ధతుల పరీక్షగా భావించాలి. మిగతా రాష్ట్రాలకు ఇది ఒక ఉదాహరణ కావాలి. అవసరాల నేపథ్యంలో కూడా చట్టబద్ధతకు, సమగ్ర అనుమతులకు, సమన్వయానికి విలువ ఇవ్వాల్సిన అవసరం ఎంతగానో ఉంది. బనకచర్ల లిఫ్ట్ ప్రాజెక్టు దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు సాగునీటి శాపమా, లేక తెలంగాణకు నదీ హక్కుల అపహరణా అనే ప్రశ్న ఇప్పటికీ తేలలేదని చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు అమలు చేయకుండా రెండు రాష్ట్రాలకు మధ్య సంఘర్షణ కొనసాగే అవకాశం ఉంది. జలాలపై సమన్వయ, పారదర్శకత, న్యాయబద్ధమైన వాటా నిర్ణయాలు కేంద్రం ద్వారా తీసుకోవడం అత్యవసరం. రాష్ట్రాలు పరస్పరం నమ్మకం కలిగి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# 'ఇంజినీరింగ్' ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి

తిలాపాపం తలా పిడికెడు అన్నట్టుంది ఇంజినీరింగ్ కళాశాల పరిస్థితి.వాళ్లు విద్యార్థుల నుంచి కట్టించుకునే ఫీజుల్లోనే ఉద్యోగుల జీతాలు చెల్లిస్తారని అంతా అనుకుంటారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాల ఫీజులచరిత్ర చూసినా అంతే. ఒక ఫీజుల దోపిడీ ఉన్నా అధ్యాపకులకు జీతాలు సరిగా ముట్టచెపుతున్న పాపాన ఏకాలేజీ లేదనేచెప్పాలి. అంతేసి మొత్తంలో ఫీజులు తీసుకున్నప్పుడు విద్యార్థులకు ఉద్యోగాలకు పనికొచ్చే మంచి చదువును చెప్పాలిన బాధ్యత కళాశాలల యాజమాన్యంపై ఉంది. ఫీజుల కౌంటర్‌లో విద్యార్థినీ విద్యార్థుల ముక్కుపిండి వసూలు చేయడమే తప్ప, వారికి సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కానీ, ఇంజినీర్లుగా తయారు చేయాలని కానీ వారికి ఏ కోశానా ఉండదు. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పోసప్పో చేసి ఫీజులు కడ్తుంటారు విద్యార్థులు. తీరా చదువుల విషయానికొస్తే పట్టించుకునే వారుండరు. అలా ఎవరైనా ఉంటే వారిని బోధనావృత్తిలో ఉండనివ్వరు. ఇలాంటి పరిస్థితుల మధ్య ఇంజినీరింగ్ కళాశాలల ఉద్యోగుల ఉసురు తీస్తున్నారు యాజమాన్య పెత్తందార్లు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 177 ఇంజనీరింగ్ కళాశాలలుండగా వాటిలో 155 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నాయి. ఇక్కడ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి సంఖ్య 50 వేలకి పైమాటే. పనిచేస్తున్న అధ్యాపకుల కష్టాలు వర్ణనాతీతం. 7వ వేతన సంఘ జీతాలు చెల్లించడం లేదు కానీ చెల్లిస్తున్నామంటూ తప్పుడు నివేదికలు తయారు చేసి గత పదిఏళ్ల నుంచి ఫీజులు పెంచుకుంటూవస్తున్నారు. దీనితో విద్యార్థులపై పెనుభారం పడుతుంది.ఇటు ఉద్యోగులకి జీతాలు రాక మానసికంగా ఆర్థికంగా బలహీనపడుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఆలోచించి అధ్యాపకులు జీతాలురాకున్నా పాఠాలు చెప్పడం ఆపడం లేదు.నేటి బాలలే రేపటిపౌరులు అన్న ఆలోచనతో విద్యార్థులకి నష్టం కలగకుండా విద్యా బోధన చేస్తూ వస్తున్నారు. కొన్ని కాలేజ్ లో 26 నెలలుగా జీతాలు చెల్లించడం లేదు కారణం ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కావడం లేదని సాకు చూపుతూ జీతాలు

అయినేని సంతోష్ కుమార్

చెల్లించడం లేదు.వాస్తవంగా విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వంచెల్లించే ఫీజు రీయింబర్స్మెంట్ రూ.35000 మాత్రమే మిగతా ఫీజు విద్యార్థినే చెల్లిస్తారు.అయినప్పటికీ ఉద్యోగుల జీతాలు చెల్లించడం లేదు అంతేకాకుండా చెల్లించే జీతాలు తాత్కాలిక జీతాలు మాత్రమే అవే చెల్లించకపోతే వారి జీవనం ఎలా గడుస్తుంది వారి నిత్యవసర వస్తువులు కొనుగోలు ఎలా ? ఇంటి అద్దెలు కట్టడం, వారి పిల్లల బడి ఫీజులు కట్టడం ఏ విధంగా సాధ్యమవుతుంది ?తెలంగాణ విద్యా హక్కు చట్టం 1982 చాప్టర్ 14 సెక్షన్ 84 ప్రకారం ప్రతినెల ఒక తేదీన జీతాలు చెల్లించాలని తెలియజేస్తుంది. ఒకవేళ చెల్లించినట్లయితే అట్టి వారిపైన క్రిమినల్ చర్యలు తీసుకొవలనీ, అంతే కాకుండా రూ.2000 అపరాధరుసుము చెల్లించాలని చట్టంలో తెలియజేస్తుంది. దీనిపై ప్రభుత్వాలు తగిన విచారణ చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.మరికొన్ని కళాశాలలో జేఎన్టీయూహెచ్ ఎఫ్ఎఫ్సిల పేరుతో కళాశాలల తనిఖీలు నిర్వహించింది. అట్టి కమిటీలకు తప్పుడు ధ్రువ పత్రాలు అనగా ఉద్యోగుల జీతాలకి సంబంధించి ఫామ్16, 26 ఏఎస్‌లు పారదర్శకంగా లేకపోవడం గమనార్హం. మరికొన్ని కళాశాలలో జేఎన్టీయూహెచ్ ఎఫ్ఎఫ్సిలు, ఏఐసిటిఈ ఆన్లైన్ తనిఖిలకోసం వేతన సంఘ జీతాలు ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, కాలేజీలో ఉండే ఏటీఎం మెషీన్‌నుంచి డ్రా చేసుకోవడం ఒకఎత్తు, లేదా సెల్ఫ్ చెక్‌లద్వారా ప్రత్యక్షంగా తీసుకుంటున్నట్టు చూపిస్తారు. కానీ అక్కడ ఉద్యోగి లేకుండానే సెల్ఫ్ చెక్ డ్రా కావడం ఆశ్చర్యమే మరి. ప్రతి సంవత్సరం 700 కోట్లనుంచి 1000కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయి. అయిన దీనిపైన ప్రభుత్వం స్పందించి వెంటనే విచారణ జరిపి తగినచర్యలు తీసుకోవాలని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి సదరుబోర్డుకి ఫీజు రీయింబర్స్మెంట్ మళ్లించి దానిద్వారా ప్రతినెలా ఉద్యోగులకు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీని ద్వారా విద్యార్థులకు సరైనటువంటి బోధన, విద్య అందుతుందని దానితో వారి భవిష్యత్తు ఎంతో బాగుంటుందని ఉద్యోగులు కోరుతున్నారు.మరొక విషయం ఏమిటంటే ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగం గానీ, ఉన్నత చదువులకు వెళ్లాలని ఉన్నప్పుడు ధ్రువపత్రాలను అడిగితే 23 నెలల జీతం కట్టించుకుంటున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. దీనితో వచ్చేజీతం చాలా తక్కువ అది ప్రతినెల ఉన్న నిత్యవసర ఖర్చులకే సరిపోతుంది అలాంటి సమయంలో మీరు అడిగినటువంటి డబ్బులను కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యూనివర్సిటీలకు ఫిర్యాదు చేసిన ఒక నోటీస్ ఇచ్చిచేతులు దులుపుకుంటున్నారు.కానీ ఉద్యోగులకుమాత్రం న్యాయం జరగడంలేదు.ఇప్పటికైనా యూనివర్సిటీలు ఉద్యోగుల ఫిర్యాదు పైన స్పందించి ఉద్యోగులకు మేలు జరిగే విధంగా తగిన విచారణ చేపట్టి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు. చాలా కాలేజీల్లో 5 సంవత్సరాలు ఆపై సం ఒకే విద్యాసంస్థలో పనిచేసినట్లయితే గ్రాట్యుటీ చెల్లించాలి. కానీ చాలా కాలేజీలో అది చెల్లించకపోవడం గమనహరం. కొన్ని కాలేజీలు మాకు వర్తించదని చెపుతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. గ్రాట్యుటీ యాక్ట్ 1972 ప్రకారంగా 50 లేదా 50కి పైగా మంది ఉద్యోగులు ఆయా సంస్థలో పనిచేసినట్లయితే వారికి గ్రాట్యుటీ యాక్ట్ ప్రకారంగా అట్టి సంస్థలు ప్రతి ఉద్యోగికి గ్రాట్యుటీ చెల్లించాలి. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వంస్పందించి ఉద్యోగులకు గ్రాట్యుటీ అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు. చాలా కాలేజీలో పరీక్షలకి సంబంధించిన ఇన్విజిలేషన్ డబ్బులు కూడా చెల్లించడం లేదని ఉద్యోగులువాపోతున్నారు. ఒక్కపరీక్షకి 3గంటల డ్యూటీ చేస్తే రూ.100రుసుం చెల్లిస్తారు.కానీ అది చెల్లించడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. దీనిపైన ఆయ యూనివర్సిటీలు స్పందించి వెంటనే ఉద్యోగులకి పరీక్షల నిర్వహణ రెమ్యూనరేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థులకి నాణ్యమైన విద్య అందాలంటే అధ్యాపకులు ఆర్థికంగా,మానసికంగాదృఢంగాఉండాలి.

# నౌపాడ ఉప్పు రైతుల కష్టాల సాగు!

ఉప్పుసాగు జరిగే భూములలో అక్రమ మట్టి తవ్వకాలను ఆపకపోతే తీవ్ర పర్యావరణ సమస్యత తలెత్తుతుంది. ఉప్పు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడడమే కాకుండా, లోటు ఏర్పడ్తుంది. రైతులకు జీనవోపాధి కరవవుతుంది. ప్రభుత్వం వీటిపై దృష్టిసారిస్తే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదు. ఉప్పు సాగుకు అలవాటుపడిన ప్రాంతం శ్రీకాకుళం జిల్లా, నౌపాడలో దశాబ్దాలుగా ఈ ప్రాంతం ఉప్పు ఉత్పత్తిలో ముందంజలో కొనసాగుతోంది. ఇక్కడి ఉప్పు భూములపై ఆధారపడి వందలాది చిన్న రైతులు, కార్మికులు జీవనాధారాన్ని పొందుతున్నారు. అయితే, 2018 నుంచి ఈ ప్రాంతంలో ఉప్పు పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దీనివల్ల వేలాది కుటుంబాల జీవితం ప్రశ్నార్థకంగా మారింది. 2018లో నౌపాడలోని సుమారు 2,650 ఎకరాల ఉప్పు భూముల లీజు గడువు ముగిసింది. కేంద్ర ప్రభుత్వం ఈ లీజులను పునరుద్ధరించక సాచితే ధోరణిని అవలంబించడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. దీని ఫలితంగా ఉప్పు రైతులు ఉత్పత్తి కొనసాగించలేక తీవ్రంగా నష్టపోయారు. గతంలో నౌపాడ ప్రాంతంలో ప్రతి సంవత్సరం సుమారు 50వేల మెట్రిక్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అయ్యేది. ఇప్పుడు అది 10,వేల నుండి 15,వేల టన్నులకే పరిమితమైంది. ఉప్పు ఉత్పత్తిలో వచ్చిన ఈ పెద్ద దెబ్బ కారణంగా సుమారు నాలుగు వేల కుటుంబాలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాయి. ఉప్పు భూములపై ఇప్పుడు మరో తీవ్రమైన సమస్య ఏర్పడింది. అక్రమ మట్టితవ్వకం, అధికార అనుమతులు లేకుండానే నౌపాడ ఉప్పు భూముల నుండి మట్టిని తవ్వి, వాణిజ్య ప్రయోజనాల కోసం తరలిస్తున్నారు. రోజూ వందల ట్రాక్టర్ల ద్వారా మట్టి తీసుకెళుతున్నారు. ఈ మట్టి ప్రధానంగా ప్రైవేటు లేఅవుట్లు,


అప్పన్న గొనప

గృహ నిర్మాణ ప్రాజెక్టుల కోసం ఉపయోగించబడుతోంది. దీని వల్ల ఉప్పు భూములు శాశ్వతంగా పాడవుతున్నాయి. భవిష్యత్‌లో ఈ భూముల్లో ఉప్పు సాగు చేయడం అసాధ్యమవుతోంది. ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు చేపట్టలేదు. పర్యావరణ పరిరక్షణ చట్టాలు, భూసంరక్షణ నిబంధనలు అన్నీ ఉల్లంఘించబడ్డా, స్థానికపాలకులు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అక్రమ



మట్టికోసకాన్ని ఆపే ప్రయత్నాలు కనీసం ప్రారంభించకపోవడం ప్రజలను తీవ్రనిరాశకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో నౌపాడ ప్రజలు ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచుతున్నారు. తక్షణమే లీజులు పునరుద్ధరించాలి. గతంలో ఉన్న లీజులను మరోసారి పొడిగింపు ద్వారా ఉప్పు ఉత్పత్తి తిరిగి పునరుద్ధరించవచ్చు. రైతులు, కార్మికులు మళ్లీ తమ పాత ఉపాధిని పొందగలుగుతారు. అక్రమ మట్టికోసకాన్ని తక్షణమే నిలిపివేయడం తప్పనిసరి. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించే ప్రక్రియపై వెంటనే చర్యలు తీసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేయాలి. మూడవది - జీవనాధారం కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగాలు, పింఛన్లు, స్వయం ఉపాధి పథకాలు ద్వారా వారికి జీవించడానికి సాధనాలు కల్పించాలి. ఈ సమస్య సామాన్యమైనది కాదని ప్రభుత్వ యంత్రాంగం గుర్తించడంఅవసరం. ఇది కేవలం ఒక ప్రాంతీయ సమస్య కాదు. ఇది వందలాది కుటుంబాల జీవన సమస్య. ప్రజాస్వామ్యంలో ప్రజల అవసరాలకు స్పందించడమే ప్రభుత్వ కర్తవ్యం. ఉప్పు భూములపై అక్రమ మట్టికోసకాన్ని అడ్డుకోకపోతే ఇది తీవ్ర పర్యావరణ సమస్యగా మారే ప్రమాదం ఉంది. భూమి నాణ్యత దెబ్బతినడంతోపాటు ఉప్పు ఉత్పత్తికి అవసరమైన మట్టిశాఖలు పూర్తిగా నాశనమవుతాయి. ఇది భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం. నౌపాడ ప్రజలు న్యాయపరమైన మార్గాల్లో ఇప్పటికే అనేక దఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. కానీ వాటికి ఇంకా సానుకూల ప్రతిస్పందన రాలేదు. వారి డిమాండ్లు సాధారణమైనవే. ఉపాధి కోసం, భూమి కోసం, జీవన గౌరవం కోసం ఈ డిమాండ్లు తీర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే, అది ప్రజల నమ్మకాన్ని పోగొట్టేలా మారుతుంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నౌపాడ ఉప్పు రైతుల సమస్యపై జాగ్రత్తగా స్పందించి, గట్టి చర్యలు తీసు కోవాలి. లీజు పునరుద్ధరణ, అక్రమ మట్టికోసకానికి ఆపేసే చర్యలు, ఆర్థిక ప్యాకేజీ లాంటి అంశాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలి. నౌపాడ ప్రజలు తమ హక్కుల కోసం న్యాయపరంగా, శాంతియుతంగా పోరాడుతున్నారు. ఇది కేవలం వారి జీవనాధారం కోసం కాదు, సమాజంలోని ప్రతి చిన్న రైతు, శ్రామికుడి న్యాయం కోసం చేసే పోరాటం. ఈ గొంతును వినిపించేందుకు మనందరం భాగస్వాములం కావాలి. ప్రభుత్వ యంత్రాంగం ఈ ప్రజల ఆశలకూ, సమస్యలకూ దోహదపడాలి. అప్పుడే ప్రజాస్వామ్యానికి పరిరక్షణ కలుగుతుంది.

# మ్యాడ్‌మ్యాన్ థియరీతో ట్రంప్ దూకుడు..



## అంతుచిక్కని అమెరికా అధ్యక్షుడి వైఖరిపై ప్రపంచదేశాల విమర్శలు!

**వాషింగ్టన్,జూలై 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండోసారి అధ్యక్ష పదవిలో అనుసరిస్తున్న అనూహ్య వైఖరి ఇప్పుడు ప్రపంచ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇరాన్‌పై దాడి చేస్తారా అని గత నెల అడిగినప్పుడు, "చేయొచ్చు, చేయకపోవచ్చు. నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. చర్చలకు రెండు వారాల సమయం ఇస్తున్నట్లు ప్రపంచాన్ని నమ్మించి, ఆ తర్వాత ఉన్నట్లుండి బాంబులతో విరుచుకుపడ్డారు. ఇదే ఆయన నూతన విదేశాంగ విధానం. రాజకీయ నిపుణులు దీనిని 'మ్యాడ్‌మ్యాన్ థియరీ'గా అభివర్ణిస్తున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు చెందిన ఒక ప్రొఫెసర్ ప్రకారం, "రిచర్డ్ నిక్సన్ తర్వాత అత్యంత కేంద్రీకృత విదేశాంగ విధానాన్ని ట్రంప్ రూపొందించారు. దీనివల్ల అన్ని నిర్ణయాలు ట్రంప్ వ్యక్తిగత అభిరుచులు, స్వభావంపైనే ఆధారపడి ఉంటాయి." తన అంతుచిక్కని తత్వాన్ని ట్రంప్ ఒక రాజకీయ ఆస్తిగా, వ్యూహాత్మక అస్త్రంగా మార్చుకున్నారు. తాను మానసికంగా ఎలాంటి చర్యకైనా సిద్ధమని శత్రువులను నమ్మించి, వారి నుంచి ప్రయోజనాలు పొందడమే ఈ సిద్ధాంతం యొక్క ముఖ్యఉద్దేశం. ట్రంప్ విధానం మిత్రదేశాలపై బాగానే పనిచేస్తోందనడానికి నాటో దేశాలే నిదర్శనం. నాటో చార్టర్‌లోని ఆర్టికల్ 5 ప్రకారం ఒక దేశంపై దాడి జరిగితే అన్ని సభ్యదేశాలు రక్షించాలి. ఈ నిబద్ధతపైనే ట్రంప్ మొదట సందేహాలు రేకెత్తించారు. కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా కలవాలని అవమానించారు. డెన్మార్క్ పరిధిలోని గ్రీన్‌లాండ్‌ను సైనిక బలంతో స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో భయపడిన నాటో సభ్య దేశాలన్నీ తమ రక్షణ వ్యయాన్ని జీడీపీలో 2.5 నుంచి ఏకంగా ఐదుశాతానికి కి పెంచాయి. దశాబ్దాలుగా ఏ అమెరికా అధ్యక్షుడు సాధించలేనిది ట్రంప్ సాధించారని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే లాంటి నేతలు ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తారు. అయితే, ఈ మ్యాడ్ మ్యాన్ థియరీ శత్రుదేశాలపై పనిచేస్తుందా అన్నదే అసలు ప్రశ్న. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ట్రంప్ బెదిరింపులకు గానీ, పొగడ్తలకు గానీ లొంగడం లేదు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేందుకు పుతిన్ సిద్ధంగా లేరని ట్రంప్ నిరాశ వ్యక్తం చేశారు. ఇక ఇరాన్ విషయంలో ట్రంప్ తీసుకున్న అనూహ్య నిర్ణయం మరింత ఎదురుదెబ్బ తీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా దాడితో ఇరాన్ మరింత పట్టుదలగా అణ్వాయుధాన్ని తయారుచేసుకునే అవకాశం ఉందని బ్రిటన్ మాజీ విదేశాంగ మంత్రి విలియం హేగ్ అభిప్రాయపడ్డారు. సద్దాం హుస్సేన్, గడాఫీలకు పట్టిన గతే తమకు పట్టకూడదంటే అణ్వాయుధం ఎకైక మార్గమని ఇరాన్ భావించవచ్చని పేర్కొంటున్నారు. ట్రంప్ అనూహ్య వైఖరి వల్ల మిత్రదేశాలు తాత్కాలికంగా లొంగినప్పటికీ, దీర్ఘకాలంలో అమెరికాపై నమ్మకాన్ని కోల్పోతున్నాయి. అమెరికాను నమ్మదగిన మధ్యవర్తిగా చూడలేని పరిస్థితి వస్తోందని, ఇది అమెరికా ఏకాకిగా మిగిలిపోయే ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఐరోపా దేశాలు రక్షణ పరంగా అమెరికాపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఎదగాలని పిలుపునిచ్చారు. మొత్తం మీద, ట్రంప్ అంతుచిక్కని అస్త్రం కొందరిపై పనిచేస్తున్నా, దీర్ఘకాలంలో అమెరికా విశ్వసనీయతను దెబ్బతీసి, ప్రపంచ రాజకీయ సమీకరణాలను శాశ్వతంగా మార్చేస్తుందన్నప్రచారం ప్రపంచదేశాల్లో పతాకస్థాయిలో కొనసాగుతోంది.



## ఎలాన్ మస్క్ ప్రకటించిన 'ది అమెరికా పార్టీ'

### దేశంలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం లేదు: మస్క్

**వాషింగ్టన్, జూలై 6:** ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. 'ది అమెరికా పార్టీ' స్థాపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికాలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం లేదని మస్క్ పేర్కొన్నారు. ప్రజలకు స్వేచ్ఛ ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' కు ఆమోదం తెలిపితే కొత్త పార్టీ ప్రకటిస్తానని ఇటీవల మస్క్ చెప్పిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనుకున్నట్లుగానే ఆయన కొత్త పార్టీ పేరును వెల్లడించారు. గతంలో ఎక్స్‌లోనూ మస్క్ పార్టీ పెట్టే అంశంపై ఓటింగ్ నిర్వహించారు. ఆసక్తికరంగా 80 శాతం మంది దీనికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ క్రమంలో అప్పట్లోనే 'ది అమెరికా పార్టీ' అంటూ ఆయన చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది.

మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కల నెలవేరింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రతిష్ఠాత్మకంగా భావించి తీసుకొచ్చిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' చట్టంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్‌ని ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజైన శుక్రవారం అధ్యక్షుడి సంతకంతో చట్టరూపు సంతరించుకుంది. ట్రిలియన్ల కొద్దీ డాలర్ల పన్ను మినహాయింపులతోపాటు 1.2 ట్రిలియన్ డాలర్ల విలువైన మెడిక్ ఎయిడ్, ఆహార కూపన్ల కోతకు ఉద్దేశించిన చట్టమిది. దీంతోపాటు వలస సేవల విభాగానికి ఇది మరిన్ని నిధులను అందించనుంది. కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం అంచనాల ప్రకారం పదేళ్లలో 3.3 ట్రిలియన్ల ద్రవ్య లోటును తీర్చనుంది. అదే సమయంలో 1.2 కోట్ల మంది ఆరోగ్య బీమాకు దూరమవుతారు.

## దలైలామా నిర్ణయానికే భారత్ మద్దతు

### ఆయన వారసుని ఎంపిక విషయంలో స్పష్టం చేసిన కేంద్రమంత్రి రిజిజు

**న్యూఢిల్లీ, జులై 6:** టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో చైనాకు భారత్ గట్టిగా బదులిచ్చింది. ఈ విషయంలో బయటి శక్తుల జోక్యాన్ని సహించేది లేదని, దలైలామా సంస్థ తీసుకునే నిర్ణయానికే తమ పూర్తి మద్దతు ఉంటుందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఆదివారం జరిగిన దలైలామా 90వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దలైలామా వారసుడిని బీజింగ్ ఆమోదించిన పద్ధతుల ప్రకారమే ఎంపిక చేయాలని, టిబెట్ సంబంధిత విషయాల్లో భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలని ఇటీవల చైనా విదేశాంగ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కిరణ్ రిజిజు చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చారు. "దలైలామా సంస్థ, దాని సంప్రదాయాలు, కట్టుబాట్ల ప్రకారం తీసుకునే ఏ నిర్ణయానికైనా మేం పూర్తిగా కట్టుబడి ఉంటాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది భక్తుల తరఫున నేను ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాను" అని ఆయన అన్నారు. ఈ వేడుకల్లో రిజిజు మాట్లాడుతూ, "దలైలామా కేవలం ఒక ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు. ప్రాచీన విజ్ఞానానికి, ఆధునిక ప్రపంచానికి మధ్య ఆయనొక సజీవ వారధి" అని కొనియాడారు. ఖిఆర్యభూమిఖిగా భావించే మన దేశంలో ఆయన ఉండటం మనందరికీ ఆశీర్వాదమని పేర్కొన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా దలైలామా మాట్లాడుతూ, "మేం మా దేశాన్ని కోల్పోయి, భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నప్పటికీ ఇక్కడి నుంచే ఎంతో మందికి సేవ చేయగలుగుతున్నాను. తన వారసుడిని, తాను స్థాపించిన భారత ఆధారిత 'గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్' ఎంపిక చేస్తుందని, ఇందులో బయటిశక్తుల జోక్యం ఉండదని దలైలామా ఇప్పటికే తేల్చిచెప్పడం గమనార్హం. షిమ్లా సమీపంలోని దోర్జిడాక్ మొనాస్టరీలో కూడా టిబెటన్ బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## బుద్ధుని బోధనలతోనే సన్మార్గం

### పుట్టిన రోజు సందేశంలో దలైలామా



**ధర్మశాల, జూలై 6:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తన 90వ పుట్టినరోజు సందర్భంగా హృదయపూర్వక సందేశాన్ని ఎక్స్‌లో పంచుకున్నారు. కరుణ, జాలి కలిగిన మంచి హృదయంతో జీవించడం వల్ల మనశ్శాంతిని పొందగలం అని పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల అనే కొండ పట్టణంలో నివసించే దలైలామా తాను ఒక సాధారణ బౌద్ధ సన్యాసినని, పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఇష్టం లేదని అన్నారు. నా 90వ పుట్టిన రోజు సందర్భంగా టిబెట్‌తో సహా అనేక ప్రదేశాలలో శ్రేయోభిలాషులు పుట్టిన రోజు వేడుకల కోసం గుమిగూడుతున్నారని నేను అర్థం చేసుకున్నాను. మీలో చాలామంది కరుణ, పరోపకారానికి ఉన్న ప్రాముఖ్యాన్ని హైలైట్ చేసే కార్యక్రమాలలో పాల్గొనడానికి ఈ సందర్భాన్ని ఉపయోగించుకుంటున్నారని నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. మీరు నా పుట్టినరోజును దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలను నిర్వహిస్తున్నందున నేను కొన్ని ఆలోచనలను పంచుకోవాల నుకుంటున్నాను. మానవ విలువలు, మత సామరస్యాన్ని ప్రోత్సహించడం, మనస్సు భావోద్వేగాల పనితీరును వివరించే పురాతన భారతీయ జ్ఞానం టిబెటన్ సంస్కృతి వారసత్వంపై దృష్టి పెట్టడం వంటి నా నిబద్ధతలపై నేను దృష్టి సారిస్తాను. మనశ్శాంతి కరుణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రపంచానికి దోహదపడే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. బుద్ధుని బోధనలు, శాంతిదేవ వంటి భారతీయ గురువుల ద్వారా తన దైనందిన జీవితంలో దృఢ సంకల్పం, ధైర్యాన్ని పెంపొందించుకుంటానని పేర్కొన్నారు. మరోవైపు, ప్రధాని మోదీ దలైలామా 90వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రెజిల్‌లోని రియో డిజనీరోలో ఉన్న ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దలైలామా మంచి ఆరోగ్యంతో పాటు దీర్ఘాయుష్షు కోసం ప్రార్థనలు చేస్తున్నాం. దలై లామాకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడంలో నేను 1.4 బిలియన్ల భారతీయులతో కలిసి ఉన్నానని ప్రధాని మోదీ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆయన ప్రేమ, కరుణ, సహనం, నైతిక క్రమశిక్షణకు శాశ్వత చిహ్నంమని, మతాలకు అతీతంగా ఇచ్చే సందేశాలు ప్రజలను ప్రభావితం చేస్తుందన్నారు. అదే సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా దలైలామాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలో ఆయన స్ఫూర్తిని నింపుతూనే ఉండాలని ఆయన అన్నారు.

## ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ముగిశాక తొలిసారి కనిపించిన ఖమేనీ




**టెహ్రాన్, జూలై 6:** ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య 12 రోజులపాటు భీకర యుద్ధం జరిగిన సంగతి తెలిసిందే. రెండు దేశాలు హోరాహోరీగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసుకున్నాయి. దాదాపు 12 రోజులపాటు ఈ యుద్ధం కొనసాగింది. 12 రోజుల తర్వాత రెండు దేశాలు కాల్పుల విరమణకు వచ్చాయి. 10 రోజుల కిందట ఈ ఒప్పందం జరిగింది. అయితే, యుద్ధం కారణంగా ఇరాన్ బాగా నష్టపోయింది. వందల మంది చనిపోయారు. యుద్ధంలో 900 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్‌తో యుద్ధం సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారు. ఎక్కడ కూడా కనిపించలేదు. చాలా రోజుల తర్వాత అయుతుల్లా బయట కనిపించారు. శనివారం మతపరమైన కార్యక్రమానికి హాజరయ్యారు. టెహ్రాన్‌లోని ఇమామ్ ఖమేనీ మసీదులో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ విడియో అయతుల్లా కుర్చీ దగ్గరకు రాగానే అక్కడి జనం పైకిలేచి ఆయనకు జేజేలు కొడుతూ ఉన్నారు. ఆయన కుర్చీలో కూర్చున్నా జేజేలు మాత్రం ఆగలేదు. 41 సెకన్ల ఈ విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, అయతుల్లా ఖమేనీ 1989లో ఇరాన్‌లో అధికారంలోకి వచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికాతో సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇరాన్ అణుబాంబు తయారీకి అమెరికా పూర్తి వ్యతిరేకంగా మారిపోయింది. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్ దేశానికి పూర్తి మద్దతు ప్రకటించింది. ఇరాన్ న్యూక్లియర్ సైట్లపై దాడులు సైతం చేసింది.

## దలైలామా వారసుని ఎంపికలో పూర్తిగా చైనాకే అధికారం

### భారత్‌లో చైనా రాయబారి జుఫెయిహాంగ్

**న్యూఢిల్లీ, జూలై 6:** టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా పునర్జన్మ అంశంపై మరోసారి వివాదం రాజుకుంది. ఈ విషయంలో దలైలామాకు ఎలాంటి అధికారం లేదని, ఆయనే తుది నిర్ణయం తీసుకోలేరని భారత చైనా రాయబారి జు ఫెయిహాంగ్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనా వైఖరిపై భారత ప్రభుత్వం, టిబెట్ ప్రవాస ప్రభుత్వం తీవ్రంగా స్పందించాయి. టిబెటన్ బౌద్ధమతంలో లివింగ్ బుద్ధా పునర్జన్మ అనేది 700 ఏళ్లకు పైగా కొనసాగుతున్న ఒక చారిత్రక, మతపరమైన సంప్రదాయమని ఫెయిహాంగ్ తన ఎక్స్ ఖాతాలో తెలిపారు. ఈ వ్యవస్థను కొనసాగించాలా వద్దా అని నిర్ణయించే అధికారం 14వ దలైలామాకు లేదని ఆయన స్పష్టం చేశారు. చైనా చట్టాలు, మతపరమైన ఆచారాల ప్రకారమే పునర్జన్మ ప్రక్రియ జరగాలని చైనా విదేశాంగ శాఖ కూడా గతంలోనే తేల్చిచెప్పింది. చైనా వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం ఆచితూచి స్పందించింది. మత విశ్వాసాలు,నమ్మకాలకు సంబంధించిన విషయాల్లో తాము జోక్యం చేసుకోబోమని విదేశాంగ శాఖఅధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. అయితే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాత్రందీనిపై భిన్నంగా స్పందించారు. దలైలామా పునర్జన్మ పూర్తిగా మతపరమైన అంశమని, దీనిపై నిర్ణయం తీసుకునే హక్కు కేవలం ఆయనకు,బౌద్ధ సంప్రదాయాలకు మాత్రమే ఉందని స్పష్టంచేశారు. ఈ విషయంలో ఇతరుల జోక్యానికి తావులేదని ఆయన అన్నారు. ఆదివారం 90వ పుట్టినరోజు తరుణంలో ఈ వివాదం మళ్లీతెరపైకి రావడం గమనార్హం. ఇదిలా ఉండగా, చైనా చర్యలను టిబెట్ ప్రవాస ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. టిబెటన్ల గుర్తింపును చెరిపేసేందుకు చైనా "సాంస్కృతిక మారణహోమానికి" పాల్పడుతోందని ప్రవాస ప్రభుత్వ అధ్యక్షుడు పెన్పా త్సెరింగ్ ఆరోపించారు.



## భారత్‌పై పాకిస్థాన్ పిఎం మళ్లీ విషపూరిత వ్యాఖ్యలు

**ఇస్లామాబాద్, జూలై 6:** పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మరోసారి భారతదేశంపై విషం కక్కారు. భారతదేశం రెచ్చగొట్టకుండానే శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోందని, ప్రాంతీయ శాంతికి భంగం కలిగించడానికి పహల్గామ్ ఉగ్రవాద దాడిని ఉపయోగిస్తోందని ఆయన ఆరోపించారు. మరోసారి కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. లష్కర్‌తో సంబంధం ఉన్న ఒక సంస్థ పహల్గామ్ దాడికి బాధ్యత వహించినప్పటికీ భారతదేశం సౌమ్యంగా ఉన్నట్లు నటిస్తూనే శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోందని ఆయన ఆరోపిం చారు. అలాగే గాజా, ఇరాన్‌లలో 'అమాయక ప్రజలను' లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆయన ఖండించారు. అజర్‌బైజాన్‌లో జరిగిన ఆర్థిక సహకార సంస్థ (ఇసిఒ) శిఖరాగ్ర సమావేశంలో చేసిన ప్రసంగంలో షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అజర్‌బైజాన్ పాకిస్థాన్‌కు మద్దతు ఇచ్చింది.

అంతర్జాతీ వేదికపై పాకిస్థాన్ మరోసారి ఇండియాపై తన అక్కసు వెళ్లగక్కింది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి దుర దృష్టకరమని షెహబాజ్ అభివర్ణించారు. కానీ అదే సమయంలో భారతదేశం ప్రాంతీయ శాంతిని అస్థిరపరుస్తోందని ఆరోపించారు. కానీ, పాకిస్థాన్ ఉగ్రవాదులను ఎలా పెంచి పోషిస్తుందో ఆ దేశ సైన్యం ఉగ్రమూకలను రక్షించేందుకు శక్తివంచన లేకుండా ఎలా కృషి చేస్తున్నదో ప్రపంచానికంతా తెలిసిందే. నలుగురిలో నవ్వులపాలవుతామని తెలిసినా సిగ్గువిడిచి అంతర్జాతీయ వేదికలపై భారతదేశంపై నీచమైన ఆరోపణలు చేస్తూనే ఉంది దాయాది దేశం. ఒక పక్కఉగ్రవాదాన్ని భారతదేశంపైకి ఎగదోస్తూనే శాంతిమంత్రం పఠిస్తున్న పాక్ ప్రధాని షెహబాజ్ ధైర్యం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది.

**ఇజ్రాయెల్ దాడులను ఖండించిన షరీఫ్**

ఇరాన్‌పై ఇటీవల జరిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడులను కూడా పాక్ ప్రధాని షరీఫ్ తీవ్రంగా ఖండించారు. దీనిని దురాక్రమణ చర్యగా అభివర్ణించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ఇజ్రాయెల్ జూన్‌లో ఆపరేషన్ రైజింగ్ లయన్‌ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఇరాన్ అణుకార్యక్రమం తమ ఉనికికి ముప్పుగా మారుతుందని ఇజ్రాయెల్ భావించడమే కారణం. 12 రోజుల యుద్ధం తర్వాత ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఈ పోరులో 600 మందికిపైగా ఇరానియన్లు మరణించారు.

## శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ లేకుంటే కాశ్మీర్ భారత్‌లో కలిసేదేకాదు..

### గుజరాత్‌లో హోంమంత్రి అమిత్‌షా



**ఆనంద్(గుజరాత్), జూలై 6:** భారతీయ జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ లేకపోతే కశ్మీర్ భారత్‌లో కలిసేది కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా గుజరాత్ లోని ఆనంద్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ దేశానికి ముఖ్యంగా జమ్ముకశ్మీర్ కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలను స్మరించుకున్నారు. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే భారత రాజ్యాంగంలోని 370ఆర్టికల్‌ను శ్యామా ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. కశ్మీర్‌కు స్వయంతప్రతిపత్తి కల్పించకుండా భారత్‌లోనే పూర్తిగా విలీనం చేయాలని వాదించారు. ఈ రోజు చాలా ముఖ్యమైన రోజు. 1901లో బెంగాల్‌లో పుట్టిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ గొప్ప జాతీయవాద నాయకుడు. దేశ ప్రజలు ఆయనను జమ్ముకశ్మీర్‌తో అనుసంధానిస్తున్నారు. అది నిజమే ఎందుకంటే ఆయన లేకపోతే కశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగా ఉండేది కాదు. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహీ ఛలెంగే అంటూ నినాదాలు చేస్తూ కశ్మీర్ కోసం తనప్రాణాలను అర్పించారు. అలాగే బెంగాల్ ఈ రోజున భారత్‌లో భాగంగా ఉండటానికీ కూడా శ్యామా ప్రసాద్ ముఖర్జీ, స్వామి ప్రణవానందకే పూర్తి క్రెడిట్ చెందుతుంది అని అమిత్‌షా అన్నారు. ఇక 10 మందితో ప్రారంభించిన భారతీయ జనసంఘ్ ఇప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని అమిత్‌షా పేర్కొన్నారు. మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మంత్రివర్గాన్ని బుజ్జగించే విధానానికి నిరసనగా ఆయన రాజీనామా చేశారు. ఆ తర్వాత భారతీయ జనసంఘ్‌ను స్థాపించారు. ఇది భారతీయ సంస్కృతి, ప్రయోజనాలకు కోసం అంకితమైన పార్టీగా దీనిని తీసుకొచ్చారు. నాడు 10మందితో ప్రారంభమై, నేడు 12 కోట్ల మంది సభ్యులతో అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది. ఈ సందర్భంగా ఆయనకు నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నాఖి అని అమిత్ షా చెప్పారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంలో పరిశ్రమల, సరఫరా శాఖ మంత్రిగా చేరారు. ఆ పదవిలో ఉండగా, చిత్తరంజన్ లోకోమోటివ్ ఫ్యాక్టరీ, సింద్రి ఫర్టిలైజర్ కార్పొరేషన్, హిందుస్థాన్ వంటి దిగ్గజ సంస్థలుప్రారంభించి, భారత పారిశ్రామిక వృద్ధికి బలమైన పునాది వేసే సంస్థలను స్థాపించారు. ఆ తర్వాత వచ్చిన విభేదాల కారణంగా తన పదవికి రాజీనామాచేసి 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించారు. లియాకత్ అలీఖాన్‌తో జరిగిన దిల్లీఒప్పందంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ముఖర్జీ 1950,ఏప్రిల్ 6న కేంద్ర మంత్రివర్గానికి రాజీనామాచేశారు.1953లో కశ్మీర్‌లో సందర్శించేందుకు వెళ్లినప్పుడు అక్కడు అరెస్ట్ చేశారు. జైలులో ఉండగానే జూన్ 23న మరణించారు.


## హత్యారోపణలపై ఆప్ ఎమ్మెల్యే అరెస్టు




**అహ్మదాబాద్, జులై 6:** గుజరాత్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేను పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యాయత్నం తో పాటు పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. ఆప్ ఎమ్మెల్యే అరెస్ట్ నేపథ్యంలో ఆయన నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నర్మదా జిల్లాలోని దేడియాపడా నియోజకవర్గం పరిధిలో శనివారం ఒక సమావేశం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే చైతర్ వాసవ ఇందులో పాల్గొన్నారు. సమన్వయ కమిటీలో సభ్యుడిగా తనను నియమించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సగ్బారా తాలూకా పంచాయతీ మహిళా అధ్యక్షురాలిని దుర్భాషలాడారు. కాగా, దేడియాపడ తాలూకా పంచాయతీ అధ్యక్షుడు సంజయ్ వాసవ జోక్యం చేసుకున్నాడు. దీంతో ఎమ్మెల్యే చైతర్ మొబైల్ ఫోన్ విసిరడంతో అతడి తలకు గాయమైంది. ఆ తర్వాత గ్లాస్‌తో దాడి చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే పగిలిన గాజు గ్లాస్ పెంకుతో తనను చంపుతానని ఎమ్మెల్యే చైతర్ వాసవ బెదరించినట్లు పంచాయతీ అధ్యక్షుడు సంజయ్ వాసవ ఆరోపించాడు. అక్కడి నుంచి తప్పించుకుని వచ్చినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కార్యాలయంలోని కుర్చీని కూడా ఆ ఎమ్మెల్యే ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. మరోవైపు హత్యాయత్నంతోపాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి వేళ ఎమ్మెల్యే చైతర్ వాసవను అరెస్ట్ చేశారు. దీంతో దేడియాపడాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యం లో జనం గుమిగూడటంపై ఆంక్షలు విధించారు.

## ఆస్తికోసం అత్తను చంపించిన కోడలు!



**లక్నో, జూలై 6:** ఒక మహిళ ఆస్తి కోసం తన అత్తను చంపింది. ఆమె నగలను చోరీ చేసింది. మహిళ సోదరి, ఆమె ప్రియుడు దీనికి సహకరించారు. ఈ హత్యపై దర్యాప్తు చేసిన పోలీసులు షాక్ అయ్యారు. అత్తను చంపిన కోడలికి ఆమె భర్త సోదరులతో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుసుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూన్ 24న కుంహారియా గ్రామానికి చెందిన 54 ఏళ్ల సుశీలా దేవి ఆమె ఇంట్లో అనుమానాస్పదంగా మరణించింది. రూ.8 లక్షల విలువైన ఆమె నగలు చోరీ అయ్యాయి. కాగా, కేసు దర్యాప్తు చేసిన పోలీసులు కోడలైన పూజ తన సోదరి కమల, ఆమె ప్రియుడు అనిల్ వర్మతో కలిసి అత్త సుశీలా దేవిని హత్య చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో పూజ, ఆమె సోదరిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న అనిల్ నగలు అమ్మేందుకు ప్రయత్నించగా ఎన్‌కౌంటర్ చేసి పట్టుకున్నారు. చోరీ చేసిన నగలు, తుపాకీ, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఉమ్మడి భూమిలోని తన వాటా అమ్మి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు వెళ్లాలని పూజ భావించిందని పోలీస్ అధికారి తెలిపారు. అత్త సుశీలా దేవి అభ్యంతరం చెప్పడంతో ఆమె అడ్డు తొలగించుకునేందుకు సోదరి, ఆమె ప్రియుడితో కలిసి హత్య చేసిందని చెప్పారు. కాగా, పూజ భర్త మరణించడంతో ఝాన్సీలో ఉన్న మరిది కళ్యాణ్ సింగ్‌తో సహజీవనం చేసిందని పోలీస్ అధికారి తెలిపారు. ఆరేళ్ల కిందట అతడు చనిపోగా మరో మరిది సంతోష్‌తో కూడా సంబంధాన్ని ఆమె కొనసాగించిందని చెప్పారు. అతడి ద్వారా ఆడ పిల్లను కన్నదని పోలీస్ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో తొమ్మిది నెలల కిందట సంతోష్ భార్య తన పుట్టింటికి వెళ్లిందని చెప్పారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.



## బ్యాంక్ ఆఫ్ లండన్ పక్కనే చైనా స్పై సెంటర్!

**లండన్, జూలై 6:** లండన్‌లో చైనా నిర్మంచతలపెట్టిన భారీ దౌత్యకార్యాలయం ఇప్పుడు యుకెకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ విషయాన్ని డెయిలీ మెయిల్ పత్రిక కథనంలో పేర్కొంది. టవర్ లండన్ సమీపంలోని రాయల్ మింట్ వద్ద ఇది ఉండటమే దీనికి కారణం. గతంలో యుకె నిఘా సంస్థ ఎంఐ 5, స్కాట్లాండ్ యార్డ్ హెచ్చరించడంతో చైనా కార్యాలయానికి అనుమతులు నిలిపివేశారు. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ పునరుద్ధరించారు. సున్నితమైన ఫైనాన్షియల్ సెంటర్ సమీపంలో చైనా దౌత్యకార్యాలయం నిర్మించడంపై బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కూడా ప్రధానమంత్రి కార్యాలయానికి అభ్యంతరాలను పంపింది. చైనా దౌత్యకార్యాలయ స్థలం అత్యంత సమీపంలోనే మూడు భారీ డేటా సెంటర్లు, స్టాక్ ఎక్స్ఛేంజి కూడా ఉన్నాయి. చైనా చేపట్టిన నిర్మాణంలో బేస్‌మెంట్ సూట్లు, సొరంగం ఉన్నట్లు కూడా గతేడాది వార్తలొచ్చాయి. గూఢచర్యం కోసం అవసరమైన నిర్మాణాలు చేస్తోందని డెయిలీ మెయిల్ వెల్లడించింది. ఈ భవనంలోని కల్చరల్ ఎక్స్ఛేంజి విభాగాన్ని మాత్రం యుకె అధికారుల తనిఖీ నుంచి మినహాయించాలని చైనా అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా గూఢచర్యం కోసం వాడే వాటిని కల్చరల్ ఇంట్రెస్ట్స్, ఎక్స్ఛేంజిగా పేర్కొంటారని అమెరికాకు చెందిన మాజీ సెక్యూరిటీ అధికారి వెల్లడించారు.

**ఏమిటీ మెగా ఎంబసీ..**

2018లో బ్రిటన్ రాయల్ మింట్‌కు చెందిన 5.4 ఎకరాల భూమిని చైనా కొనుగోలు చేసింది. 1809-1967 మధ్యలో బ్రిటన్ రాయల్ మింట్‌లో ఇది భాగమే. అంతకుముందు బ్లాక్ డెత్‌ప్లేగు సమాధులు ఇక్కడున్నాయి. రాయల్ నేవీ కూడా కొన్నాళ్లు ఈ స్థలాన్ని వినియోగించుకొంది. ఇది టవర్ ఆఫ్ లండన్‌కు అత్యంత సమీపంలోనే ఉంది. బ్రిటన్ రాజకుటుంబం ఈ ప్రదేశాన్ని రియల్ ఎస్టేట్ డెవలపర్లకు విక్రయించింది. దీంతో చైనా కొనుగోలు చేయడం తేలికైంది. దీనిని ఐరోపాలోనే అతిపెద్ద దౌత్య కార్యాలయంగా నిర్మించాలని బీజింగ్ నిర్ణయించింది. ఇందులో 225 ఇళ్లు, కల్చరల్ ఎక్స్ఛేంజి భవనం కూడా ఏర్పాటు చేసేలా ప్లాన్ చేసింది. వాషింగ్టన్ డిసిలోని దౌత్యకార్యాలయం కంటే ఇది రెండు రెట్లు పెద్దగా ఉంటుంది. కొన్ని నెలల క్రితం చైనా దౌత్యకార్యాలయం నిర్మాణంపై ఆందోళనలు కూడా జరిగాయి.

## హిమాచల్‌ను ముంచెత్తిన వరదలు, 75కి పెరిగిన మృతుల సంఖ్య

**సిమ్లా, జూలై 6:** హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి ప్రకోపానికి మండి జిల్లాలో మృతుల సంఖ్య 75కు చేరడం తీవ్ర విషాదాన్ని నింపింది. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వానల కారణంగా కొండచరియలు విరిగిపడుతుండగా, మెరుపు వరదలతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ విపత్తు కారణంగారాష్ట్రంలో 240కి పైగా రహదారులు పూర్తిగామూతపడ్డాయి. వాటిలో అత్యధికంగా 176రోడ్లు ఒక్క మండి జిల్లాలోనే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భారీ వర్షాలతో సహాయక చర్యలకుకూడా తీవ్ర ఆటంకం కలుగుతోందనిఅధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఒక్కరోజులోనే 115నుంచి 204 మిల్లీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదైంది.



పురస్కారంతో డా. బి.విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, కలెక్టర్ హరిచందన, భీంరెడ్డి తదితరులు

# డాక్టర్లు పేదలకు ఇతోధికంగా వైద్యసేవలందించాలి

## గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 6, ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్యకర జీవితానికి, అనారోగ్య సమస్యలకు ఎల్లవేళలా మేమున్నామంటూ ధైర్యానిస్తూ ప్రజా సేవయే పరమాత్మకమైన వైద్యవృత్తిలో ఉన్న డాక్టర్లు పేదల ప్రయోజనం కోసం స్వచ్ఛందంగా తమ నైపుణ్యాన్ని విస్తరించి ఇతోధికంగా నాణ్యమైన వైద్యాన్ని అందించి ప్రాణాలను కాపాడి ఆరోగ్యకర జీవితాన్ని సాగించడానికి తోడ్పడాలని గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ కోరారు. వైద్యరంగం వ్యాపారం కాకుండా వాణిజ్యం నుండి కరుణవైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మెడికల్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గవర్నరు రెడ్‌హిల్స్ సమీపంలో కొత్తగా రక్తనిధి కేంద్ర ఏర్పాటు, జనరిక్ మందుల దుకాణం, వృద్ధుల సంరక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఐఆర్‌సిఎస్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గవర్నరు విశిష్ట అతిథులు హైదరా బాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, జిల్లా ఐఆర్‌సిఎస్ అధ్యక్షుడు ఎం.భీమిరెడ్డి, గవర్నరు సంయుక్త కార్యదర్శి భవానీశంకర్, డిప్యూటీ కార్యదర్శి పల్లవి తదితరులతో కలిసి వందమందికిపైగా ప్రముఖ వైద్యులను మెడికల్ ఎక్సలెన్స్ అవార్డులతో ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీతలతో సిపిఆర్‌లో అవగాహన కల్పిస్తున్న ప్రఖ్యాత ఆర్థోపెడిక్ వైద్యుడు బి.విజయ భాస్కర్, డిఎంహెచ్‌ఓ వెంకటి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, భారతీయ వైద్యుల సంఘాధ్యక్షుడు ద్వారకానాథ్‌రెడ్డి తదితరులున్నారు.

# ఎవరి లబ్ధి కోసం లోకేష్‌తో కెటిఆర్ రహస్యమంతనాలు?

## పిసిసి మీడియా కమిటీ సామ రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించకుండా బనకచర్ల ఆపేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే ఆంధ్రప్రదేశ్ మంత్రి లోకేష్‌తో ఎవరి లబ్దికోసం కెటిఆర్ మంతనాలు చేస్తున్నాడని పిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి నిలదీశారు. గాంధీభవన్ టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ కెటిఆర్‌తో నారా లోకేష్ మంతనాలు ఒక్కసారి కాదు పలు మార్లు రహస్యంగా కలిసి చేశారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కి కెటిఆర్ ప్రతిసవాళ్లు విసురుతున్నారని సోమవారం అమరవీరుల స్థూపం వద్దకు రా చర్చ చేద్దాం అని రామ్మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. రైతుల సంక్షే మం మీద మాట్లాడేందుకు మీకు బిఆర్‌ఎస్ నాయకులకు సిగ్గు ఉండాలి. పదేళ్లలో రైతులు చనిపోతే కనీసం పట్టించుకోలేదని ఆయన ఆవేదన చెందారు. నీ సవాళ్లకు జవాబు చెప్పడానికి సామ రామ్మోహన్ రెడ్డి సరిపో తారని సిఎంతో పోల్చుకోకు కెటిఆర్ అని ఆయన అన్నారు. మీ హయంలో రేవంత్‌రెడ్డి అంటే ఆయన ఎవరు అన్నావని ఇప్పుడు ఆయన పేరు పక్కన నీ పేరు వస్తే చాలు అని తహతహలాడుతున్నావని ఆయన ఎద్దేవా చేశారు.

# ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్ దరఖాస్తు గడువు నేడు పూర్తి

## 96,802 మంది దరఖాస్తు.. మొదలైన వెబ్‌ఆప్షన్లు

## 70,561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్..

## 13న మాక్ సీట్ కేటాయింపు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా స్లాట్‌బుక్ చేసుకునే గడువు నేటి(సోమవారం)తో ముగియనుంది. స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కొన సాగిస్తుండగా.. ఆదివారం రాత్రి నుంచి వెబ్ ఆప్షన్లను ప్రారంభమయ్యాయి. జూన్ 28 నుంచే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 96,802 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 1 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు 70, 561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. నేటి(జులై 7)తో విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకొని స్లాట్‌బుక్ చేసుకోవడానికి గడువు ముగియనుండగా.. రేపటి(జులై8) వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగనుంది. ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 10 వరకు కొనసాగనుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటిసారిగా మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 13న మాక్ సీట్ అలాట్‌మెంట్ చేయనున్నారు. అందులో మార్పులు చేసుకోవడానికి ఈ నెల 14, 15 తేదిల్లో అవకాశం కల్పించారు. అనంతరం ఈ నెల 18లోపు మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఈనెల 25న వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలి. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. 26, 27 తేదిల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. 30లోపు రెండోవిడత సీట్ల కేటాయింపు చేస్తారు. ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలి.

# ఆదర్శప్రాయుడు ప్రణయ్‌భాస్కర్

## ప్రభుత్వం ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలి

## ప్రణయ్ ఆశయాలను నెరవేరుస్తానన్న అభినవ్

## ఓరుగల్లులో ఘనంగా ఆయన 28వ వర్ధంతి, 68వ జయంతి వేడుకలు



**హన్మకొండ బ్యూరో, జూలై 6, ప్రభాతవార్త:** మధ్యతరగతి కుటుంబ నేపథ్యం, బి సి సామాజిక వర్గం, బహుజనుల కోసం ఎదో చేయాలనే తాపత్రయం, ఆరాటం, అతి పిన్నా వయస్సులో మంత్రి వరించిన సాదా సిదా నాయకుడు దాస్యం ప్రణయ్ భాస్కర్.నేడు అయన 28వ వర్ధంతి, 68 జయంతి వేడుకలు ఓరుగల్లులో ఘనంగా జరిగాయి. దాస్యం ప్రణయ్ భాస్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలి నగర ప్రజల చిరావాంఛ కోరిక.మాజీ మంత్రివర్యులు, ఓరుగల్లు ప్రజలకు అత్యంత సన్నిహితుడు స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ జయంతి వర్ధంతి వేడుకలను దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన తనయుడు కార్పొరేటర్ డా. దాస్యం అభినవ్ భాస్కర్ తన తల్లి దాస్యం సబితా భాస్కర్, సోదరి బావ అపూర్వ రంజిత్ లతో కలిసి ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.. తొలుత వడ్డేపల్లిలోని వారి స్వగృహంలో పూజా కార్యక్రమాల అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తర్వాత వడ్డేపల్లి గ్రామ ప్రణయన్న అప్తులు, అభిమానులతో కలిసి సుబేదారిలోని ప్రణయ్ మార్గ్ వద్ద ప్రణయ్ భాస్కర్ పటానికి పుష్పాంజలి ఘటించి నినాదాల నడుమ నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా అక్కడ ఆయన మీడియాతో మాట్లా డుతూ.. ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని దేశ ప్రధాని కొడుకుతో ఢీకొని గెలిచి సత్తా చాటిన ప్రణయ్ భాస్కర్ రాజకీయాల్లో ఎందరికో ఆదర్శప్రాయుడు అని అన్నాడు.అతి చిన్న వయసులోనే మంత్రి పదవిని చేపట్టి ప్రజలకు అత్యంత చేరువయ్యి ఆయన చేపట్టిన మంత్రి పదవికే వన్నె తెచ్చిన మహానేత ప్రణయ్ భాస్కర్ అని అన్నాడు. ఆయన ప్రాతి నిధ్యం వహించిన హనుమకొండ నియోజకవర్గం పరిధి ఎంత విశాలమైనదో మనందరికీ తెలిసిందే. రవాణా వ్యవస్థ, కమ్యూనికేషన్ టెక్నాలజీ లేని ఆ సమయంలోనే ఆయన ప్రతి గడపను తాకుతూ అన్నా అంటే నేనున్నా భరోసా నిచ్చిన గొప్ప నాయకుడి జయంతి వర్ధంతిని ప్రతి ఏటా ఇంత ఘనంగా నిర్వహించుకోవడం గర్వదాయకంగా ఉంది అని అన్నాడు.ఆదివారం రోజు ప్రణయ్ మిత్ర మండలి, ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహృదయ అనాథ వృద్ధాశ్రమం, కాజీపేట, డబ్బాల్, కుమార్ పల్లి మార్కెట్, ఎంజీఎం సర్కిల్, చామన్ ప్రాంతాల్లో అన్నదాన, రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం చాలా గర్వాంగా ఉందని అన్నారు.ఆయన ఏకైక రాజకీయ వారసుడిగా ఆయన ఆశయాల సారధిగా ఆయన చేయాలనుకున్న, మధ్యలో ఆగిన అంశాలను పూర్తి చేస్తానని అభినవ్ భాస్కర్ వ్యాఖ్యానించడం అందరిని ఆకర్శించింది.అంతేకాక మలిదశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రధాత ప్రణయ్ భాస్కర్ అంటూ గత ముఖ్యమంత్రి కేసిఆర్, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు ఆయన సేవలను కొనియాడిన సందర్భాలను అయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.ఆయన స్ఫూర్తితోనే ఆయన రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తానని అభినవ్ అన్నారు..ఆయనకు ప్రభుత్వ పరంగా రావాల్సిన, దక్కాల్సిన గౌరవం వాస్తవికంగా జరుగలేదు. రాబోయే రోజుల్లో తప్పకుండా దానిని భర్తీ చేయడానికి చేయాల్సిన కార్యక్రమాలను ప్రకటిస్తాము అని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రణయన్న అప్తులు, స్నేహితులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త జిల్లాల కార్యాలయాలకు అదనపు పోస్టులు సృష్టించాలి

## ముఖ్యమంత్రికి లేఖ రాసిన ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త :** కొత్త జిల్లాల పరిధిలో కావాల్సిన అదనపు పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలనీ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖరాశారు. '2017లో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 23 జిల్లాలోని వాటిలో 40 శాఖల జిల్లా ఆఫీసులు, తాలూకా ఆఫీసులు ఏర్పడ్డాయి. అలాగే 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజినల్ ఆఫీసులు, 76 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పోరేషన్లు, 25 డిఎస్‌పీ ఆఫీసులు, 31 పోలీస్ సర్కిల్స్, 7 పోలీస్ కమిషనరేట్లు, 4,383 గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పాటుచేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన వీటికి వెంటనే పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఇందులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా లెక్కించాలి. వాటిలో గ్రూప్1 50 శాతం, గ్రూప్2 లో 30 నుంచి 40 శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా కింద ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కొందరు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా క్రింద భర్తీ చేయవలిసిన గ్రూప్1,2,3,4 సర్వీస్ ఉద్యోగాలను సరిగ్గా పూర్తి స్థాయిలో లెక్కించి గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంపలేదని లేఖలో పేర్కొన్నారు. అన్నిరకాల 67 కేటగిరీల పోస్టులకు ఒకేసారి సెలెక్ట్ అయితే ఆ అభ్యర్థి ఒకే పోస్టుల ఎంపిక చేసుకుంటారు. మిగతా 56 రకాల పోస్టులు మిగిలిపోతాయి. ఇప్పుడున్న పద్దతి ప్రకారం ఇతర అభ్యర్థులకు రాకుండా పోతాయి.ఆప్షన్ పద్ధతి,వెయిటింగ్ లిస్టు కాల పరిమితి ప్రవేశపెట్టి పోస్టుల భర్తీ చేస్తే అందరికీ అవకాశం వస్తుందని' ఆయన లేఖలో పేర్కొన్నారు. అందుకే ఆప్షన్ పద్దతి పెట్టడం, వెయిటింగ్ లిస్ట్ పెట్టడం, అన్ని ఫలితాలు ఒకేసారి ప్రకటించడం లాంటి చర్యలు తీసుకోవాలని కృష్ణయ్య ప్రభుత్వానికి సూచించారు.



# కాశ్మీర్ సమస్యపై దీటుగా పోరాడిన గొప్ప నాయకుడు శ్యాంప్రసాద్‌ముఖర్జీ

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

## ఘనంగా నివాళులు అర్పించిన నేతలు

## కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** జన సంఘ్ వ్యవస్థాపకుడిగా, సైద్ధాంతికంగా దిశను చూపిన మహానేత శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్య క్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహార్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు, గొట్టాల ఉమారాణి, కొల్లి మాధవి, రాష్ట్ర కోశాధికారిబండారి శాంతి కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బిజెపి నాయకులకు, కార్యకర్తలందరికీ గొప్ప స్ఫూర్తి ప్రధాత అన్నారు. చిన్న వయస్సులోనే అనేక పోరాటాలు చేసి, జన సంఘ్‌ను స్థాపించి, కాశ్మీర్ సమస్యపై ధీటుగా పోరాడిన గొప్ప నాయకుడని అన్నారు. దేశంలో ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదని పోరాడిన నేతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ మరణం అనుమానాస్పద పరిణామాల్లో జరిగిందని అన్నారు. వారి జీవితం త్యాగానికి ప్రతీకగా, ధైర్యానికి ప్రతిరూపంగా నిలిచిందని, ముఖర్జీ ఆశయా లకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆర్టికల్ 370ని రద్దు చేసి, ముఖర్జీకి నివాళి అర్పించారని అన్నారు. ఒకే దేశం - ఒకే చట్టం - ఒకే రేషన్ - ఒకే ఎన్నికలు అనే భావనను ముందు ఉంచి, దేశ సమగ్రత కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలంటూ పిలుపునిచ్చారు. మనమంతా శ్యాంప్రసాద్‌ముఖర్జీ బాటలో ముందుకెళ్తూ, దేశ ఐక్యత, పార్టీ బలం కోసం కృషి చేయాలన్నారు.

# విజయదశమికి చీరెల పంపిణీ

## సన్నాహాలు చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని 65 లక్షల మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రెండు చొప్పున చీరలు పంపిణీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది ఇప్పటికే సిరిసిల్లలో పవర్ లూం మీద చీరలు తయారు చేయిస్తున్నట్లు తెలిసింది. 65 లక్షల మందికి రెండు చొప్పున 1.30 కోట్ల చీరలు అవసరం అవుతాయి.ఈ మేరకు 4 కోట్ల మీటర్ల చీరలు అవసరం పడతాయని ఆఫీసర్లు అంచనా వేశారు.ఇందులో కోటి మీటర్ల చీరలు తయారై ప్రాసెసింగుకు సిద్ధంగా ఉండగా మిగిలిన వాటి తయారీ కొనసాగుతున్నది. సిరిసిల్లలో రోజుకు సుమారు 5 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు దీనికి సంబంధించిన వర్క్ చేస్తున్నట్లు తెలిసింది.ప్రభుత్వం పంపి ణీ చేయనున్న చీరలు సెప్టెంబర్ చివరి కల్లా సిద్దం చేయాలనే లక్ష్యంగాపెట్టుకున్నది. అప్పటి కల్లా తయారీ ప్రక్రియ పూర్తవుతుందని ఆఫీసర్లు చెబుతున్నారు.చీరల తయారీ కోసం బీసీ సంక్షేమ శాఖ ఇప్పటికే రూ.318 కోట్లు విడుదల చేసింది.చీరల డిజైన్‌లను ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి ఖరారు చేసినట్లు తెలిసింది.ఈ సారి దసరా, లేదా ప్రభుత్వం నిర్ణయించే మరో తేదీలో చీరలను పంపిణీ చేయనున్నారు.ఈ చీరలను ప్రభుత్వం సిరిసిల్ల జిల్లాలో తయారు చేయిస్తోంది.ప్రభుత్వ నిర్ణయంతో ఆ జిల్లాలో సాంచాల నవ్వడి మొదలైంది.నెల రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి.ఒక్కో కార్మికుడు వారానికి రూ.4 వేలనుంచి రూ.5 వేల వరకూ సంపాదిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.దీని ద్వారా తమకు ఉపాధి సమస్య తీరిందని కార్మికులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వం ఒక్కో మహిళకు ఒక చీరె ఇవ్వగా,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రెండు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

# కవిత రైల్‌రోకో ఎందుకు చేస్తుందో అర్థం కావడంలేదు?: మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** తెలంగాణ జాగృతి అధినేత, ఎమ్మెల్సీ కవిత కల్వకుంట్ల ఎందుకు రైల్‌రోకో చేస్తుందో అర్థం కావడం లేదని మాజీ ఎంపి వి.హనుమంతరావు సందేహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో విలేఖ రులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు తొలి ఏకాదశి, పీర్ల పండగ శుభా కాంక్షలు తెలిపారు. 11 యేళ్ల మోడీ పాలనలో బిసిలకు ఏం చేయలేదని అన్నారు. మూడుసార్లు మోడీని కలసి బిసిలకు సపరేట్ మినిస్ట్రీ ఏర్పాటు చేయాలని కోరామని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేతలతో ఒబిసి లను పైకి తీసుకు రావడానికి కర్ణాటకలో ఈ నెల 15న సమావేశం నిర్వహిస్తుంది. కర్ణాటక సిఎం సిద్ధరామయ్య నాకు ఆహ్వానం పంపారని చెప్పారు. మేము 42 శాతం రిజర్వేషన్ అమలుచేయకపోతే రైల్‌రోకో చేయండని కవితకు విన్న వించారు. సామాజిక న్యాయ సమరభేరి సభ గ్రాండ్ సక్సస్ అయ్యింది. కార్యకర్తలపై కేసులు ఎత్తివేయాలని ఖర్గే సూచించారు. యేళ్ల తరబడి కాం గ్రెస్ కోసం కష్టపడిన వాళ్లకు పదవి ఇవ్వాలని పిసిసి విస్తృతస్థాయి సమావేశంలో చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

# 'కోర్టు తీర్పు ప్రకారం ఆర్యవైశ్య మహాసభకు ఎన్నికలు జరపాలి'

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 6, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలపై కోర్టు తీర్పుతో ప్రజాస్వామ్యం గెలిచిందని మహాసభ నాయకులు చెప్పారు. పదేళ్లపాటు ఎన్నికలు నిర్వహించకుండా అమరవాది లక్ష్మీనారాయణ మహాసభను అక్రమించుకుని పెత్తనం చెలాయించారని, తన తొత్తులనే ఎన్నికల అధికారిగా నియమించి అక్రమాలకు తెరలేపారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీతోనే ఎన్నికలు జరపాలని కోర్టు తీర్పు ఇచ్చిందని, త్వరలో బైలాస్ ప్రకారం ఎన్నికలు జరపాలని వారు కోరారు. ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభ నాయకులు మిడిదోడ్డి శ్యాంసుందర్, మహాసభ ప్రక్షాళన కన్వీనర్ మొగుళ్లపల్లి ఉపేందర్, యాదా నాగేశ్వర్‌రావు, బచ్చు రామకృష్ణ, కోర్టులో విజయం సాధించిన వైశ్య నాయకులు అగీర వెంకటేశం, ఎల్.వి.కుమార్, పుల్లూరి సత్యనారాయణ, పిసిసి మెంబరు కొండ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికైనా అమరవాది బుద్ధి తెచ్చుకుని ప్రజాస్వామ్యబద్దంగా ఎన్నికలకు సహకరించాలన్నారు. అర్థిక వ్యవహారాలపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

# రామచందర్‌రావుకు, సిఎం రేవంత్‌కు పోలిక లేదు

ఆర్థికంగా దివాళా తీసిన బిఆర్‌ఎస్ నేతలను అరబ్ దేశంలోనైతే రాళ్లతో కొట్టేవారు

కవిత ముక్కు నేలకు రాసి రైల్‌రోకో చేయాలి

మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** బిజెపి స్టేట్ ప్రెసిడెంట్ రామచందర్‌రావుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏం పోలిక? నువ్వు రాజీనామా చెయ్యి నేను చేస్తా ఇద్దరం బిసిలకు పదవులు ఇద్దాం అంటూ మా ముఖ్యమంత్రి చేసే సవాల్ ఆయన స్పందించడం కూడ లేదని మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం ఉందని అన్నారు. మొన్నటి ప్రెసిడెంట్ కిషన్‌రెడ్డి అగ్రవర్ణ కులాలకు చెందిన వ్యక్తి మీరు అగ్రవర్ణ సామాజికవర్గం అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి కూడా అగ్రవర్ణమే బిజెపి కేవలం అగ్రవర్ణ కులాల పార్టీ మాత్రమే అని అన్నారు. బిసిలకు రిజర్వేషన్ పెంచడానికి రాజ్యాంగం సవరణ చేస్తే రిజర్వేషన్ అమలు అవుతుందని ఆయన అన్నారు. కవిత ముక్కు నేలకు రాసి బిసిలకు క్షమాపణలు చెప్పి రైల్ రోకో చేయాలని డిమాండ్ చేశారు. కవిత ఎంపిగా ఉన్నప్పుడే 34 శాతం నుంచి 23శాతానికి బిసి రిజర్వేషన్ తగ్గించినప్పుడు కవిత చిత్తశుద్ధి ఎటుపోయిందని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిన కెసిఆర్ కుటుంబంను అరబ్ దేశాల్లో స్టేడియంలో రాళ్లతో కొట్టి చంపు తారని ఆయన గుర్తు చేశారు. మీకు అలాంటి శిక్ష వేసిన తప్పులేదని కెటిఆర్‌ను ఆయన హెచ్చరించారు.

కేటీఆర్.. మీ ఇంట్లోనే సక్కగా లేదు పదేళ్లలో ఎందుకు ఉద్యోగాల భర్తీ చేయలేదు అని అన్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్‌చేసి కెసిఆర్ కుటుంబం డబ్బులు వసూలు చేసుకు న్నారని ఆరోపించారు. ఇప్పుడు ఆంధ్రోళ్లను తిడు తున్నారు. నీళ్ల తీసుకుపోమ్మంది మీరు కదా. దొంగనే దొంగదొంగ అన్నట్లుందని ఆయన అన్నారు. ప్రజలను నిండా మోసం చేసిన ఘరానా మోసాలు మోసగాళ్లు మీరని దుయ్యబట్టారు. నిరుద్యోగభృతి ఏం అయ్యింది. మీకు సిఎం రేవంత్‌రెడ్డి అవసరమే లేదు, నేను చాలు అని ఆయన అన్నారు. నేను ప్రెస్‌క్లబ్‌కు వస్తా అన్నింటి మీద చర్చ పెడదామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుందో లేదో అని ప్రవళిక ఉరివేసుకుంటే.. నిందలు వేశావని ఆవేదన చెందారు. ప్రభుత్వం జీవో విడుదల చేస్తే.. కోర్టు కొట్టివేస్తుంది. తమిళనాడు తరహాలో అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. బిసిలకు బిజెపి న్యాయం చేస్తుందా అన్యాయం చేస్తుందా తేల్చుకోండి అని సూచించారు.

# ప్రముఖ అస్సామీ కవి నీలిమ్‌కుమార్‌కు 29న సినారె విశ్వంభర జాతీయ పురస్కారం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూలై 6 ప్రభాతవార్త :** జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి స్మృత్యర్థం ప్రతీయేటా శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ప్రదానంచేసే ప్రతిష్టాత్మక విశ్వంభర జాతీయ సాహిత్య పురస్కారానికి 2025 సంవత్సరానికి ప్రముఖ అస్సామీ కవి నీలిమ్‌కుమార్‌ను ఎంపిక చేసి నట్లు ట్రస్టు అధ్యక్షురాలు సి.గంగ, ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య ఆదివారం తెలిపారు. రవీంద్రభారతిలో ఈ నెల 29న జరిగే సి.నారాయణరెడ్డి 94వ జయంత్యు త్సవంలో ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా నీలిమ్ కుమార్‌ను ఘనంగా సత్కరించి డా. సినారె విశ్వంభర జాతీయ పురస్కారం, పురస్కారంతోపాటు 5లక్షల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు. ఇప్పటి వరకు 24 కవితా సంపుటాలు వెలువరించిన నీలిమ్‌కుమార్ కుసుమాగ్రజ్ జాతీయ పురస్కారం, ఉదయభారతి జాతీయ పురస్కారం వంటి అనేక గౌరవాలు అందుకున్నారని, ఆయన కవితలు ఆంగ్లం, స్పానిష్, జర్మన్, ఫ్రెంచ్, హిందీ, నేపాలీ, మరాఠీ, పంజాబీ, బెంగాలీ వంటి అనేక భాషల్లోకి అనువామయ్యాయని వివరించారు. పలు విశ్వవిద్యాలయాల్లో ఆయన రాసిన కవితలు పాఠ్యాంశాలుగా ఉన్నాయని కూడా ట్రస్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెల్లడించారు.



అస్సామీ కవి నీలిమ్‌కుమార్

# ఉద్యోగులకు పిఆర్‌సిని అమలుచేయాలి

## పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి

## టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగులకి పిఆర్‌సిని అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్రన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దీంతోపాటు ఉద్యోగులతోపాటు పెన్షనర్ల బకాయిలను విడుదల చేయాలని ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో తీర్మానం చేసినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. రాష్ట్రంలో పిఆర్‌సి అమలు గడువు దాటి 2 సంవత్సరాలు గడిచినందున వెంటనే పిఆర్‌సి నివేదికను తెప్పించుకుని జులై 1, 2023 నుండి అమలు చేయాలని, 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో చావ రవి అధ్యక్షతన రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం జరిగింది. రవి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కానీ ఈ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరి స్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు.నిర్ణయించిన ప్రకారం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురు కులాల పనివేళలు శాస్త్రీయంగా సవరిం చాలని, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యా యులకు 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని, కెజిబివి, యుఆర్‌ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, డిఈఓ, డిప్యూటీ ఈఓ,ఎంఈఓ, డైట్ లెక్చరర్ ఖాళీలను భర్తీ చేయాలని, పాఠశాలల పర్యవేక్షణ సంబంధిత అధికారుల ద్వారానే జరపాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ ఈ నెల 9న కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఇంటి ముందు, చుట్టుపక్కల నీరు నిల్వ ఉంచుకోవద్దు

## సీజనల్ వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలి

## డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాబోయే వారం రోజులపాటు తేలికపాటి వర్షాలు పడనున్నాయని.. ముఖ్యంగా రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఇంటి ముందు, చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ నీరు నిల్వకుండా చూసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ ప్రజలకు సూచించారు. వర్షాలు పడే సమయంలో తక్కువ ఉష్ణోగ్రత, అధిక తేమకు దారితీయవచ్చని.. దాంతో సీజనల్ వ్యాధులకు దారితీస్తుందన్నారు. ప్రధానంగా నీరు, గాలి ద్వారా సంక్రమించే వ్యాధులకు దారితీస్తుంది.. వాటి నుండి రక్షణ కోసం, ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండటానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా రాకుండా ఉండటానికి దోమలను నివారించే చర్యలను తీసుకోవాలని రవీందర్ నాయక్ ప్రజలకు సూచించారు. ప్రధానంగా దోమతెరలను ఉపయోగించాలన్నారు. నీరు నిలిచిపోకుండా గృహ కాలువలను నిర్వహించాలని.. గృహ సెప్టిక్ ట్యాంకులను మెష్‌తో కప్పాలి. ఇంటి చుట్టూ నిలిచి ఉన్న నీటిని తొలగించడానికి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. నీటి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్లను నివారించడానికి తీవ్రమైన గ్యాస్ట్రోఎంటెరిటిస్, కామెర్లు, టైఫాయిడ్ రాకుండా ఉండటానికి వేడిచేసిన నీటిని త్రాగాలని సూచించారు. తరచుగా హ్యాండ్ శానిటైజర్‌లను వాడాలని, ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ఉండటానికి తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు చేతి రుమాలు వాడాలని సూచించారు. ఎవరికైనా జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి సంబంధిత ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ సూచించారు.

## బాబూజగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 6:** మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్ర పటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పిం చారు. దేశంలో దళితుల అభ్యున్నతి, వారి హక్కుల కోసం బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. కేంద్రమంత్రిగా, పార్ల మెంటేరియన్‌గా దేశానికి ఎనలేని సేవలు చేశారని సీఎం అన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఎంఎల్‌ఏ డాక్టర్ సంజయ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నేత రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.



## అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు బాబూజగ్జీవన్‌రామ్

### వైద్యమంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** దేశంలోని అణగారినవర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా మంత్రి ఘనంగా నివాళులర్పించారు. అణ గారిన వర్గాల అభ్యుదయానికి అలుపెరుగని కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. దేశంలో సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాంతం అలుపెరుగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక, విప్లవయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కీర్తించారు. జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు.

## రెండు కేసుల్లో గంజాయి పట్టివేత

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ వెంకటగిరి కాలనీలో ఎస్‌టిఎఫ్ బి టీం ఎస్సై బాలరాజు సిబ్బంది కలిసి 2.109 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ప్రకాశం జిల్లాకి చెందిన శివసాయి అరకు నుంచి గంజాయి తీసుకొని వచ్చి ప్రవీణ్ గణేష్ కళ్యాణం తో అమ్మకాలు జరిపిస్తున్నారు. బంజర అమ్మకాలు జరుపుతున్న వీరిని పట్టుకొని మీరు వద్ద ఉన్న బైకు నాలుగు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని ఎస్సై తెలిపారు. నిందితులను గంజాయిని జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. కొత్త మందుల కౌశిక్ చంద్రశేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా ఎస్టిఎఫ్ సిటీ వెంకటేశ్వర్లు సిబ్బంది పట్టుకున్నారు. జడ్చర్ల సమీపంలో గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 1.3 కేజీల గంజాయిని స్వాధీనం పరుచుకున్నారు. ఇద్దరినీ నిందితులను గంజాయిని స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.




## చికిత్స కోసమని వచ్చి క్లినిక్‌లో వైద్యునిపై కాల్పులు

**అమృత్‌సర్, జూలై 6:** పంజాబ్‌లో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. రోగికి చికిత్స చేస్తుండగా, ఓ వైద్యుడిపై దుండగులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. మోగా జిల్లాలో జరిగిందీ ఘటన. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వైద్యుడి పరిస్థితి విషమంగా ఉంది. మోగా జిల్లాలోని కోట్ ఇసేఖాన్ పట్టణంలోని హార్బన్స్ నర్సింగ్ హోమ్‌లో ఈ దాడి జరిగింది. బాధితుడు డాక్టర్ అనిల్‌జిత్ కంబోజ్‌ను ప్రముఖ పంజాబీ నటి తనేయా తండ్రిగా గుర్తించారు. రోగుల రూపంలో వచ్చిన ఇద్దరు దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. వారిలో ఒకరు తన కాలికి ఇన్ఫెక్షన్ ఉందని, పరీక్షించాలని కోరాడు. డాక్టర్ కంబోజ్ అతని కాలును పరిశీలించేందుకు కిందకు వంగగా, వెనుకనే ఉన్న మరో వ్యక్తి తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ దృశ్యాలన్నీ క్లినిక్‌లోని సీసీటీవీ కెమెరాలో స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ దాడిలో డాక్టర్ కంబోజ్ ఛాతీ, పొట్ట భాగంలోకి రెండు బుల్లెట్లు దూసుకెళ్లాయి. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి బుల్లెట్లను తొలగించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని డాక్టర్ విజయ్ కల్రా తెలిపారు. డాక్టర్ కుమారుడు చాహత్ కంబోజ్ ఫిర్యాదు మేరకు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామన్నారు. పోలీసుల విచారణలో మరికొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు శుక్రవారం ఉదయం 10 గంటలకే క్లినిక్‌కు వచ్చారని, అప్పుడు డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగి మధ్యాహ్నం 12:50 గంటలకు మళ్లీ వచ్చి దాడి చేశారని పోలీసులు తెలిపారు. కాగా, 2022లో డాక్టర్ కంబోజ్‌కు గ్యాంగ్‌స్టర్ లఖ్‌బీర్ సింగ్ లాండా నుంచి డబ్బు కోసం బెదిరింపు కాల్స్ వచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై అప్పట్లోనే మోగా పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దాడి జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రంలో తీవ్రమైన యూరియా కొరత

### కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఫైర్

### బ్లాక్ మార్కెట్‌పై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్

### యూరియా బస్తా ధర రూ.325కు పెరిగిందని ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 6:** తెలంగాణలో తీవ్రమైన ఎరువుల కొరత నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. "సబ్సిడీపై రూ.266.50కి లభించాల్సిన యూరియా బస్తా ధర, ఇప్పుడు రూ.325కి ఎందుకు పెరిగింది? దీనికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, ప్రజలకు సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు. ఈ కృత్రిమ కొరతను ఎవరు సృష్టిస్తున్నారు? తెర వెనుక ఉండి ఈ బ్లాక్ మార్కెట్ దందాను నడిపిస్తున్నదెవరు? అని ప్రశ్నించారు. ఆధార్ కార్డు తప్పనిసరి చేసినా రైతులకు కనీసం ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేని దుస్థితి ఎందుకొచ్చిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ వంటి హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు, ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది.

రాష్ట్రంలో 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత వారమే కేంద్రానికి లేఖ రాశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు గాను తెలంగాణకు 5 లక్షల టన్నుల యూరియాను కేటాయించిన కేంద్రం, కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. తక్షణమే మిగిలిన కోటాను విడుదల చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. అలాగే, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు కూడా లేఖలు రాసి, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ దేవాలయాలు

### ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త :** తొలి ఏకాదశిని పురస్కరించుకుని నగరంలోని పలు వైష్ణవ దేవాయలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ఈ నేపథ్యంలో నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలి ఏకాదశికి హిందూ సంప్రదాయంలో సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే.. తొలి ఏకాదశి అనేది హిందువులకు అత్యంత విశిష్టమైన పండుగ. దీనికి శయన ఏకాదశి లేదా దేవశయని ఏకాదశి అని కూడా పేర్లు ఉన్నాయి తెలుగు సంవత్సరంలో పండుగలకు ఇది నాంది పలుకుతుంది. ఈ తొలి ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువును పూజిస్తే.. కోరిన కోర్కెలన్నీ నెరవేరుతాయని భక్తుల నమ్మకం. తొలి ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై యోగనిద్రలోకి వెళ్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ నిద్రాకాలం 4 నెలల పాటు ఉంటుంది. కార్తీక శుద్ధ ఏకాదశి (ఉత్థాన ఏకాదశి లేదా ప్రభోదిని ఏకాదశి)న ఆయన తిరిగి మేల్కొంటారని భక్తుల విశ్వాసం. ఈ 4 నెలల కాలాన్ని చాతుర్మాస్యం అని అంటారు. ఈ సమయంలో వివాహాలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలు ఎక్కువగా జరపరు. ఆధ్యాత్మికతకు, పూజలు, వ్రతాలకు, దానధర్మాలకు ఈ కాలం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. అలాగే శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లడంతో సృష్టి, స్థితి,లయ కారకత్వాలు పరమశివుడికి, ఇతర దేవతలకు అప్పగించబడతాయని కూడా నమ్ముతారు చాతుర్మాస్య వ్రత ప్రారంభం

తొలి ఏకాదశి రోజు నుంచే చాతుర్మాస్య వ్రతం కూడా ప్రారంభం అవుతుంది. ఈ వ్రతాన్ని ఆచరించే సాధువులు,సన్యాసులు, గృహస్థులు ఈ నాలుగు నెలల పాటు కొన్ని నియమాలను పాటిస్తారు. ఇందులో భాగంగా ఒకే చోట నివసించడం, కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోకపోవడం, ఆధ్యాత్మిక చింతనలో గడపడం వంటివి ఉంటాయి. వర్షాకాలం ప్రారంభంలో వచ్చే ఈ వ్రతం శారీరక,మానసిక శుద్ధికి, ఆధ్యాత్మిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతుంది. ఈ తొలి ఏకాదశి రోజున ఉపవాసం, జపం, ధ్యానం, దానం వంటి కార్యాలకు అపరిమితమైన పుణ్యఫలం లభిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. సూర్యచంద్ర గ్రహణాల్లో భూమి దానాలు ఇచ్చినంత, అశ్వమేధ యాగం చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి.



ఆదివారం తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

## అధికారిక నివాసం ఖాళీ చేయాలని మాజీ చీఫ్‌జస్టిస్‌కు లేఖలు!



**న్యూఢిల్లీ, జూలై 6:** భారత న్యాయవ్యవస్థలో మునుపెన్నడూ లేని విధంగా ఒక అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, పదవీ విరమణ తర్వాత కూడా అధికారిక నివాసాన్ని ఖాళీ చేయకపోవడంతో సుప్రీంకోర్టు యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. గడువు ముగిసినా ఆయన ఇంకా అక్కడే ఉంటున్నారని, ఆ బంగ్లాను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాసింది. ఢిల్లీలోని కృష్ణా మీనన్ మార్గ్‌లో ఉన్న 5వ నంబర్ బంగ్లాను భారత ప్రధాన న్యాయమూర్తికి కేటాయిస్తారు. 2024 నవంబర్‌లో పదవీ విరమణ చేసిన జస్టిస్ చంద్రచూడ్, ఇప్పటికీ అదే బంగ్లాలో నివాసం ఉంటున్నారు. నిబంధనల ప్రకారం పదవీ విరమణ తర్వాత ఆరు నెలల గడువు ఈ ఏడాది మే 10తోనే ముగిసింది. ప్రత్యేక అనుమతితో మే 31 వరకు పొడిగించినా ఆయన బంగ్లాను ఖాళీ చేయలేదు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు యంత్రాంగం జులై 1న కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. జస్టిస్ చంద్రచూడ్ నుంచి బంగ్లాను తక్షణమే స్వాధీనం చేసుకోండి. ఆయనకు ఇచ్చిన అనుమతి గడువు ముగిసిందని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొంది. ఈ వివాదంపై జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. తప్పనిసరి వ్యక్తిగత కారణాల వల్లే ఆలస్యమైందని, ఈ విషయం సుప్రీంకోర్టు యంత్రాంగానికి కూడా తెలుసని ఆయన వివరించారు. నాకు ప్రత్యేక అవసరాలున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి (నెమాలిన్ మయోపతి) కారణంగా వారికి అనువైన ఇల్లు చూసుకోవడానికి కొంత సమయం పట్టింది. ప్రభుత్వం నాకు ప్రత్యామ్నాయ వసతి కేటాయించింది. కానీ ఆ ఇల్లు చాలాకాలంగా మూసి ఉండటంతో మరమ్మతులు జరుగుతున్నాయి. అవి పూర్తయిన మరుక్షణమే నేను మారిపోతానని ఆయన తెలిపారు. తాను అత్యున్నత పదవిలో పనిచేశానని, తన బాధ్యతలు తనకు పూర్తిగా తెలుసని జస్టిస్ చంద్రచూడ్ స్పష్టం చేశారు. మరికొన్ని రోజుల్లోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని ఆయన హామీ ఇచ్చారు. అయితే, సుప్రీంకోర్టు పరిపాలన విభాగం స్వయంగా ఒక మాజీ సీజేఐ నివాసం ఖాళీ చేయించడం కోసం ప్రభుత్వానికి లేఖ రాయడం మాత్రం ఇదే ప్రథమం కావడంతో ఈ విషయం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఆటోల రిజిస్ట్రేషన్‌కు మార్గదర్శకాలు

### లైసెన్స్‌దారుడు ఓఆర్ఆర్ లోపల నివసించే వారై ఉండాలి

### ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వీసు పద్ధతిలో అప్రూవల్

### మార్గదర్శకాలు జారీ చేసిన రవాణా కమిషనర్

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఆటోల రిజిస్ట్రేషన్‌కు మార్గదర్శకాలను జారీ చేశారు. ఆటో కొనుగోలు చేసేవారు ఓఆర్ఆర్ లోపల నివసించే వారై ఉండాల్సి ఉంటుంది. ఒకరికి ఒక ఆటో మాత్రమే ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రవాణా కమిషనర్ ఆదివారం జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున రవాణా, బిసి వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు ఔటర్ రింగ్ రోడ్డు లోపల నివసించే నిరుపేద కుటుంబాలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఔటర్ రింగ్ రోడ్ లోపల కొత్త ఎల్‌పిజి, సిఎన్‌జి, ఎలక్ట్రిక్ ఆటోరిక్షాలకు అనుమతిస్తూ జీవో 263ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలకు అనుగుణంగా రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ దానికి సంబంధించిన మార్గదర్శకాలను ఆదివారం విడుదల చేయడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాలు, రవాణా శాఖ కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆదివారం(జులై 6)న కొత్త ఆటో రిక్షా రిజిస్ట్రేషన్ కోరకై డీలర్ వద్ద నమోదు చేసుకొనుటకు కొత్త సాఫ్ట్‌వేర్ రూపకల్పన చేసి అందుబాటులోకి తేవడం జరిగింది. కొత్త ఆటో రిక్షా కొనుగోలు చేయదలచి వారు రాష్ట్రంలో ఏ ఆటోరిక్షా డీలర్ వద్ద నైనా కొనుగోలు చేయవచ్చు.

**డీలర్‌కు సమర్పించవలసిన పత్రాలు, సూచనలు..**

తమ 3 వీలర్ లైసెన్స్(ఆటో లైసెన్స్), లైసెన్స్‌పై అడ్రస్ ప్రకారం, లైసెన్స్ దారుడు ఓఆర్ఆర్ లోపల నివసించే వారై ఉండాలి. లైసెన్స్‌పై ఉన్న అడ్రస్‌తో పోలిన మరొక అడ్రస్ ప్రూఫ్ అంటే ఆధార్ కార్డు, ఓటర్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, కరెంట్ బిల్లు సమర్పించాలి. ఒక మనిషికి ఒక ఆటోరిక్షా పర్మిషన్ మాత్రమే ఇవ్వడం జరుగుతుంది.

ఇంతకు ముందు అతని పేరుతో ఆటోరిక్షా ఉంటే వారు అనర్హులు. తన పేరు మీద ఇంకొక ఆటో రిక్షా లేదనే ధృవీకరణ అఫిడవిట్‌ను కూడా డీలర్‌కు తప్పకుండా సమర్పించాల్సి ఉంటుంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వీసు పద్ధతిలో అప్రూవల్ ఇవ్వడం జరుగుతుంది. అప్రూవల్ అయిన 60 రోజుల్లోగా వారి ఆటోరిక్షాను సదురు రవాణా శాఖ కార్యాలయములో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.. లేని పక్షంలో అతనికి ఇచ్చిన పర్మిషన్ రద్దవుతుంది.

**డీలర్ కు సూచనలు..**

తన వద్దకు వచ్చిన పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఉన్నవి అన్న తరువాతనే ఆ వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు డీలర్ లాగిన్‌లో నమోదు చేయాలి. పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించే బాధ్యత పూర్తిగా డీలర్‌దే. క్షుణ్ణంగా పరిశీలించిన డీలరు అవసరమైన పత్రాలు అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. డీలర్‌పై ఎలాంటి ఫిర్యాదులు.. అంటే వాహనం ధర కంటే ఎక్కువ ధరకు అమ్మడం, ప్రాసెసింగ్ కోసమని వసూలు చేయడం, బ్లాక్ మార్కెట్ చేయడం, బ్లాక్ చేయడం, రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేయడం వంటి ఇతర కంప్లైంట్ వచ్చినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఆ తరువాత డీలర్ వద్ద నమోదు వివరాలు ఆన్లైన్ ద్వారా ఏ కార్యాలయంకి పంపబడిందో ఆ కార్యాలయ అధికారులు పరిశీలించి 24 గంటల్లోగా అప్రూవల్ ఇవ్వడంగాని, తిరస్కరించడంగాని జరుగుతుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

## ప్రభుత్వం విప్లవకారులతో శాంతి చర్చలు జరపాలి

### ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండను నిలిపివేయాలి

### విరసం ఆవిర్భావ సభలో వక్తలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 6, ప్రభాతవార్త:** తెలంగాణ సాహిత్యంపై విరసం చెదిరిపోని ముద్ర వేసిందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విప్లవ రచయితల సంఘం 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'కాల్పుల విరమణ ఒప్పందాలు - విప్లవధ్యమ పంథా-మార్క్సిస్ట్ దృక్పథం'పై సదస్సు జరిగింది. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తెలంగాణలో ఉండే చైతన్యం ఎక్కడ లేదు, 2004లో, ఇప్పుడు శాంతి చర్చలకు తెలంగాణ ప్రయత్నం చేస్తుందాని అన్నారు, తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడు తుందని, శాంతి చర్చలను ఆహ్వానిస్తున్నాం అని ముఖ్యమంత్రి అన్నారని అన్నారు, పోలీస్ యంత్రాంగం వల్లే శాంతి చర్చలు విఫలం అవుతున్నాయని అన్నారు, ప్రభు త్వాలు చర్చల సంధర్భంలో ద్వంద్వవైఖరి చూపిస్తున్నాయని అన్నా రు, మావోయిస్టుల డిమాండ్ అంతా ప్రజల కనీస అవసరాల చుట్టే తిరుతాయని, అవి గౌరవించి ఆదివాసీలను, దేశ పౌరులను చంపడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అజిత్ మాటాడుతూ విప్లవో ద్యమం విలువలకు కట్టుబడి ఉంటుందని, చరిత్రలో ఎన్ని నిర్బంధాలు విధించిన విప్లవోద్యమం దాని పంథాని మార్చుకోకుండా నిర్బం ధాన్ని ఎదురించిందని, ప్రస్తుత కాలంలో ఎంత రాజ్య నిర్బంధం ఉన్న విప్లవోద్యమం ఏకాకి కాకుండా నిలబడుతుందని అన్నారు. సభలో వరలక్ష్మి మాట్లా డుతూ చర్చలు జరపము అనే హక్కు ప్రభుత్వానికి లేదని, చర్చలే లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేదని అన్నారు, ఆదివాసీలను, విప్లవ కారులను చంపడం అంటే దేశ సంపదని కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పే కుట్రలో భాగమే అన్నారు. జార్ఖండ్ లాంటి రాష్ట్రాలలో వేలకొద్ది ఆదివాసీలను జైళ్లలో నిర్బంధిస్తున్నారని, ఆయుదాలు పట్టుకున్న పేరుతో విప్లవ కారులతో ప్రబుత్వం చర్చలు జరపడం లేదని కానీ , ఆయుధాలు పట్టుకున్న సంస్థలతో ప్రబుత్వాలు గతంలో చాలా చర్చలు జరిపాయి అని అన్నారు. ఒకపక్క సుప్రీం కోర్టు ప్రజలను చంపే హక్కు లేదంటుంటే ప్రభుత్వాలు మాత్రం కగార్ పేరుతో హత్యాకాండను కొనసాగిస్తున్నాయాని, ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విరసం కార్యవర్గ సభ్యుడు పాణి, ప్రొఫెసర్ రమా మేల్కొటే, పోటు రంగరామ, సాధినేని వెంకట్వేరరావు తదితరులు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

## నేరాలకు రాజధానిగా బీహార్: రాహుల్

**న్యూఢిల్లీ, జూలై 6:** బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన ఓ వ్యాపారి హత్య రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యంపై విపక్షాలు అధికార ఎన్డీయే కూటమిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. పాట్నాకు చెందిన వ్యాపారి గోపాల్ ఖేమ్కా హత్య ఘటనతో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం తీవ్రంగా స్పందించారు. నితీశ్ కుమార్ ప్రభుత్వంపై విరుచుకుపడుతూ ఎన్డీయే పాలనలో బీహార్ 'భారతదేశ నేర రాజధాని'గా మారిపోయిందని ఆరోపించారు. ప్రస్తుతం బీహార్ దోపిడీలు, కాల్పులు, హత్యల నీడన బతుకుతోంది. ఇక్కడ నేరాలు సర్వసాధారణమైపోయాయి, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి బీహార్‌ను కాపాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. మరోవైపు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ కూడా ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పట్నా నడిబొడ్డున ఈ దారుణం జరిగితే, ఘటనా స్థలానికి పోలీసులు చేరుకోవడానికి రెండు గంటల సమయం పట్టిందని ఆయన ఆరోపించారు. ఇది చాలా భయంకరమైన సంఘటన. వ్యాపారవేత్తలు బీహార్ విడిచి వెళ్ళిపోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ హత్యోదంతానికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. ఎన్నికల ముందు ఈ ఘటన జరగడంతో, ఇది అధికార కూటమికి రాజకీయంగా ఇబ్బంది కలిగించే అంశంగా మారింది.





## రాఫెల్‌పై చైనా కుట్రలు చేస్తోందని ఫ్రాన్స్ ధ్వజం

**ప్యారిస్, జూలై 6:** తాము తయారుచేసిన రఫేల్ యుద్ధ విమానాల అమ్మకాలను దెబ్బతీయడంతో పాటు, వాటి ప్రతిష్ఠకు భంగం కలిగించడానికి చైనా భారీస్థాయిలో దుష్ప్రచారం చేస్తోందని ఫ్రాన్స్ సంచలన ఆరోపణలు చేసింది. వివిధ దేశాల్లోని చైనా రాయబార కార్యాలయాల్లో పనిచేసే రక్షణ రంగ ప్రతినిధులు ఈ ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారని, రఫేల్ విమానాలను కొనుగోలు చేయవద్దని, వాటి స్థానంలో చైనా తయారీ జెట్లను ఎంచుకోవాలని ఇతర దేశాలను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఫ్రెంచ్ నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా, గత మే నెలలో భారత్‌తో జరిగిన ఘర్షణలో మూడు రఫేల్ విమానాలతో సహా ఐదు భారత విమానాలను కూల్చివేశామని పాకిస్థాన్ చేసిన వాదనలను చైనా వాడుకుంటోందని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. అయితే, ఈ వాదనలను రఫేల్ తయారీ సంస్థ డస్సాల్ట్ ఏవియేషన్ సీఈఓ ఎరిక్ ట్రాపియర్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ అవాస్తవాలని ఆయన స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో కూడా ఈ ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారని, రఫేల్ శిథిలాలని చూపిస్తూ మార్ఫింగ్ చేసిన ఫోటోలు, ఏఐ కంటెంట్, వెయ్యికి పైగా ఫేక్ సోషల్ మీడియా ఖాతాలతో చైనా టెక్నాలజీ గొప్పదనే భావనను వ్యాప్తి చేస్తున్నారని ఫ్రాన్స్ పేర్కొంది. రఫేల్ కేవలం ఒక యుద్ధ విమానం మాత్రమే కాదని, అది ఫ్రాన్స్ వ్యూహాత్మక సామర్థ్యానికి, విశ్వసనీయతకు ప్రతీక అని, అందుకే దాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నారని ఫ్రెంచ్ రక్షణ మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. మరోవైపు ఫ్రాన్స్ చేస్తున్న ఆరోపణలను చైనా జాతీయ రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన పుకార్లు, పరువు నష్టం కలిగించే చర్యలని కొట్టిపారేసింది. సైనిక ఉత్పత్తుల ఎగుమతి విషయంలో తాము ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని స్పష్టం చేసింది

# ఆర్థిక ఒత్తిడిలో ఖజానా

### రూ.5,037 కోట్ల రెవెన్యూ లోటు

### ఆదాయం రూ.32,823 కోట్లు

### వ్యయం రూ.31,740 కోట్లు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం రెండు నెలల్లోనే తెలంగాణ రాష్ట్రం రూ.9,389 కోట్ల ఆర్థిక లోటును, రూ.5,037 కోట్ల రెవెన్యూ లోటును నమోదు చేసింది. పెరుగుతున్న సబ్సిడీలు, తక్కువ మూలధన వ్యయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుత్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లో తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలోనే ఉంది. ఈ సంవత్సరం ప్రారంభంలో సమర్పించబడిన రూ.2,738.33 కోట్ల రెవెన్యూ మిగులు బడ్జెట్‌తో పోలిస్తే రెవెన్యూ లోటు రూ.5,037.39 కోట్లుగా ఉండగా, మే నాటికి ఆర్థిక లోటు ఇప్పటికే రూ.9,389.90 కోట్లకు చేరుకుంది, మొత్తం సంవత్సరానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక లోటు రూ.54,009.74 కోట్లుగా ఉంటుందని వార్షిక అంచా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రాథమిక లోటు రూ. 5,223.55 కోట్లుగా అంచనా వేయబడింది, అలాగే వడ్డీ చెల్లింపులకు ముందే ప్రభుత్వం సమీకరించిన దానికంటే ఎక్కువ ఖర్చు చేస్తోందని సూచిస్తుంది. మే నెలకు సంబంధించి ఆర్థిక శాఖ, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ తాజా నివేదిక ప్రకారం మొత్తం వసూళ్లు రూ.32,823 కోట్లుగా ఉండగా, ఇది వార్షిక బడ్జెట్ అంచనాలు రూ.2.84 లక్షల కోట్లలో 11.52 శాతంగా ఉన్నాయి. ఇందులో రూ.23,425 కోట్లు రెవెన్యూ వసూళ్ల ద్వారా వచ్చాయి, వీటిలో రూ.22,609 కోట్లు పన్నుల ద్వారా ఆదాయం రాగా, రూ.729.93 కోట్లు పన్నుయేతర ఆదాయంగా ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం నుండి గ్రాంట్లు కేవలం రూ.86.73 కోట్లతో చాలా తక్కువగా ఉన్నాయి. ఇక స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, అమ్మకపు పన్ను, కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటాకు సంబంధించిన వసూళ్లు మెరుగుపడినప్పటికీ, గత మే నెలతో పోలిస్తే పన్ను ఆదాయం దాదాపు రూ.200 కోట్ల స్వల్ప పెరుగుదలను చూసింది. కానీ జీఎస్టీ, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు గత సంవత్సరం కంటే తక్కువగా ఉన్నాయి.

ఇదే సమయంలో పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, ఆదాయం ఇంకా వ్యయానికి అనుగుణంగా లేదు, ఈవిధంగా మొత్తం వ్యయం రూ. 31,740 కోట్లకు చేరుకుంది, ఇది బడ్జెట్‌లో పేర్కొన్న రూ. 2.63 లక్షల కోట్లలో దాదాపు 12.05 శాతంగా నమోదైంది. ఇంకా, ప్రభుత్వం ఇప్పటికే తన వార్షిక సబ్సిడీ కేటాయింపు రూ.16,345 కోట్లలో 31 శాతానికి పైగా రూ. 5,199 కోట్లు రెండు నెలల్లోనే ఖర్చు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ కావడం విశేషం. వార్షిక కేటాయింపులలో ఇది 12.81 శాతంగా ఉంది. ఇక మూలధన వ్యయం రూ.3,277 కోట్ల వద్ద తక్కువగా ఉంది, ఇది రూ.36,504.45 కోట్ల లక్ష్యంతో పోలిస్తే కేవలం 8.98 శాతం మాత్రమే, ఇది మౌలిక సదుపాయాల కల్పన వెనుకబడి ఉందని సూచిస్తుంది. మరోపక్క నికర మార్కెట్ రుణాలు రూ.9,389.90 కోట్లకు పెరిగాయి, ఇది వార్షిక వ్యయం రూ. 54,009 కోట్లు. రాష్ట్రంపై పెరుగుతున్న రుణ భారం గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పన్ను ఆదాయ వృద్ధి స్థిరంగా ఉన్నప్పటికీ, నిబద్ధత బాధ్యతలు, ముఖ్యంగా సబ్సిడీలు మరియు పెన్షన్లలో పదునైన పెరుగుదల రాబోయే నెలల్లో ఆర్థిక ఒత్తిడిని ఎక్కువగా ఉంచుతుందని భావిస్తున్నారు.

ఆట

# రోహిత్, కోహ్లీ మ్యాచ్ పెండింగ్

## భారత్, బంగ్లా సిరీస్ వాయిదా
## భద్రతా కారణాల రీత్యా నిర్ణయం




**న్యూఢిల్లీ:** హిట్ మ్యాన్ రోహిత్ శర్మ, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఆడాల్సిన మ్యాచ్‌లు పెండింగ్‌లో పడ్డాయి. దీంతో వీరు మళ్లీ క్రికెట్ గ్రౌండ్‌లోకి అడుగు పెట్టడానికి మరి కొన్ని రోజులు వేచి ఉండాల్సిందే. బంగ్లాదేశ్, భారత్ మధ్య ఆగస్టులో జరగాల్సిన వైట్‌బాల్ సిరీస్ వాయిదా పడింది. సిరీస్ ను వాయిదా వేయడానికి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు, భారత క్రికెట్ నియంత్రణ బోర్డు ఈ వాయిదా నిర్ణయాన్ని తీసుకున్నాయి. షెడ్యూల్ ప్రకారం భారత్, బంగ్లాదేశ్ రెండు జట్ల మధ్య సిరీస్ ఆగస్టులో జరగాల్సి ఉంది. అయితే అనివార్య కారణాలతో వచ్చే ఏడాది సెప్టెంబర్ కు వాయిదా వేశారు. బంగ్లాదేశ్ టూర్ లో భారత్ 3 వన్డే మ్యాచ్‌లు, 3 టీ20 మ్యాచ్ లు జరగాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17 నుండి 31 వరకు చిట్టగాంగ్, ఢాకాలో ఈ సిరీస్ లు జరగాల్సి ఉంది. అయితే సిరీస్ ను వాయిదా వేస్తూ ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ఒక అంగీకారానికి వచ్చాయి. అంతర్జాతీయ క్రికెట్ కమిట్ మెంట్స్, రెండు జట్ల షెడ్యూల్ సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, రెండు బోర్డుల మధ్య చర్చల అనంతరం వాయిదా నిర్ణయం తీసుకున్నామని భారత్ క్రికెట్ బోర్డు తాజాగా తెలిపింది. పర్యటనను సంబంధించి సవరించిన తేదీలు, మ్యాచ్‌లను త్వరలోనే ప్రకటిస్తామంది. షెడ్యూల్ ప్రకారం భారత జట్టు ఆగస్టులో బంగ్లాదేశ్ వెళ్లాల్సి ఉంది. అయితే, బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అశాంతి కారణంగా ఈ సిరీస్ వాయిదా పడినట్లు తెలుస్తుంది. భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో ఈ పర్యటనకు భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో సిరీస్‌ను ఇరు జట్ల బోర్డులు వాయిదా వేసినట్లు అధికారికంగా ప్రకటించాయి. ఈ సిరీస్ కొత్త షెడ్యూల్‌ను తగిన సమయంలో ప్రకటిస్తామంది. కాగా భారత్, బంగ్లా సిరీస్ వాయిదా పడటంతో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ క్రికెట్ గ్రౌండ్ లోకి రావడం మరింత ఆలస్యం కానుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ప్రస్తుతం వన్డేలు మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. ఈ దిగ్గజ బ్యాటర్లు ఇద్దరూ ఒకేసారి టీ20లకు, టెస్టులకు రిటైర్ మెంట్ ప్రకటించారు. దీంతో వీరిద్దరిని ఎప్పుడెప్పుడు వన్డేల్లో చూస్తామా అని అభిమానులు ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ సిరీస్ రద్దు కావడంతో వారు కొంత నిరాశ చెందారు.



## వింబుల్డన్ పురుషుల డబుల్స్‌లో
# రిత్విక్, బాలాజీ నిష్క్రమణ
### భారత్ ఆశలు సజీవంగా ఉంచిన భాంబ్రీ

**న్యూఢిల్లీ:** వింబుల్డన్ టోర్నమెంట్‌లో భాగంగా పురుషుల డబుల్స్‌లో ప్లేయర్లు బొల్లేపల్లి రిత్విక్, ఎన్ శ్రీరామ్ బాలాజీ నిష్క్రమించగా, యుకీ భాంబ్రీ దూసుకుపోతున్నాడు. పురుషుల డబుల్స్ రౌండ్ ఆఫ్ 16లోకి ప్రవేశించడం ద్వారా యుకీ భాంబ్రీ 2025 వింబుల్డన్‌లో భారత ఆశలను సజీవంగా ఉంచుకున్నాడు. అమెరికన్ రాబర్ట్ గాల్లోవేతో కలిసి, భాంబ్రీ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఈ జంట పోర్చుగల్‌కు చెందిన నునో బోర్జెస్ మరియు అమెరికాకు చెందిన మార్కోస్ గిరోన్‌ను 6-3, 7-6(8) తేడాతో వరుస సెట్లలో ఓడించారు. ఆత్మవిశ్వాసంతో కూడిన నెట్ ప్లే మరియు దృఢమైన సర్వింగ్‌తో, భాంబ్రీ-గాల్లోవే రెండవ సెట్ టైబ్రేక్‌లో తమ పట్టును నిలుపుకుని మూడవ రౌండ్‌లో తమ స్థానాన్ని ఖాయం చేసుకున్నారు. ఇంతలో, రిత్విక్-బాలాజీ ఇద్దరూ పురుషుల డబుల్స్ ఈవెంట్ యొక్క రెండవ రౌండ్లో ఉత్సాహంగా ప్రయత్నించినప్పటికీ ఓడిపోయారు. కోర్టు 6లో, బొల్లిపల్లి మరియు కొలంబియాకు చెందిన నికోలస్ బారియంటోస్ బ్రిటిష్ జంట జో సాలిస్‌బరీ మరియు నీల్ స్కుప్స్కిలను గరిష్ట స్థాయికి నెట్టి, రెండు సెట్ల హోరాహోరీ పోరులో 4-6, 6-7 (79) తేడాతో ఓడిపోయారు. రెండో సెట్ టైబ్రేక్‌లో ఇండోకొలంబియన్ ద్వయం తీవ్రంగా పోరాడింది, సెట్ పాయింట్లను కూడా కలిగి ఉంది, కానీ మాజీ గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్‌లైన అనుభవజ్ఞులైన బ్రిటిష్ జట్టు కీలక సమయాల్లో తమ ధైర్యాన్ని నిలుపుకుని వరుస సెట్లలో విజయం సాధించింది. ఇంతలో, కోర్ట్ 14లో, బాలాజీ మరియు అతని మెక్సికన్ భాగస్వామి మిగ్యుల్ ఏంజెల్ రెయెస్‌వరేలా 4-6, 4-6 తేడాతో నాల్గవ సీడ్ అర్జెంటీనాకు చెందిన హొరాసియో జెబాలోస్, స్పెయిన్‌కు చెందిన మార్సెల్ గ్రానోల్లర్స్ చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో భారత జోడీ యుకీ భాంబ్రీ మరియు చైనా జోడీ జియాంగ్ జిన్యు రౌండ్‌కు చేరుకున్నారు.

## మహిళల ఆసియా కప్ డూ ఆర్ డై పోరులో
# సంగీత సంచలనం




**న్యూఢిల్లీ:** చారిత్రాత్మక ఎఫ్‌సి మహిళల ఆసియా కప్ టోర్నమెంట్‌లో బ్రేస్ ఇండియా సంగీతా బాస్ఫోర్ అర్హత సాధించింది. భారత్ మహిళల ఫుట్‌బాల్ భవిష్యత్తును పునర్నిర్మించగల ఉత్కంఠభరితమైన విజయంలో సంగీతా రెండు గోల్స్ చేసింది. భారత మహిళా ఫుట్‌బాల్ జట్టు థాయిలాండ్‌ను డూ ఆర్ డై పోరులో 2-1 తేడాతో ఓడించి, క్వాలిఫయర్స్ మార్గంలో తొలిసారిగా మహిళల ఆసియా కప్ 2026కి అర్హత సాధించడంతో భారత ఫుట్‌బాల్‌లో ఒక మైలురాయి ఆవిష్కృతమైంది. సంగీతా బాస్ఫోర్ అద్భుతమైన బ్రేస్ గోల్స్ సాధించి బ్లూ టైగ్రెస్‌లను చరిత్రలో అత్యంత ముఖ్యమైన విజయాలలో ఒకదానికి తీసుకెళ్లింది. ఇంతకు ముందు ఎప్పుడూ థాయిలాండ్‌ను ఓడించని మరియు గతంలో ఖండాంతర ప్రదర్శనలో ఆతిథ్య లేదా ఆహ్వానితులుగా మాత్రమే పాల్గొన్న జట్టుకు, ఈ విజయం ఒక మలుపు తిరిగినట్లయింది. దీంతో భారత్ ఫుట్‌బాల్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. జిరాపోర్న్ మోంగ్‌కోల్డీ మరియు సావోలక్ పెంగ్‌గం ఇద్దరూ భారత గోల్ కీపర్ ఎలాంగ్‌బామ్ పాంథోయ్‌ను పరీక్షించడంతో, థాయిలాండ్‌కు తొలి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. కానీ భారత రక్షణ బలంగా ఉంది. ఆ తర్వాత, 29వ నిమిషంలో సంగీతా బాస్ఫోర్ థాయ్ బాక్స్ వెలుపల బంతిని సేకరించి, అద్భుతమైన షాట్ భారతదేశానికి 1-0 ఆధిక్యాన్ని ఇచ్చింది. థాయ్ గోల్ కీపర్ మరియు డిఫెండర్ కాంజనపోర్న్ సేంఖున్ చేసిన డ్రైవ్ సైడ్ నెట్‌ను తాకడంతో థాయిలాండ్ కూడా ఆధిక్యాన్ని సాధించింది. విరామ సమయానికి, స్కోరు 1-0తో కొనసాగింది. రెండవ అర్ధభాగం అధిక తీవ్రతతో ప్రారంభమైంది. 50వ నిమిషంలో, థాయిలాండ్ మిడ్‌ఫీల్డర్ చట్చవాన్ రోడ్‌థాంగ్ లాంగ్‌రేంజ్ భారత నెట్‌లోకి దూసుకెళ్లి స్కోరును 1-1తో సమం చేసింది. కొన్ని క్షణాల్లో థాయిలాండ్ ఆటను దాదాపుగా మలుపు తిప్పింది పాంథోయ్ అద్భుతంగా సేవ్ చేసి ముఖ్యమైన సమయంలో అండగా నిలిచాడు. కానీ జోరు మారుతున్నట్లు అనిపించగానే, భారతదేశం మళ్ళీ దెబ్బకొట్టింది. 68వ నిమిషంలో, నిర్మలా దేవి బాక్స్‌లోకి ఒక పదునైన కార్నర్‌ను అందించింది, మరియు సంగీతా బాస్ఫోర్ అత్యధికంగా లేచి రాత్రి తన రెండవ గోల్‌ను గోల్‌గా మార్చడంతో భారత్ ఆధిక్యంలోకి వచ్చింది.



## వరల్డ్ బాక్సింగ్ కప్‌లో..
# ఫైనల్‌కు హితేష్

**న్యూఢిల్లీ:** వరుసగా రెండో ప్రపంచ కప్ ఫైనల్‌కు భారత్ బాక్సర్ హితేష్ గులియా దూసుకెళ్లాడు. ఫలితంగా ప్రపంచ బాక్సింగ్ కప్-2025లో భారత్ ఖాతాలో 11 పతకాలు ఖాయమయ్యాయి. కిస్తాన్‌లోని అస్తానాలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ కప్‌లో హితేష్ గులియా వరుసగా రెండోసారి ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఇప్పటికే మీనాక్షి (మహిళల 48 కిలోలు), సాక్షి (మహిళల 54 కిలోలు), పూజా రాణి (మహిళల 80 కిలోలు), జుగ్నూ (పురుషుల 85 కిలోలు) వారి వారి వెయిట్ కేటగిరీలలో ఫైనల్స్‌కు చేరుకున్న తర్వాత, హితేష్ (70 కిలోలు) తో పాటు, భారత బాక్సింగ్ బృందం కనీసం ఆరు స్వర్ణ పతకాల కోసం పోటీపడుతోంది. అభినాష్ జామ్వాల్ (పురుషుల 65 కిలోలు) ఫైనల్‌కు చేరుకునే ప్రయత్నంలో ఉండటంతో, ఆస్తానా నుండి భారత్‌కు 11 పతకాలు ఖాయం అయ్యాయి. 48 కిలోల సెమీఫైనల్లో టర్కీకి చెందిన నర్సెలెన్ యాల్గెట్టెకిన్‌ను 5-0 తేడాతో ఓడించి మీనాక్షి దూకుడు ప్రదర్శనతో భారత జట్టును ప్రారంభించింది. ఆ తర్వాత సాక్షి తన ప్రతిభను ప్రదర్శించింది. మరియు 54 కిలోల వెయిట్ కేటగిరీలో అదే తేడాతో ఫైనల్‌కు చేరుకుంది. ఫ్రాన్స్‌కు చెందిన మకాన్ ట్రోర్‌తో జరిగిన మొదటి రౌండ్ తర్వాత బ్రెజిల్ లెగ్ స్వర్ణ పతక విజేత హితేష్ గులియా ఇబ్బందుల్లో ఉన్నట్లు కనిపించాడు. ఆ తర్వాత ఒలింపియన్ పూజా రాణి 80 కిలోల విభాగంలో టర్కీకి చెందిన ఎలిఫ్ గునేరిని ఓడించి 3-2 తీర్పుతో ఫైనల్‌కు చేరుకుంది. అంతకు ముందు 80+ విభాగంలో నుపుర్ ఇప్పటికే తన ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది, దీనితో ఫైనల్స్‌లో నలుగురు భారత మహిళా బాక్సర్లు ఉన్నారు. సంజు (60 కిలోలు) కూడా సెమీఫైనలిస్ట్‌గా నిలిచింది. ఇంగ్లాండ్‌కు చెందిన టీగన్ స్కాట్‌ను జుగ్నూ 50 తేడాతో ఓడించాడు.

# కెనడా ఓపెన్‌లో శ్రీకాంత్ ఔట్

**న్యూఢిల్లీ:** కెనడా ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్ నుండి భారత్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ అనూహ్యంగా నిష్క్రమించాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్ తొలి గేమ్‌లో విజయం సాధించినప్పటికీ, మాజీ ప్రపంచ నంబర్ 1 జపాన్‌కు చెందిన మూడో సీడ్ కెంటా నిషిమోటో చేతిలో పరాజయం చెందాడు. ఈ టోర్నమెంట్‌లో నిషిమోట్‌తో జరిగిన మ్యాచ్‌లో 21-19, 14-21, 18-21 తేడాతో ఓడిపోయాడు. శ్రీకాంత్ తొలి గేమ్‌లో 5-8తో వెనుకబడి, పోటీకి అత్యుత్తమ ఆరంభాలు ఇవ్వలేదు. నిషిమోటో మొదటి గేమ్‌లో ఎక్కువ భాగం షాట్‌లకు ప్రాధాన్యత నిస్తూ రావడంతో 18-16తో ఆధిక్యంలో ఉన్నాడు. అయితే, ఎదురుదాడి చేసిన తరువాత ఆరు పాయింట్లలో ఐదు పాయింట్లను గెలుచుకుని జపాన్ షట్లర్‌ను ఆశ్చర్యపరిచాడు. యువ శంకర్ ముత్తుసామి తన కోచింగ్ కార్నర్‌లో ఉండగా 21-19తో కఠినమైన పోరాట ప్రారంభ గేమ్‌ను గెలుచుకున్నాడు. నిషిమోటో సులభంగా విజయం సాధించే పరిస్థితి ఎదురుకావడంతో శ్రీకాంత్ 2-7తో వెనుకబడ్డాడు. అయినా శ్రీకాంత్ నిరంతరం శ్రమిస్తూ 16-14 ఆధిక్యాన్ని తగ్గించగలిగాడు. దీంతో చివరి తొమ్మిది పాయింట్లలో ఏడింటిని గెలుచుకుని నిషిమోటో ఫైనల్‌కు చేరాడు.

# పసిడి కొనుగోలులో జాగ్రత్తలు మస్ట్..

**ముంబై, జులై 6:** భారతదేశంలో మొత్తం బంగారం డిమాండ్ 2024లో 802.8 టన్నులకు పెరిగింది. 2023లో 761 టన్నుల ఉంటే ఐదు శాతం పెరిగింది. బలమైన ఆభరణాల కొనుగోళ్లతో పాటు బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడి ఆసక్తి పెరుగుదల వల్ల ఈ స్థాయి కొనుగోళ్లు సాధ్యమయ్యాయి. అయితే చాలా మంది భారతీయులు సాంస్కృతిక బంగారం కొనుగోలును మంచి ఆర్థిక పెట్టుబడి అని భావిస్తారని నిపుణులు చెబుతున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో ముఖ్యంగా



వివాహాలు, పండుగల చుట్టూ బంగారం ప్రాముఖ్యత చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే బంగారం విలువను కలిగి ఉన్నప్పటికీ అది ఇతర ఆస్తుల మాదిరిగా రాబడిని ఇవ్వదని నిపుణులు పేర్కొన్నారు. డివిడెండ్ చెల్లించే స్టాక్‌లు, అద్దె సంపాదించే ఆస్తి లేదా వడ్డీని ఉత్పత్తి చేసే బాండ్ల మాదిరిగా కాకుండా బంగారం లాకర్‌లో ఉంటుందని వివరిస్తున్నారు. ప్రజలు బంగారంలో తమ డబ్బులో 2030 శాతం వెంటనే మేకింగ్ ఛార్జీల వల్ల నష్టపోతున్నారని పెద్దగా పట్టించుకోరని నిపుణులు చెబుతున్నారు. మీరు ఆభరణాలను పెట్టుబడిగా భావించి కొనుగోలు చేస్తుంటే మీరు నష్టంతో ప్రారంభిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచు కోవాలని కోరుతున్నారు. అలాగే ద్రవ్యతతో పాటు భద్రత కూడా ప్రధాన సమస్యగా మారుతుందని చెబుతున్నారు. స్వచ్ఛత తనిఖీలు, డీలర్ కోతల కారణంగా భౌతిక బంగారాన్ని నగదుగా మార్చడం కష్టం కావచ్చని చెబుతు న్నారు. కాబట్టి బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి గోల్డ్ ఈటీఎఫ్‌లు మంచి ఎంపికగా అని సూచిస్తున్నారు. గోల్డ్ ఈటీఎఫ్‌లు నిల్వ ఇబ్బందులతో పాటు ఛార్జీలు లేకుండా మీకు మంచి ధరను అంది స్తాయని సూచిస్తున్నారు. బంగారం అనేది మీ పెట్టు బడి పోర్ట్‌ఫోలియోలో భాగం కావాలి కానీ మొత్తం ప్రణాళికలో భాగం కాకూడదని సూచిస్తున్నారు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్‌లు, ఎన్‌పీఎస్ వంటి పదవీ విరమణ పథకాలు మీ డబ్బు వృద్ధి చెందడానికి సహాయ పడతాయని కాబట్టి ఆ రంగంలో కూడా పెట్టుబడులను వైవిధ్యపర్చాలని సూచిస్తున్నారు. అయితే క్యూ1 చివరి రోజున బంగారం ధరలు బాగా పెరిగాయి. ఎంసీఎక్స్‌లో 10 గ్రాములకు రూ.550 పెరిగి రూ.96,014కి చేరుకుంది. ప్రపంచ మార్కెట్లు, భారతీయ ఈక్విటీల్లో క్షీణత తర్వాత ధర పుంజుకుంది. సెన్సెక్స్, నిఫ్టీ 121 పడిపోతే పెట్టుబడిదారులు వెంటనే బంగారం వైపు మొగ్గు చూపుతూ ఉంటారు. కాబట్టి బంగారం ధర విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పెట్రోల్ బంకుల్లో మోసాలెన్నో..

**న్యూఢిల్లీ, జులై 6:** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల సామాన్యులకు పెను భారంగా మారాయి. భారీగా పెరిగిన ధరలతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ధరలతో ఒకవైపు జేబులు గుల్ల చేసుకుంటుంటే.. మరోవైపు కొన్ని పెట్రోల్ బంకుల వాళ్లు చేసే మోసాలకు కూడా బలవుతున్నారు. షార్ట్ ఫ్యూయలింగ్ అనేది ఒక సాధారణ మోసపూరిత పద్ధతి, ఇది కస్టమర్లు అప్రమత్తంగా లేకుంటే సులభంగా చేయవచ్చు. కస్టమర్ తమ వాహనానికి కొంత మొత్తానికి ఇంధనం నింపాలనుకున్నప్పుడు ఇది జరుగుతుంది. కానీ ఇంధన కేంద్రంలోని అటెండెంట్ మీటర్‌ను రీసెట్ చేయనప్పుడు మీరు పూర్తి మొత్తాన్ని చెల్లించి తక్కువ ఇంధనాన్ని పొందుతారు. ఉదాహరణకు - మీరు రూ.1,000పెట్రోల్ కొట్టమన్నప్పుడు.. అటెండెంట్ మీటర్‌ను సున్నాకి రీసెట్ చేయకుండా ఇప్పటికే 200 వద్ద ఉన్నదాన్ని కొనసాగిస్తూ మీకు పెట్రోల్ కొట్టేశాడు. రూ.1000 నంబర్ రాగానే పెట్రోల్ కొట్టేయడం ఆపేస్తాడు. మీరు రూ.1000 ఇచ్చేసి వెళ్లిపోతారు. కానీ, నిజానికి అతను మీ వాహనంలో కేవలం రూ.800 పెట్రోల్ మాత్రమే నింపాడు. మిగతా రూ.200 అతను మిమ్మల్ని జీరో రీ సెట్ చేయకుండా మోసం చేశాడు. అందుకే కచ్చితంగా రీడింగ్‌పై పెట్రోల్ కొట్టే ముందు జీరో ఉందో లేదో చూసుకోండి. కొన్నిసార్లు ఇంధన పంపిణీ యంత్రాలలో ఎంటర్ చేసిన దాని కంటే తక్కువ పెట్రోల్, డీజిల్ వచ్చేలా ముందే ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చుతారు. కానీ మీటర్ పూర్తి మొత్తాన్ని చూపుతుంది. 2020లో తెలంగాణలో ఇలాంటి సంఘటన వెలుగులోకి వచ్చాయి. అక్కడ పెట్రోల్ పంపులకు చిప్‌లను ఏర్పాటు చేసి, ప్రతి 1,000 ఎంఎల్ పెట్రోల్/డీజిల్‌కు 970ఎంఎల్ ఇంధనాన్ని పంపిణీ చేస్తున్నారు. పెట్రోల్ పరిమాణం గురించి మీకు అనుమానం ఉంటే, మీరు ఐదులీటర్ల పరిమాణ పరీక్ష కోసం అడగవచ్చు. పెట్రోల్‌పంపులు 5లీటర్ కొలతను కలిగి ఉంటాయి. ఈ రోజుల్లో కొన్ని పెట్రోల్ పంపులు మీ వాహనాన్ని సాధారణఇంధనానికి బదులుగా సింథటిక్ ఆయిల్‌తో నింపే కొత్త ఉపాయాన్ని ఉపయోగించడం ప్రారంభించాయి.



## వాణిజ్యం

# వయో వృద్ధులకు 'ఆధార్' ఉంటే రూ.5లక్షల బీమా

**న్యూఢిల్లీ, జులై 6:** భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ సౌలభ్యాన్ని పెంచే దిశగా ఒక ముఖ్యమైన చర్యలో భాగంగా ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్‌ఆరోగ్య యోజన పథకాన్ని ప్రకటించింది. 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్లకు వారి ఆదాయంతో సంబంధం లేకుండా బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. సుమారు 4.5 కోట్ల కుటుంబాలకు సమగ్ర ఆరోగ్య కవరేజీని అందించడంతో దాదాపు 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్ల కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా కవర్ ద్వారా ప్రయోజనం పొందవచ్చు. లబ్ధిదారులు ఆయుష్మాన్ భారత్ సీనియర్ సిటిజన్ పథకానికి ప్రత్యేక వెబ్‌సైట్ పోర్టల్, ఆయుష్మాన్ యాప్ ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన పత్రాలు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్. సీనియర్ సిటిజన్లు ఆయుష్మాన్ కార్డు కోసం అధికారిక జాతీయ ఆరోగ్య అథారిటీ వెబ్‌సైట్ లేదా ఆయుష్మాన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా ఎన్‌హెచ్‌ఏ బెనిఫిషియరీ పోర్టల్‌ని సందర్శించాలి. మీ ఫోన్ నంబర్‌ను నమోదు చేసి, క్యాప్చాను ఎంటర్ చేసి ఓటీపీ ద్వారా ధ్రువీకరించాలి. 70 సంవత్సరాల అంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్ల కోసం అని ఉన్న బ్యానర్‌పై క్లిక్ చేయాలి. మీ రాష్ట్రం, జిల్లా, ఆధార్ నంబర్‌ను అందించాలి. కేవైసీ ధ్రువీకరణ కోసం ఆధార్ ఓటీపీను ఉపయోగించాలి. అనంతరం ఇటీవలి ఫోటోను అప్‌లోడ్ చేయాలి. ఆమోదం పొందిన తర్వాత ఆయుష్మాన్ వయ వందన కార్డ్‌ను 15 నిమిషాల్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొబైల్ అప్లికేషన్ ప్రాసెస్, మీ మొబైల్‌లో ఆయుష్మాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నంబర్‌ను నమోదు చేసి, క్యాప్చా ఎంటర్ చేసి ఓటీపీ ద్వారా ధ్రువీకరించాలి. ఆధార్ సమాచారం, డిక్లరేషన్‌ను అందించాలి. అంటే ఇటీవలి ఫోటోగ్రాఫ్‌ను అప్‌లోడ్ చేయాలి. లబ్ధిదారుడు, కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలి. ఆపై ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి. రిజిస్ట్రేషన్ విజయవంతమైన తర్వాత వెంటనే కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసి ఓటీపీ ధ్రువీకరణకు సమ్మతి ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్), మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం (ఈసీహెచ్ఎస్) లేదా ఆయుష్మాన్ సీఏపీఎఫ్ వంటి ఇతర ప్రజారోగ్య బీమా పథకాలలో ప్రస్తుతం చేరిన సీనియర్ సిటిజన్లు తమ ప్రస్తుత పథకాన్ని కొనసాగించడాన్ని ఎంచుకోవచ్చు లేదా ఏబీపీఎంజేఏవైకు మారవచ్చు. ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ లేదా ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్ పరిధిలోకి వచ్చే సీనియర్ సిటిజన్లు కూడా ఏబీ పీఎంజేఏవై కింద ప్రయోజనాలకు అర్హులు.




# ఎస్‌బిఐ క్రెడిట్ కార్డు హోల్డర్లకు అలర్ట్

**ముంబై, జులై 6:** ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు హోల్డర్స్‌కు ఆ బ్యాంకు కీలక అప్‌డేట్ ఇచ్చింది. జులై 15, 2025 నుంచి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన నిబంధనలు మారతాయని స్పష్టం చేసింది. ఈ మార్పులు మీరు మీ బిల్లులు చెల్లించే విధానాలతో పాటు మీరు పొందే ప్రయోజనాలను ప్రభావితం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం, చాలా మంది కార్డుదారులు ఆలస్య ఛార్జీలను నివారించడానికి వారి బిల్లులో కొద్ది మినిమమ్ డ్యూను చెల్లిస్తున్నారు. అయితే జూలై 15 నుంచి కనీస మొత్తం బకాయి (ఎంఏడీ) లెక్కించే విధానం మారుతుంది. మీ ఎంఏడీలో 100 శాతం జీఎస్టీ, ఈఎంఐ మొత్తాలు, ఛార్జీలు, ఫైనాన్స్ ఛార్జీలు ఏదైనా ఓవర్‌లిమిట్ మొత్తం, మిగిలిన బ్యాలెన్స్‌లో 2 శాతం ఉంటాయి. ఇప్పటి నుంచి మీరు చెల్లించే మొత్తం మొదట జీఎస్టీ, తరువాత ఈఎంఐ, తరువాత ఛార్జీలు, వడ్డీ, చివరగా రిటైల్ షాపింగ్ లేదా నగదు ఉపసంహరణ వంటి మీ ప్రధాన ఖర్చులకు సర్దుబాటు చేస్తారు. కాబట్టి మీరు చెల్లించని ఛార్జీలు లేదా ఫైనాన్స్ ఛార్జీలు ఉంటే, మీ చెల్లింపు మొదట వాటిని క్లియర్ చేస్తుంది. మీరు మొత్తంలో కొంత భాగాన్ని మాత్రమే చెల్లిస్తే మీ ఇతరఖర్చులపై వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. అలాగే ఉచిత విమాన ప్రమాద బీమాను తమ కార్డులపై ఆస్వాదించిన కస్టమర్లకు మరో పెద్ద మార్పు వచ్చింది. అనేక ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులు గతంలో రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఉచిత విమాన ప్రమాద బీమా కవర్‌ను అందించేవి.




# అవగాహనతోనే మంచి రాబడి

**ముంబై, జులై 6:** మ్యూచువల్ ఫండ్స్ అనేవి వివిధ పెట్టుబడిదారుల నుంచి డబ్బును సమీకరించి స్టాక్‌లు, బాండ్లు లేదా ఇతర మనీ మార్కెట్ సాధనాలకు సంబంధించిన విభిన్నమైన పోర్ట్‌ఫోలియోను సృష్టిస్తాయి. ఈ నిధులను ఫండ్ మేనేజర్లు చురుగ్గా లేదా నిష్క్రియాత్మకంగా నిర్వహిస్తారు. వీటిని ట్రేడింగ్ రోజు చివరిలో ఫండ్‌కు సంబంధించిన నికర ఆస్తి విలువ (ఎన్ఏవీ) అని పిలిచే ధరకు కొనుగోలు చేస్తారు లేదా విక్రయిస్తారు. పెట్టుబడిదారులు మ్యూచువల్ ఫండ్ ద్వారా వారికి కేటాయించిన యూనిట్లను కలిగి ఉంటారు. అంతర్లీన ఆస్తులపై యాజమాన్యం కలిగి ఉండరు. అయితే స్టాక్స్ విషయానికి వచ్చేసరికి దీనిని ఈక్విటీ అని కూడా పిలుస్తారు. అంటే కంపెనీలో ఒక భాగాన్ని సొంతం చేసుకోవడం. ఇవి కంపెనీ ఆదాయాలు, నష్టాలపై దామాషా ప్రకారం మీకు హక్కును ఇస్తాయి. ఒక కంపెనీ బాగా పనిచేస్తే మీ పెట్టుబడి త్వరగా పెరుగుతుంది. కానీ అది పేలవంగా పనిచేస్తే, మీరు డబ్బును కోల్పోవచ్చు. మ్యూచువల్ ఫండ్స్/స్టాక్స్ ఈ రెండింటి మధ్య నిర్ణయం తీసుకునేటప్పుడు వాటి తేడాలను అర్థం చేసుకోవడంతో పాటు మీ పెట్టుబడి లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవడం చాలా అవసరం. వైవిధ్యీకరణ. మ్యూచువల్ ఫండ్స్ తక్షణ వైవిధ్యీకరణను అందిస్తాయి. ఎందుకంటే మీరు స్టాక్‌లు, బాండ్‌లు లేదా ఇతర ఆస్తులకు సంబంధించిన వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడి పెట్టవచ్చు. కానీ స్టాక్‌లతో వైవిధ్యీకరణను సాధించడానికి మీరు బహుళ కంపెనీల్లో (సాధారణంగా 1520 స్టాక్‌లు) పెట్టుబడి పెట్టాలి. మ్యూచువల్ ఫండ్లలో రిస్క్ ఉంటుంది. కానీ ఇది నేరుగా స్టాక్‌లలో పెట్టుబడి పెట్టడం కంటే తక్కువ. ఫండ్ల రాబడి పనితీరు, మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు వ్యక్తిగత స్టాక్‌లలో పెట్టుబడి పెట్టడంవల్ల ఎక్కువరిస్క్ ఉంటుంది. కానీ అవి అధిక రాబడిని కూడా అందిస్తాయి. ఖర్చు, పన్ను ప్రయోజనాలు మ్యూచువల్ ఫండ్స్ ఖర్చులు చాలా తక్కువగా ఉంటాయి. అలాగే ఈక్విటీలింక్డ్ సేవింగ్స్ స్కీమ్ వంటి కొన్ని నిధులు సెక్షన్ 80 సీ తగ్గింపులకు అర్హత పొందుతాయి. కానీ వ్యక్తిగత స్టాక్స్ హామీ ఇవ్వబడిన రాబడి లేని బహుళ కంపెనీలలో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *r esponsible for selection of News under the Pr B Act. r NI No.APTEL/2001/7563.Postal Licence r egd. No. H/KAr /89/12-14